www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 14-10-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 179

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి ఉ. 6.42, ద్వాదశి తె. 3.42 వరకు; నక్షత్రం: శతభిషం రా. 12.43 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: ఉ. 9.24-10.52; దుర్ముహూర్తం: మ. 12.24-1.10, మ. 2.43-3.30; అమృతఘడియలు: రా. 6.09-7.36; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.50

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పుంజుకుంటున్న ట్రంప్!

కమలా హ్యారిస్ శిబిరంలో కలవరం.. పోరు రసవత్తరం.. తేడా 2 శాతమే

- అమెరికా అధ్యక్ష ఎన్నికలపై తాజా సర్వేల్లో వెల్లడి
- కీలక 'స్వింగ్' రాష్ట్రాల్లో మాజీ అధ్యక్షుడి ముందంజ
- హ్యారిస్‌ను భయపెడుతున్న హరికేన్లు, యుద్ధం
- ఇజ్రాయెల్‌కు మద్దతివ్వడంపై అరబ్ ఓటర్లలో ఆగ్రహం



- ట్రంప్ ఆర్థిక విధానాలపై ఆర్థికవేత్తల ఆందోళన
- దిగుమతి సుంకాల పెంపు యోచనపై ధ్వజం

2

చానా ముదురు!

కూటమి సర్కారులో చక్రం తిప్పుతున్న రాజ్యాంగేతర శక్తి

మంత్రి లోకేశ్ పేరు చెబుతూ మంత్రాంగం
మైనింగ్, కాంట్రాక్టులు, పోస్టింగ్‌ల్లో హవా!

- 'అన్నీ నేనే' అంటూ వారితో మీటింగ్‌లు
- ఆధారాలు చూపిస్తూ స్వీయ బల ప్రదర్శన
- గతంలో సీబీఐ కేసుల్లో లాబీయింగ్
- సీబీఐ చీఫ్‌ల మధ్య చిచ్చు పెట్టింది ఈయనే
- సీబీఐ, ఈడీ కేసుల్లో అప్పట్లో అరెస్టు
- తాజా ఎన్నికల్లో టికెట్ కోసం యత్నాలు
- దండం పెట్టి వదిలించుకున్న పార్టీలు
- కూటమి సర్కారులో హల్‌చల్

- నాకేం కావాలో ఇవ్వండి! మీకేం కావాలో చెప్పండి!
- నాకు ఇవ్వాల్సింది ఇవ్వండి! ఆ తర్వాతే... మైనింగ్!
- కోరుకున్న పోస్టింగ్ కావాలా? అయితే... కాంటాక్ట్ మి!
- బిల్లులు క్లియర్ కావాలా! కమీషన్ కొడితే ఆల్ ఓకే!

ఏమిటిదంతా అనుకుంటున్నారా!? కూటమి సర్కారులో 'నేనే సూపర్ పవర్' అని చెప్పుకొంటున్న ఒక రాజ్యాంగేతర శక్తి దందా ఇది! గోదావరి జిల్లాలకు చెందిన ఆ వ్యక్తి పేరు ఇప్పుడు రాష్ట్ర రాజకీయ, అధికార వర్గాల్లో మార్మోగుతోంది. సాన పట్టిన కత్తిలా మారిన ఈ దేశ ముదురు తీరు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆయన అధికారి కాదు. ప్రజాప్రతినిధీ కాదు! గత చరిత్రలో పేజీలన్నీ పేచీలు, కేసులే! ఇప్పుడు ఆయనే రాష్ట్రంలో చక్రం తిప్పుతున్నాడు. 'నేను లోకేశ్ మనిషిని! లోకేశ్ నా మనిషి! నేను ఏం చెబితే అదే. నాకు చెబితే ఆయనకు చెప్పినట్లే. మీకేం కావాలో చెప్పండి. మాట్లాడుకుందాం రండి' అంటూ బడా కాంట్రాక్టర్లు, అధికారులు, మైనింగ్ వ్యాపారులకు బంపర్ ఆఫర్లు ఇస్తున్నాడు. 'నిన్ను నమ్మడం ఎలా?' అని ఎవరైనా ప్రశ్నిస్తే... 'సర్కారులో ఇదీ నా బలం' అని ఆధారాలు కూడా చూపిస్తున్నట్లు సమాచారం! గోదావరి జిల్లాలకు చెందిన ఆ వ్యక్తి కూటమి సర్కార్‌లో హల్‌చల్ సృష్టిస్తున్నాడు. మహా ముదురులా మారిపోయాడు. సాన పట్టిన కత్తిలా, పాదరసంలా దూసుకుపోతున్న ఆ వ్యక్తి ఒకప్పుడు సామాన్య ప్రభుత్వోద్యోగి. 'చీప్‌గా శాలరీమీద బతకడమేంటి' అనుకున్నాడేమో... కొలువు మానేసి వ్యాపారం అంటూ హైదరాబాద్‌కు మకాం మార్చాడు. పెద్దలతో ఉన్న పరిచయాలతో అనతి కాలంలోనే అనేక కంపెనీల్లో డైరెక్టర్‌గా

మిగతా 11వ పేజీలో...

రెచ్చిపోయిన 'శిష్యుడు'

'నాకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాగా తెలుసు. దసరా వరకు అటవీ ప్రాంతంలో లేటరైట్ తవ్వకాలు చేయవద్దని, రవాణా కూడా ఆపాలని నాకు ఫోన్ చేసి చెప్పారు' అంటూ కాకినాడకు చెందిన ఓ అటవీ అధికారి హల్‌చల్ చేసిన సంగతి తెలిసిందే! ఆయన ఎవరో కాదు... ఆ ఘటికుడు తెచ్చి పెట్టుకున్న అధికారే! దసరా వరకు ఒక్క లారీ కూడా బయటకు వెళ్లడానికి వీల్లేదని, పండుగ తర్వాత అన్నీ మాట్లాడుకుందామని ఆ అధికారి లేటరైట్, గ్రావెల్ లీజుదారులకు అల్టిమేటం ఇచ్చారు. మరో అడుగు ముందుకేసి.. అటవీ రేంజర్లను రంగంలోకి దింపి లారీలు ముందుకు కదలకుండా బలవంతంగా అడ్డుకున్నారు. దీనిపై కాకినాడ ఎంపీ ఆరాతీయగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు ఫోన్‌చేసి లారీలు ఆపించాలని ఆదేశించారని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయం పవన్‌కు చేరింది. ఈ అధికారి తన పేరును దుర్వినియోగం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి గుర్తించారు. ఆయనపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే శాఖాపరమైన విచారణ చేపట్టాలని అటవీ, పర్యావరణ శాఖ అధికారులను ఆదేశించారు.



టీడీపీ కార్యాలయంపై దాడి కేసు
సీఐడీకి

- చంద్రబాబు నివాసంపై దాడి కేసు కూడా..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- దర్యాప్తును వేగవంతం చేసేందుకు చర్యలు
- నేడు మళ్లీ పోలీసు విచారణకు వైసీపీ నేతలు

గుంటూరు, అక్టోబరు 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై, చంద్రబాబు నివాసంపై దాడులకు సంబంధించిన కేసులను ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 2021 అక్టోబరు 19న మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ అరాచక మూకలు దాడికి తెగబడ్డాయి. ఎమ్మెల్సీలు

మిగతా 11వ పేజీలో...



2

ప్రొఫెసర్ సాయిబాబ
కన్నుమూత

- అనారోగ్యంతో వారం క్రితం నిమ్స్‌లో చేరిక
- చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి
- వైకల్యాన్ని జయించి పోరాడిన హక్కుల నేత



మహారాష్ట్ర మాజీ మంత్రి
బాబా సిద్దిఖీ హత్య

2

- ముంబైలో కాల్చి చంపిన దుండగులు
- సల్మాన్ సహా బాలీవుడ్ స్టార్లకు సన్నిహితుడు
- ముగ్గురు నిందితుల పట్టివేత.. మరొకరు పరారీ
- ఇది తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్

నేడే లాటరీ



- 3,396 మద్యం షాపుల కోసం 89,882 దరఖాస్తులు
- దరఖాస్తు ఫీజుల ఆదాయం 1,798 కోట్లు

- ఒక్కో దుకాణానికి 26 మంది పోటీ
- ఎన్టీఆర్, ఏలూరులో భారీగా పోటీ
- తిరుపతి, సత్యసాయి జిల్లాల్లో సిండికేట్
- ఎల్లుండి నుంచి కొత్త దుకాణాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

3396 మద్యం షాపులు... వాటి కోసం 89,882 దరఖాస్తులు! ఇదీ తుది లెక్క! అంటే సగటున ఒక్కో షాప్ కోసం 26.46 మంది పోటీ పడుతున్నారు. మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. ఒక్కో దరఖాస్తుకు ఫీజు రూ.2 లక్షల చొప్పున... 89,882 అప్లికేషన్లకు రూ.1797.64 కోట్ల ఆదాయం సమకూరింది. ఎన్టీఆర్ జిల్లాలో అత్యధికంగా ఒక్కో షాపునకు సగటున 52 మంది పోటీలో ఉన్నారు. ఆ తర్వాత ఏలూరు, తూర్పు గోదావరి, గుంటూరు, విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎక్కువ పోటీ నెలకొంది. ఎన్టీఆర్ జిల్లాలో ఒక షాప్ కోసం 132, మరో షాప్

మిగతా 11వ పేజీలో...

బ్లాక్‌మార్కెటింగ్ చేస్తే ఖబడ్దార్

- నిత్యావసరాల ధరలపై నిరంతర పర్యవేక్షణ: చంద్రబాబు
- విజిలెన్స్ క్రియాశీలం కావాలి.. ప్రజలకు ఉపశమనం కలగాలి
- పామాయిల్, పప్పులు, కూరగాయల ఉత్పత్తి పెంచాలి
- గిడ్డంగులు అందుబాటులోకి తేవాలి.. సమీక్షలో సీఎం ఆదేశం

ధరలపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి మనోహర్, అధికారులు

11



నేటి నుంచి పల్లె పండుగ

- 20 వరకూ పంచాయతీ వారోత్సవాల నిర్వహణ
- 3 వేల కి.మీ. సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ

- కంకిపాడులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శ్రీకారం
- టూర్ షెడ్యూల్ ప్రకటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- సంక్రాంతి నాటికి రోడ్లు పూర్తయ్యేలా ప్రణాళికలు
- అందుబాటులో ఉన్న ఉపాధి నిధులతో బిల్లుల చెల్లింపు
- పనులు చేపట్టేందుకు ముందుకు వస్తున్న కాంట్రాక్టర్లు
- ఐదేళ్ల తర్వాత మెటీరియల్ నిధుల సద్వినియోగం
- వైసీపీ పాలనలో ధ్వంసమైన రహదారులకు మోక్షం



11

రాష్ట్రానికి రూ.988 కోట్లు

- 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసిన కేంద్రం
- ఈ మొత్తం 9 జిల్లా పరిషత్‌లు, 615 మండల పరిషత్‌లకు
- 12,853 పంచాయతీలకు కూడా



మళ్లీ భారీ వర్షాలు

- నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం
- రేపటి నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు
- ఒకట్రెండు చోట్ల కుంభవృష్టి కురిసే అవకాశం
- అల్పపీడనం బలపడుతుందా లేదా అన్నదానిపై అస్పష్టత
- ఈశాన్య రుతుపవనాలు రాక

2

పండుగ పూర్తిచేసుకుని వెనక్కి..



విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే హైవేలోని పంతంగి టోల్ గేటు వద్ద బారులు తీరిన వాహనాలు

టోల్ గేట్లు కిటకిట!

- హైదరాబాద్ హైవేపై వాహనాల రద్దీ
- దసరా ముగియడంతో ఆంధ్ర నుంచి భాగ్యనగరానికి తిరుగుముఖం
- టోల్ ప్లాజాల వద్ద భారీగా బారులు
- కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

దసరా సెలవులు ముగిశాయి. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని స్వస్థలాలకు వచ్చినవారంతా భాగ్యనగరానికి పెద్దసంఖ్యలో తిరుగుముఖం పట్టారు. వారి వాహనాలు, ప్రభుత్వ, ప్రైవేటు

మిగతా 11వ పేజీలో...

నిప్పులు చిమ్ముకుంటూ నేలపైకి..



స్పేస్ ఎక్స్ చరిత్ర సృష్టించింది. 'స్టార్‌షిప్' మెగా రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించిన తర్వాత కొద్ది సేపటికి దాని బూస్టర్ విజయవంతంగా తిరిగి లాంచ్‌ప్యాడ్ వద్ద ఇలా ల్యాండ్ అయింది.

2

దేశంలో ఆకలి కేకలు!

2

- ప్రపంచ సూచీలో 105వ స్థానంలో భారత్
- సీరియస్ కేటగిరీలో దేశం
- పాక్, అఫ్ఘానిస్థాన్ వంటి 42 దేశాల సరసన చోటు
- మన కంటే ఉత్తమ కేటగిరీలో బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్



రాష్ట్ర పండుగగా
వాల్మీకి జయంతి

- ఈనెల 17న అన్ని జిల్లాల్లో వేడుకలు
- అనంతపురంలో రాష్ట్రస్థాయి ఉత్సవాలు
- యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చిన ప్రభుత్వం

3



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న

అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్

శ్రీసత్యసాయి జిల్లాలో దారుణం
బాధితులు వలస కార్మికులు

- పోలీసుల అదుపులో ఐదుగురు?
- నిందితుల్లో పాతనేరస్థులు, మైనర్లు?
- వారిలో ఒకరు అంతర్రాష్ట్ర మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్
- ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్
- జిల్లా ఎస్పీకి ఫోన్.. కఠిన చర్యలకు ఆదేశం

12

కమలా హ్యారిస్‌కు రెహమాన్ మద్దతు



» ఎన్నికల ప్రచారానికి 30 నిమిషాల వీడియో రూపకల్పన

వాషింగ్టన్, అక్టోబరు 13: అమెరికాలో అధ్యక్ష ఎన్నికల హడావుడి నెలకొంది. నవంబరు 5న జరిగే ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీపడుతున్నారు. ఆమె ఎన్నికల ప్రచారానికి ఊతమిచ్చేలా లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ 30 నిమిషాల నిడివిగల ఒక ప్రత్యేక వీడియోను రూపొందించారు. ఇండో-ఆఫ్రికా సంతతికి చెందిన హారిస్‌కు ఈ ఎన్నికల్లో మద్దతు పలికిన తొలి అంతర్జాతీయ కళాకారుడు రెహమాన్ కావడం విశేషం. 'అమెరికాలో ప్రగతి, ప్రాతినిధ్యం కోసం నిలబడిన నాయకులు, కళాకారుల బృందానికి మద్దతుగా ఏఆర్ రెహమాన్ తన గాత్రాన్ని అందించారు. కమలా హారిస్ ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా 30 నిమిషాల వీడియోను రూపొందించారు' అని 'ది ఏషియన్ అమెరికన్ పసిఫిక్ ఐలాండర్స్ (ఏఏపీఐ)' విక్టరీ ఫండ్ సంస్థ ఛైర్మన్ శేఖర్ నరసింహన్ పేర్కొన్నారు. తమిళ మూలాలున్న కమలా హారిస్‌కు ఈ ఎన్నికల్లో ఏఏపీఐ విక్టరీ ఫండ్ సంస్థ మద్దతుగా నిలిచింది. దానికి ఏఆర్ రెహమాన్ కూడా తోడ్పాటు నందించారు. 'ఇది ఒక సంగీత కార్యక్రమం మాత్రమే కాదు. అమెరికాలో మా సంఘాలు, మేం చూడాలనుకునే భవిష్యత్తుకు ఓటు వేయాలని మా కమ్యూనిటీలకు ఇస్తున్న పిలుపు' అని నరసింహన్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ రాత్రి రెహమాన్ రూపొందించిన వీడియోను ఏఏపీఐ విక్టరీ ఫండ్.. యూట్యూబ్‌లోనూ ప్రసారం చేయనుంది. ఈ వీడియోలో రెహమాన్‌కు అత్యంత ఇష్టమైన కొన్ని పాటలు ఉంటాయని, అలాగే హారిస్ అభ్యర్థిత్వం, ఏఏపీఐ కమ్యూనిటీ పట్ల నిబద్ధతను తెలియజేస్తూ కొన్ని సందేశాలు ఉంటాయని ఆ సంస్థ పేర్కొంది.

స్పేస్ ఎక్స్ సరికొత్త చరిత్ర

'పునర్వినియోగ రాకెట్' ప్రయోగాల్లో కీలక ముందడుగు

వాషింగ్టన్, అక్టోబరు 13: పునర్వినియోగ అంతరిక్ష వాహక నౌకలకు సంబంధించి ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ కంపెనీ చరిత్ర సృష్టించింది. ఆ కంపెనీకి చెందిన 'స్టార్‌షిప్' మెగా రాకెట్‌ను అంతరిక్షంలోకి ప్రయోగించిన తర్వాత కొద్ది సేపటికి దాని బూస్టర్ విజయవంతంగా తిరిగి లాంచ్‌ప్యాడ్ వద్ద ల్యాండ్ అయింది. ఒక రాకెట్‌కు చెందిన బూస్టర్‌ను తిరిగి లాంచ్ ప్యాడ్ వద్దకు తీసుకురావడం ఇదే మొట్టమొదటిసారి. 'ఇది ఇంజనీరింగ్ అద్భుతం' అని స్పేస్ ఎక్స్ అధికార ప్రతినిధి వెల్లడించారు. బూస్టర్ లాంచ్‌ప్యాడ్ వద్దకు చేరుకున్న వీడియోను మస్క్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆదివారం టెక్సస్ తీరంలో ఈ ప్రయోగం నిర్వహించారు. స్టార్‌షిప్ రాకెట్ పొడవు 121మీటర్లు. ఇందులో బూస్టర్, స్పేస్‌క్రాఫ్ట్ అని రెండు విభాగాలుంటాయి. బూస్టర్ పొడవు 71 మీటర్లు. ప్రయోగంలో భాగంగా రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపించారు. కొద్దిసేపటి తర్వాత, బూస్టర్ నుంచి స్పేస్‌క్రాఫ్ట్ విడిపోయింది. ముందుగా అనుకున్న ప్రకారం... స్పేస్‌క్రాఫ్ట్‌ను హిందూ మహాసముద్రంలో దింపివేశారు. బూస్టర్‌ను తిరిగి లాంచ్‌ప్యాడ్ వద్దకు రప్పించారు. అక్కడ బూస్టర్ ఒడిసిపట్టుకోవడానికి ప్రత్యేకంగా క్రేన్ లాంటి నిర్మాణాల(చాప్ స్టిక్స్)ను ఏర్పాటు చేశారు. అవి, బూస్టర్‌ను విజయవంతంగా ఒడిసిపట్టుకున్నాయి. స్పేస్ ఎక్స్‌కే చెందిన ఫాల్కన్-9 రాకెట్ బూస్టర్లు ఇప్పటికే పునర్వినియోగించుకొనే వెసులుబాటు ఉన్నవి. అయితే, వీటిని సముద్రాల వద్ద కింద పడేలా చేసి తర్వాత ఉపయోగిస్తున్నారు. కాగా, చంద్రుడు, అంగారకుడిపై యాత్రలకు వీలుగా స్పేస్ ఎక్స్ సంస్థ స్టార్ షిప్ రాకెట్‌ను రూపొందించింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్.

లోకం తీరు



ఇజ్రాయెల్‌పై 9/11 తరహా దాడికి

హమాస్ కుట్ర

» అక్టోబర్ 7కు ముందే జరపాలని పథకం!

వాషింగ్టన్, అక్టోబర్ 13: ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7 దాడికి ముందే హమాస్ 9/11 తరహా భారీ దాడికి కుట్ర పన్నిందని ఆధారాలు లభించినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. పాలస్తీనా ఖాన్ యూనిస్ లోని హమాస్ కమాండ్ సెంటర్ నుంచి ఇజ్రాయెల్ బలగాలు స్వాధీనం చేసుకున్న కీలక పత్రాల్లో దాడికి కుట్ర వివరాలు బయటపడ్డాయి. ఐడీఎఫ్ బలగాలు అందించిన పత్రాలు, ఇతర ఆధారాలతో న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, వాల్‌స్ట్రీట్ జర్నల్ తదితర అంతర్జాతీయ మీడియా సంస్థలు హమాస్ కుట్రకు సంబంధించి తాజా కథనాలు ప్రచురించాయి. దాడి కోసం 2022 జనవరి నుంచి 2023 ఆగస్ట్ వరకూ హమాస్ రాజకీయ, సైనిక విభాగాలు పది ఉన్నత స్థాయి సమావేశాలు జరిపి ఇరాన్ నుంచి ఆర్థిక మద్దతు, సైనిక సాయం కోరాయి. టెల్ అవీవ్‌లోని బహుళ అంతస్థుల ఆక్రెయిలీ టవర్స్‌ను కూల్చేయాలనేది హమాస్ అసలు కుట్ర. దీనికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీతో పాటు ఐఆర్‌జీసీ చీఫ్ ఖానీ ఇతర ఇరాన్ కీలక నేతలతో హమాస్ నేత యాహ్యా సిన్వార్ చర్చలు కూడా జరిపాడు. ఇరాన్, హెజ్‌బుల్లాల నుంచి అదనపు ఆర్థిక మద్దతు, సైనిక సాయం అందే విషయంలో ఆలస్యం కావడంతో హమాస్ కుట్రను అమలు చేయలేక విరమించుకుంది. చివరకు వ్యూహాన్ని మార్చుకుని ఇజ్రాయెల్‌లో అంతర్గత పరిస్థితులు సరిగా లేని తరుణం చూసి 2023 అక్టోబర్ 7న భీకర దాడికి పాల్పడింది. 12 వందల మందిని చంపేయడంతో పాటు 250 మంది ఇజ్రాయెలీలను బందీలుగా తీసుకువెళ్లింది. కాగా, గాజాలోని జబాలియా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో 50 మంది చనిపోయారు.

మళ్లీ భారీ వర్షాలు

» నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఆదివారం ఉత్తర తమిళనాడు పరిసరాల్లో ఆవరించి ఉంది. ఇక రెండు రోజుల క్రితం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోంది. వీటి ప్రభావంతో సోమవారం దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఈ అల్పపీడనం బలపడి దక్షిణకోస్తా, ఉత్తర తమిళనాడు దిశగా రానున్న క్రమంలో ఈ నెల 15 నుంచి 17 వరకు కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

వాయుగుండంగా మారుతుందా?

అల్పపీడనం వచ్చే 48 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా బలపడి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా దిశగా రానున్నది. అయితే బలపడి తీవ్ర అల్పపీడనంగానే తీరం దాటుతుందా? లేదా మరింత బలపడి వాయుగుండంగా.. ఆపై తుఫాన్‌గా మారుతుందా? అనేదానిపై అధికారులు స్పష్టత ఇవ్వడంలేదు. కొన్ని మోడళ్ల మేరకు వాయుగుండంగా మారి ఈ నెల 17వ తేదీన తీరం దాటుతుందని, ఇంకొన్ని మోడళ్ల మేరకు తుఫాన్‌గా మారుతుందని అంచనాలు ఉన్నాయి. అయితే ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మధ్య తీరం దాటిన తరువాత దక్షిణ భారతం మీదుగా పయనించి అరేబియా సముద్రంలో ప్రవేశించి అక్కడ బలపడుతుందని కొన్ని మోడళ్లు విశ్లేషిస్తున్నాయి. అయితే అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారిన తరువాత కొంత వరకు స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ అల్పపీడన ప్రభావంతో ఉత్తర తమిళనాడులో విస్తారంగా వర్షాలు కురుస్తాయని స్పష్టంచేశారు.

నైరుతి నిష్క్రమణ..

దక్షిణభారతంలో వర్షాలకు ఊతమిచ్చే ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. దీనికి బంగాళాఖాతంలో వాతావరణం అనుకూలంగా మారి తూర్పుగాలులు వీస్తున్నాయి. ఈక్రమంలో నైరుతి రుతుపవనాలు దేశం నుంచి ఇక వైదొలగనున్నాయి. ఆదివారం మధ్య, తూర్పుభారతంలో అనేక ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమించాయి. రానున్న రెండు రోజుల్లో దేశంలో మిగిలిన ప్రాంతాల నుంచి కూడా నైరుతి రుతుపవనాలు వైదొలుగుతాయని, ఇదే సమయంలో ఈనెల 15 లేదా 16న దక్షిణాదిలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న హిందూ మహాసముద్రంలో ఏర్పడనున్న అల్పపీడనం మరింత బలపడే అవకాశం ఉన్నందున రానున్న 48గంటల పాటు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. 15, 16, 17 తేదీల్లో రాష్ట్రంలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

తుంగభద్రకు భారీ వరద

» టీబీ డ్యాం 20 గేట్లు ఎత్తి.. 82 వేల క్యూసెక్కులు దిగువకు

బళ్లారి సిటీ, అక్టోబరు 13: కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర నదికి వరద పెరిగింది. హొస్పేట్ సమీపంలోని తుంగభద్ర జలాశయా (టీబీ డ్యాం)నికి 84,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం నిండుగా ఉండడంతో 82,504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో దాదాపు 11వేల క్యూసెక్కులు కాలువలకు, 20 క్రస్ట్ గేట్ల ద్వారా 71 వేల క్యూసెక్కులు నది దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర బోర్డు అధికారులు శనివారం తొలుత 18 గేట్లను, తర్వాత మరో రెండు గేట్లను తెరిచారు. ఇన్‌ఫ్లో పెరిగితే లక్ష క్యూసెక్కులు విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జలాశయం నుంచి నదికి దిగువకు వదలడం ఇది మూడోసారి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1,632 అడుగులు కాగా.. ప్రస్తు తం 1631.97 అడుగుల మేర నీరు ఉంది. డ్యాంలో ప్రస్తుతం 101.66 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆకలి సూచీలో 105వ స్థానంలో భారత్

లండన్, అక్టోబరు 13: భారత్‌లో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. 2024-ప్రపంచ ఆకలి సూచీలో దేశం 105వ స్థానం దక్కించుకుని 'సీరియస్' కేటగిరీలో ఉండడం గమనార్హం. ఈ కేటగిరీలో మొత్తం 42 దేశాలు ఉండగా భారత్‌తోపాటు పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటివి ఉన్నాయి. అదేవిధంగా పొరుగు దేశాలైన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లు భారత్ కంటే మెరుగైన కేటగిరీలో ఉండడం విశేషం. తాజాగా అంతర్జాతీయ మానవతావాద సంస్థలు ప్రపంచ ఆకలి సూచీ(జీహెచ్ఐ)ని అంచనా వేశాయి. పోషకాహార లోపం, చిన్నపిల్లల మరణాలు వంటివి ఆధారంగా చేసుకుని మొత్తం 127 దేశాల్లో పరిస్థితిని వెల్లడించాయి. ఈ జాబితాలో భారత్ 105 స్థానం దక్కించుకుంది. "27.3 స్కోరుతో భారత్ ఆకలి స్థాయిలో సీరియస్ కేటగిరీలో ఉంది" అని నివేదిక పీఠికలోనే పేర్కొనడం గమనార్హం. దేశంలో 13.7% మంది ప్రజలు పోషకాహార లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. 35.5 శాతం మంది ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులు దుర్భర పరిస్థితిలో జీవిస్తున్నారు. వీరిలో 18.7 శాతం మంది బరువు తక్కువ, పోషకాహార లోపం, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక, ప్రపంచ వ్యాప్తంగా.. ప్రపంచ వ్యాప్తంగా 7.33 కోట్ల మంది ప్రజలు రోజువారీ ఆహారం సంపాయించుకునేందుకు అవసరమైన సొమ్ములు కూడా లేక ఆకలితోనే గడుపుతున్నారు.

గౌరీ లంకేశ్ హత్య కేసులో నిందితులకు బెయిల్

» విజయపురలో స్వాగత సత్కారాలు



బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమకారిణి, సీనియర్ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్యకేసులో అరెస్టయి, ఆరేళ్లపాటు జైలులో గడిపి బెయిల్‌పై విడుదలైన పరశురామ్ వాగ్మోర్, మనోహర్ యాదవ్‌లకు గ్రామంలో స్వాగత సత్కారాలు చేశారు. ఈ నెల 9న వీరిరువురికీ బెంగళూరు సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శనివారం పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆదివారం విజయపుర జిల్లాలోని స్వగ్రామానికి చేరుకున్నారు. అక్కడ హిందూసంఘాల కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వారిని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్దకు తీసుకెళ్లి, అనుకూల నినాదాలు చేశారు. అనంతరం కాళికామాత ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఓ కార్యకర్త మీడియాతో మాట్లాడుతూ.. తమకు నిజమైన విజయదశమి వచ్చిందన్నారు. ఆరేళ్లుగా వారిద్దరూ జైలులో గడిపారన్నారు. అసలు నేరస్థులను ఇంకా గుర్తించలేదన్నారు. హిందూ అనుకూల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఇబ్బంది పెడుతున్నారన్నారు. పోలీసు స్టేషన్లపై దాడి చేసి అధికారులను కొట్టినవారికి కేసుల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పిస్తోందనీ, హత్య చేసినవారు ఎవరో గుర్తించకుండానే ఏళ్ల తరబడి జైలులో పెట్టారన్నారు. 2017 సెప్టెంబరు 5న బెంగళూరులోని రాజరాజేశ్వరినగర్‌లో గౌరీ లంకేశ్‌ను హత్య చేసిన విషయం తెలిసిందే.

పుంజుకుంటున్న ట్రంప్!

» కమలా హ్యారిస్ శిబిరంలో కలవరం

» పోరు రసవత్తరం.. తేడా 2 శాతమే

» అమెరికా అధ్యక్ష ఎన్నికలపై తాజా సర్వేల్లో వెల్లడి



అమెరికా అధ్యక్ష ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. పాలక డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిని, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ నడుమ హోరాహోరీ పోరు నెలకొనడం ఖాయంగా కనిపిస్తోంది. పలు సర్వే సంస్థలు నిన్నమొన్నటి వరకు హ్యారిస్ విజయం ఖాయమని అంచనా వేశాయి. తాజాగా ట్రంప్ బాగా పుంజుకుంటున్నట్లు పేర్కొన్నాయి. గత పది రోజుల్లో తాము నిర్వహించిన సర్వేల సగటు చూస్తే దేశవ్యాప్తంగా హ్యారిస్ ఆధిక్యం నాలుగు శాతం నుంచి రెండు శాతానికి తగ్గిపోయినట్లు 'ది గార్డియన్' పత్రిక ఆదివారం వెల్లడించింది. నువ్వా నేనా అనే రీతిలో పోరు జరిగే 19 కీలక రాష్ట్రాల్లో ట్రంప్ ముందంజలో ఉండడం హ్యారిస్ శిబిరాన్ని కలవరపరుస్తోంది. ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు ట్రంప్ ముందంజలోకి రావడానికి కారణంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెలలో అమెరికాలో సంభవించిన రెండు విధ్వంసక హరికేన్లు (మిల్టన్, హెలెన్), పశ్చిమాసియా సంక్షోభం పూర్తిస్థాయి యుద్ధంగా మారే ప్రమాదం మొదలైనవి హ్యారిస్ ఆధిక్యం తగ్గడానికి ప్రధాన కారణాలుగా 'గార్డియన్' పేర్కొంది. రెండు వారాల కిందట ఆమె వైపు 48% మంది అమెరికన్లు మొగ్గు చూపగా.. ట్రంప్ 44% మంది మద్దతు పొందారు. ఈ నెల 10వ తేదీ నాటికి ఆమె ఆధిక్యం 46 శాతానికి తగ్గిపోయింది. ప్రస్తుతం ఇద్దరి మధ్య రెండు శాతం తేడా మాత్రమే ఉండడం డెమోక్రాట్లను విస్మయపరుస్తోంది. పెన్సిల్వేనియా, మిచిగన్, విస్కాన్సిన్, నార్త్ కరోలినా, జార్జియా, అరిజోనా, నెవడా.. ఈ ఏడు రాష్ట్రాలు అధ్యక్ష ఎన్నికల్లో విజేతను నిర్ణయిస్తాయని చెబుతారు. వీటిలో మొదటి 3 రాష్ట్రాల్లో మాత్రమే హ్యారిస్ వైపు మొగ్గు కనిపిస్తోంది. పెన్సిల్వేనియాలో ట్రంప్ కంటే ఒక శాతమే ఆమె ముందంజలో ఉన్నారు. పోలింగ్ నాడు ఇదే పరిస్థితి కొనసాగితే.. విజయానికి కావలసిన 270 ఎలక్టొరల్ కాలేజీ ఓట్లను ట్రంప్ సునాయాసంగా దక్కించుకుని.. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికవుతారని 'గార్డియన్' అంచనా వేసింది. గత నెల 10 నాటికి.. అన్ని సర్వేల డేటాలను అధ్యయనం చేస్తే నూటికి 55% హ్యారిస్సే గెలుస్తారని తేలిందని, ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితి లేదని తెలిపింది. ఇప్పుడున్న ట్రెండ్ కొనసాగితే అరిజోనా, మిచిగన్, విస్కాన్సిన్, జార్జియాల్లో ఆమెకు స్వల్ప ఆధిక్యమే లభిస్తుందని.. బొటాబొటీగా నెగ్గవచ్చని 'వాల్ స్ట్రీట్ జర్నల్' సర్వే 11వ తేదీన వెల్లడించింది. ఈ నెల 3-8 తేదీల నడుమ 'యాక్టివోట్' నిర్వహించిన సర్వేలో హ్యారిస్ కంటే ట్రంప్ 1.2 పాయింట్ల ఆధిక్యంలో ఉన్నట్లు తేలింది.

తక్కువ మార్జిన్‌తో తంటా..

హ్యారిస్ ప్రజాదరణ శాతం క్రమంగా తగ్గుతుండడంతో ఉపాధ్యక్షురాలి శిబిరానికి ఏమీ పాలుపోవడం లేదు. గత నెల పదో తేదీన ఫిలడెల్ఫియాలో ట్రంప్‌తో జరిగిన చర్చలో ఆమె పైచేయి సాధించినా మిచిగన్, విస్కాన్సిన్, పెన్సిల్వేనియాల్లో క్రమంగా ఆమె ప్రజాదరణ తగ్గుతూ వస్తోంది. అయితే హ్యారిస్ ఓటర్ల మద్దతు కోసం పెద్దఎత్తున కృషిచేస్తున్నారు. సబర్బన్ ఓటర్లు, మధ్య ఆదాయ వర్గాలే లక్ష్యంగా వరాలు ప్రకటిస్తున్నారు. చౌకగా వైద్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఆర్థిక పారదర్శకత వంటి హామీలతో ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో సబర్బన్ ఓటర్లలో 47% మంది ఆమె వైపు మొగ్గుచూపుతున్నారని.. 41% మంది మాత్రమే ట్రంప్ వైపు నిలిచారని 'రాయిటర్స్/ఇప్సోస్' సర్వే వెల్లడించింది. 2020 ఎన్నికల్లో ట్రంప్ ఓటమికి సబర్బన్ ఓటర్లే కారణం కావడం విశేషం. - సెంట్రల్ డెస్క్.

యుద్ధభయం..

నవంబరు 5న అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరుగనుంది. అంటే 22 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈ తరుణంలో పశ్చిమాసియాలో యుద్ధం నానాటికీ తీవ్రరూపం దాల్చుతుండడం, ఇరాన్ మద్దతున్న లెబనాన్ షియా గ్రూపు హెజ్‌బుల్లాపై ఇజ్రాయెల్ భీకర దాడులు.. అమెరికాలో స్థిరపడిన అరబ్ ఓటర్లలో హ్యారిస్‌పై ఆగ్రహానికి కారణాలయ్యాయని అంటున్నారు. గాజాలో హమాస్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి వైట్‌హౌస్ మద్దతివ్వడంపై ఇప్పటికే వారు మండిపడుతున్నారు. ఈ అంశం కారణంగానే మిచిగన్, విస్కాన్సిన్‌లలో ట్రంప్ ఆధిక్యం సాధించారని 'క్విన్నిపియాక్' సర్వే పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ కుదేలవడం, ద్రవ్యోల్బణం పెరుగుదల, జీవన వ్యయం పెరగడం, ఇమిగ్రేషన్ సమస్యలు కూడా అధికార పార్టీకి ఇబ్బందులుగా పరిణవిఎంచాయి. దీని నుంచి తక్షణమే బయటపడి ట్రంప్ ఆర్థిక విధానాలను టార్గెట్ చేయాలంటూ 1992లో బిల్ క్లింటన్ విజయంలో కీలక భూమిక పోషించిన జేమ్స్ కార్‌విల్ పిలుపిచ్చారు. దిగుమతులపై సుంకాలు విధిస్తానని ట్రంప్ ప్రకటిస్తున్నారు. దీనివల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్థికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ట్రంప్‌పై విద్యావంతుల్లో, మధ్యతరగతి ప్రజల్లో వ్యతిరేకతకు ఇదే ముఖ్య కారణంగా భావిస్తున్నారు.

జైలులో నాటకం.. సీతను వెతుకుతూ ఇద్దరు ఖైదీల పరార్

న్యూఢిల్లీ, అక్టోబరు 13: దసరా సందర్భంగా జైలులో రామాయణం నాటకం వేయగా, వానరుల వేషం వేసిన ఇద్దరు ఖైదీలు గోడదూకి పారిపోయారు. ఈ ఘటన ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని రోషనాబాద్ జైలులో జరిగింది. జైలులో దసరా సందర్భంగా రామాయణం నాటకం వేశారు. అందులో పంకజ్, రాజ్ కుమార్ అనే ఖైదీలు వానరుల వేషం వేశారు. నాటకంలో భాగంగా వారు సీతను వెతుకుతూ వెళ్లి పోలీసులు, తోటి ఖైదీలు చూస్తుండగానే నిచ్చెన వేసుకుని 22 అడుగుల గోడ దూకి పారిపోయారు. పోలీసులు వెంటనే తేరుకుని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పంకజ్ ఓ హత్య కేసులో జీవిత ఖైదు, రాజ్ కుమార్ ఓ కిడ్నాప్ కేసులో శిక్ష అనుభవిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. జైలర్ ప్యారేలాల్ సహా ఆరుగురు జైలు అధికారులను సస్పెండ్ చేశారు. పంకజ్, రాజ్‌కుమార్‌తో పాటు చోటు అనే మరో ఖైదీ కూడా పారిపోయేందుకు ప్రయత్నించాడని కాని గోడకు వేసిన నిచ్చెన కూలిపోవడంతో అతని ప్రయత్నం విఫలమైందని అధికారులు తెలిపారు. ఈ ముగ్గురు పారిపోయేందుకు వారం క్రితమే ప్రణాళికలు వేసుకోవడం విశేషం.


జామ్‌నగర్ రాజకుటుంబ వారసుడిగా అజయ్ జడేజా

జామ్‌నగర్, అక్టోబరు 13: గుజరాత్‌లోని జామ్‌నగర్ రాజ కుటుంబానికి తదుపరి వారసుడిగా భారత మాజీ క్రికెటర్ అజయ్ జడేజా(53)ను శనివారం ప్రకటించారు. దీనిపై ప్రస్తుత మహారాజ జాం సాహెబ్ శత్రుసల్యసింహ్‌జీ దిగ్విజయ్ సింహ్‌జీ జడేజా అధికారిక ప్రకటన చేశారు. "రాజ కుటుంబానికి వారసుడిగా అంగీకరించిన అజయ్ జడేజాకు కృతజ్ఞతలు. జామ్‌నగర్ తదుపరి జాం సాహెబ్‌గా బాధ్యతను అజయ్ జడేజా చేపట్టడం ఇక్కడి ప్రజలకు ఒక వరం" అని శత్రుసల్యసింహ్‌జీ పేర్కొన్నారు. ఇక అజయ్ జడేజా 1992 నుంచి 2000 వరకు క్రికెట్‌లో తనదైన ముద్ర వేశారు. ఆయన భారత్ తరఫున 15 టెస్ట్ మ్యాచ్‌లు, 196 వన్డేలు ఆడారు. కాగా క్రికెట్‌లో రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లకు జడేజా కుటుంబసభ్యులైన కేఎస్ రంజిత్‌సింహ్‌జీ, కేఎస్ దులీప్‌సింహ్‌జీ పేర్లు పెట్టారు.

మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్య

ముంబైలో కాల్చి చంపిన ముగ్గురు వ్యక్తులు.. కుమారుడి కార్యాలయం వద్ద ఉండగా ఘటన

» తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్




బాబా సిద్దిఖీ(ఫైల్), ఆదివారం సిద్దిఖీ ఇంటివద్ద సల్మాన్ ఖాన్

ముంబై, అక్టోబరు 13: మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్)కి చెందిన నాయకుడు బాబా సిద్ధిఖీ హత్యకు గురయ్యారు. ముంబైలో ఆయనను ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపారు. బాబా శనివారం రాత్రి బాంద్రాలోని తన కుమారుడు, వాంద్రే ఎమ్మెల్యే అయిన జీషన్ సిద్ధిఖీ కార్యాలయం వద్ద ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పుల అనంతరం ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. బాంద్రా పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాబా సిద్ధిఖీ (66) మంత్రిగా పనిచేశారు. గత రెండు ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఈ సంవత్సరం ఎన్సీపీలో చేరారు. ముంబైలో ముస్లిం నాయకుడిగా బాగా పలుకుబడి కలిగిన సిద్ధిఖీ.. బాలీవుడ్ స్టార్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్‌కు అత్యంత సన్నిహితులు. ఓ దశలో తీవ్ర విభేదాలతో కనీసం పలకరింపులు లేని సల్మాన్-షారూక్ ఖాన్ మధ్య సయోధ్య కుదిర్చింది సిద్ధిఖీనే. సంజయ్ దత్ సహా పలువురు నటీ నటులతోనూ ఆయకు దగ్గరి సంబంధాలున్నాయి. ఈయన ఇచ్చే భారీ ఇఫ్తార్ విందులకు బాలీవుడ్ నటులు పెద్దఎత్తున తరలివచ్చేవారు. కాగా, సిద్ధిఖీపై కాల్పులకు పాల్పడిన ముగ్గురిలో ఇద్దరిని పట్టుకున్నామని, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో గుర్మైల్(23) హరియాణాకు చెందినవాడు. మిగతా ఇద్దరు యూపీ వాసులైన ధర్మరాజ్(19), శివకుమార్. శివకుమార్ పరారీలో ఉన్నాడు. మరోవైపు, హత్యకు కుట్రదారుగా భావిస్తున్న ప్రవీణ్ లోంకర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ధర్మరాజ్ వయసు ఆధార్ కార్డు ప్రకారం 21గా ఉన్నప్పటికీ.. అతడు మైనర్ (17)నని పేర్కొనడంతో వయసు నిర్ధారణ పరీక్షలకు కోర్టు ఆదేశించింది. మరోవైపు సిద్ధిఖీ హత్యకు కొన్ని నెలలుగా నిందితులు ప్రణాళికలు రచించారని, ముంబై, పుణెలలో నివాసం ఉన్నారని, సిద్ధిఖీ ఇల్లు, కార్యాలయంపై నిఘా పెట్టారని పోలీసులు తెలిపారు. హత్యకు గాను రూ.50 వేల అడ్వాన్స్ తీసుకున్నారని, ఆయుధాలను బిష్ణోయ్ గ్యాంగ్ సరఫరా చేసిందని పేర్కొన్నారు. సిద్ధిఖీ హత్య తమ పనే అని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ మేరకు గ్యాంగ్ సభ్యుడొకరు ఫేస్ బుక్‌లో పోస్ట్ పెట్టాడు. సల్మాన్‌తో పాటు మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంతో సంబంధాలున్నందుకే అతడిని హతమార్చినట్లు పేర్కొంది. సిద్ధిఖీ హత్యతో సల్మాన్ ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. సల్మాన్ ఆదివారం సాయంత్రం సిద్ధిఖీ ఇంటికెళ్లి భౌతిక ఖాయానికి నివాళి అర్పించారు. ఆ సమయంలో ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శనివారం సల్మాన్ బిగ్ బాస్ షూటింగ్ రద్దుచేసుకుని ఆస్పత్రిలో సిద్ధిఖీ మృతదేహాన్ని సందర్శించారు.

20 ఏళ్లకే రాజకీయాల్లోకి

సిద్ధిఖీ 1977లో రాజకీయాల్లోకి వచ్చారు. అసలు పేరు జియాఉద్దీనన్ సిద్ధిఖీ. 1999 నుంచి వరుసగా మూడుసార్లు బాంద్రా వెస్ట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2000 సంవత్సరంలో కార్మిక, పౌర సరఫరాలు తదితర శాఖల మంత్రిగా నియమితులయ్యారు. ఈ సమయంలోనే ముంబైలోని ఓ మురికివాడ పునరావాస ప్రాజెక్టు ఇళ్ల కేటాయింపు రూ.2 వేల కోట్ల కుంభకోణం జరిగినట్లు 2014లో సిద్ధిఖీపై ఈడీ కేసు నమోదైంది. కాగా, వచ్చే నెలలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా సిద్ధిఖీ హత్య సంచలనంగా మారింది. సిద్ధిఖీ హత్యను ఖర్గే, రాహుల్ గాంధీ ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని శరద్ పవార్ ఆరోపించగా ఘటనను రాజకీయం చేయొద్దని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కోరారు.

ప్రొఫెసర్ సాయిబాబ కన్నుమూత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్, పౌర హక్కుల ఉద్యమకారుడు జీఎన్ సాయిబాబ(56) అనారోగ్యంతో కన్నుమూశారు. వారం రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి చనిపోయారు. జైలులో ఉన్నప్పటి నుంచే అనేక ఆరోగ్య సమస్యలతో సతమతమైన సాయిబాబ.. విడుదలైన తర్వాత ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కొంతకాలం చికిత్స పొందారు. అనంతరం కొద్ది రోజులుగా నిమ్స్‌లో వైద్యం చేయించుకుంటున్నారు. ఆయనకు గత నెలలో శస్త్ర చికిత్స ద్వారా పిత్తాశయం తొలగించారు. ఆపరేషన్ తర్వాత అంతర్గత రక్తస్రావం కావడంతో సాయిబాబ ఇన్ఫెక్షన్ బారినపడ్డారు. దానికి చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో శనివారం రాత్రి 8.45 గంటలకు నిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. సోమవారం ఉదయం 8 గంటలకు గన్‌పార్క్ వద్ద ప్రజల సందర్శనార్థం సాయిబాబ మృతదేహాన్ని ఉంచుతామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మౌలాలి జవహర్‌నగర్‌లోని సాయిబాబ సోదరుడి ఇంటికి మృతదేహాన్ని తీసుకెళతామని వెల్లడించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ర్యాలీగా బయలుదేరి గాంధీ మెడికల్ కళాశాలకు చేరుకుని సాయిబాబ మృతదేహాన్ని అప్పగిస్తామని పేర్కొన్నారు. సాయిబాబ కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు.

వైకల్యాన్ని జయించిన మేధావి..

ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో గాంధీనగర్‌లోని పేద రైతు కుటుంబంలో 1967 జూలై 24న సాయిబాబ జన్మించారు. ఐదేళ్ల వయసులోనే పోలియోతో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. చదువులో చురుకుగా ఉండే సాయిబాబ డిగ్రీలో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి బంగారు పతకాన్ని అందుకున్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో పీజీ, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ వర్సిటీలో ఎంఫిల్ పూర్తి చేశారు. ఆ సమయంలోనే సికింద్రాబాద్‌లోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీలో ఆంగ్ల అధ్యాపకుడిగా రెండేళ్లు పనిచేశారు. అనంతరం ఢిల్లీ యూనివర్సిటీ, రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో ఆంగ్ల పాఠాలు బోధిస్తూనే, పీహెచ్‌డీ పూర్తి చేశారు. కాలేజీ చదువుల సమయంలోనే ఆయన కుటుంబమంతా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మలిదశ తెలంగాణ పోరాటానికి నాంది పలికిన ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం(ఏఐపీఆర్ఎఫ్) ఆధ్వర్యంలోని వరంగల్ సభ నిర్వహణలో సాయిబాబ కీలక పాత్ర పోషించారు. సల్వాజుడుం దగ్గరి నుంచి ఆపరేషన్ గ్రీన్ హంట్ వరకు.. ఆదివాసీ, గిరిజనులకు వ్యతిరేకంగా సాగుతున్న విధానాలమీద ఫోరం ఎగెనెస్ట్ వార్ ఆన్ పీపుల్ వేదిక ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఉద్యమించారు. సాయిబాబ మృతి పట్ల పౌర హక్కుల నేతలు, సామాజిక వేత్తలు విచారం వ్యక్తం చేశారు. బల్ల రవీంద్రనాథ్, ప్రొఫెసర్ హరగోపాల్, జి.లక్ష్మణ్, ఎం. రాఘవాచారి, విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ తదితరులు సాయిబాబ మృతి పట్ల సంతాపం తెలిపారు. సాయిబాబ మృతి హక్కుల ఉద్యమానికి తీరని లోటని తమిళనాడు సీఎం స్టాలిన్ అన్నారు.

పదేళ్లు అన్యాయంగా జైలు శిక్ష..

ఢిల్లీ యూనివర్సిటీ, రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సమయంలో 2014 మే9న మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణతో సాయిబాబను అరెస్టు చేశారు. 2017 మార్చిలో గడ్చిరోలి సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించడంతో నాగ్‌పూర్ జైలులో ఉన్నారు. 90 శాతం వైకల్యం ఉన్న ఆయన కఠినమైన అండా సెల్‌లో పదేళ్లపాటు శిక్ష అనుభవించారు. ఆ సమయంలో ఆయన తల్లి చనిపోయినా.. కడచూపునకూ నోచుకోలేదు. ఈ ఏడాది మార్చి 5న ముంబై హైకోర్టు నిర్దోషిగా తేల్చడంతో సాయిబాబ విడుదలయ్యారు. జైలులోనూ ఆయన ఖైదీల హక్కుల కోసం అనేక పోరాటాలు, నిరాహార దీక్షలు చేశారు.

మిడిల్ క్లాస్‌కు చౌకగా..

- రాజధాని పరిధిలో మరిన్ని ఎన్టీఆర్ ఎంఐజీ లే అవుట్లు
- పెద్ద అవుటపల్లిలో ఎంఐజీ లే అవుట్ వేసేందుకు సన్నాహాలు
- ఇబ్రహీంపట్నం, నున్నతో పాటు గుంటూరు జిల్లాపైనా దృష్టి
- భూసేకరణ వల్ల రైతులు నష్టపోకుండా చర్యలు
- రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించే యోచనలో సర్కారు

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా సీఆర్‌డీఏ అడుగులు వేస్తోంది. అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో మిడిల్ క్లాస్ కోసం మరిన్ని టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేయాలని భావిస్తోంది. మార్కెట్ ధరల కంటే తక్కువకే ప్లాట్లు ఇచ్చేందుకు వీలుగా ఎన్టీఆర్ ఎంఐజీ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చే యాలని నిర్ణయించింది. రాజధాని ప్రాంత పరిధిలోని ర్యాపిడ్ గ్రోత్ ఏరియాల్లో టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేసేందుకు సిద్ధమవుతోంది. ఇదే సమయంలో సీఆర్‌డీఏ కూడా ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది.

అనుకూలమైన భూములపై దృష్టి

లే అవుట్లు వేసేందుకు సీఆర్‌డీఏ అధికారులు ఇప్పటికే అనుకూలమైన భూముల కోసం వేట సాగిస్తున్నారు. నాటి వీజీటీఎం-ఉడా పరిధిలోని భూములు, ప్రైవేట్ భూములపై దృష్టి సారించారు. కొత్తగా కృష్ణా జిల్లా పెద్ద అవుటపల్లిలో ఎన్‌హెచ్-16కు సమీపంలోనే ఎంఐజీ లే అవుట్ వేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ పశ్చిమ, తూర్పు బైపాస్‌లకు సమీపంలో లే అవుట్‌కు అనుకూలంగా ఉండే భూమి గుర్తించారు. రెండు బైపాస్‌లు పూర్తయితే భవిష్యత్తులో ఆ ప్లాట్లకు విపరీతంగా విలువ పెరిగే అవకాశం ఉంది. లే అవుట్‌కు అవసరమైన భూముల కోసం భూయజమానులతో సీఆర్‌డీఏ సంప్రదింపులు జరుపుతోంది. ఇక్కడ అభివృద్ధి చేసే లే అవుట్లలో ప్లాట్ల ధరలు మార్కెట్ ధరల కంటే తక్కువగా ఉంటాయి కాబట్టి రైతుల నుంచి మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే భూములు తీసుకోవాల్సి ఉంటుంది. రైతులు కూడా నష్టపోకుండా ఉండటానికి వారికి కూడా కొన్ని అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా పరస్పర ప్రయోజన విధానంలో సీఆర్‌డీఏ ఎంఐజీ లే అవుట్లను ఏర్పాటు చేయనుంది. ఇక ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఇబ్రహీంపట్నం, నున్న, గుంటూరు జిల్లాలోని రాజధాని ప్రాంత పరిధిలో కూడా ఎంఐజీ లే అవుట్లకు భూములను సీఆర్‌డీఏ అధికారులు గుర్తిస్తున్నారు.

ధరలు తగ్గించినప్పుడే ఆదరణ

ఇప్పటికే అమరావతి టౌన్‌షిప్, నవులూరు టౌన్‌షిప్, పాయకాపురం టౌన్‌షిప్, ట్రక్ టెర్మినల్స్‌లో ఎంఐజీ ప్లాట్లకు ఈ-వేలం నిర్వహించారు. నవులూరులో 68.26 ఎకరాల విస్తీర్ణంలో 386 ప్లాట్లు వేస్తే అందులో మొత్తం 258 ప్లాట్లను సీఆర్‌డీఏ విక్రయించింది. వీటిలో 190 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ పూర్తయింది. తద్వారా సీఆర్‌డీఏకు రూ. 75.22 కోట్ల ఆదాయం వచ్చింది. పాయకాపురం, తెనాలి, ట్రక్ టెర్మినల్స్‌కు సంబంధించి మొత్తం 56.20 ఎకరాల్లో 426 ప్లాట్లకు 64 ప్లాట్లను విక్రయించారు. వీటిలో 33 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సీఆర్‌డీఏకు రూ.46.91 కోట్ల ఆదాయం వచ్చింది. ఇంతకుముందు సీఆర్‌డీఏ ఎంఐజీ ప్లాట్ల ఈ ఆక్షన్‌కు చర్యలు చేపట్టగా, పెద్దగా స్పందన రాలేదు. మార్కెట్ రేటు కంటే గణనీయంగా ధరలు తగ్గించినపుడే ఆదరణ వచ్చింది.

రిజిస్ట్రేషన్ ధర కూడా తగ్గించాలని..

లే అవుట్లలో ప్లాట్ల ధరలు తగ్గించినా రిజిస్ట్రేషన్ ధరలు ఎక్కువగా ఉన్నాయని కొనుగోలుదారులు అభిప్రాయపడుతున్నారు. ఇంకా రిజిస్ట్రేషన్ చేసుకోని వారిలో కొందరు మునిసిపల్ మంత్రి నారాయణను కలిసి ఎంఐజీ ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఈ విషయాన్ని మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సీఆర్‌డీఏ అధికారులు మరిన్ని ఎంఐజీ లే అవుట్లు అభివృద్ధి పరిచేందుకు సిద్ధమవుతున్న దశలో రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి

- ఈనెల 17న అన్ని జిల్లాల్లో వేడుకలు
- అనంతపురంలో రాష్ట్రస్థాయి ఉత్సవాలు
- యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చిన ప్రభుత్వం

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో టీడీపీ యువనేత, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చింది. బీసీల ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తూ వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 17న వాల్మీకి జయంతి సందర్భంగా అన్ని జిల్లాల్లోనూ జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని పేర్కొంది. అదే రోజున అనంతపురంలో రాష్టస్థాయిలో వాల్మీకి జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ప్రభుత్వం తరఫున బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత హాజరవుతారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో లోకేశ్‌కు అప్పట్లో భారీ సంఖ్యలో వినతులు అందాయి. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రాముఖ్యతనిస్తూ అప్పట్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.

సిరిమానోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- నేడు తొలేళ్లు



పైడితల్లి అమ్మవారు

విజయనగరం రూరల్, అక్టోబరు 13: విజయనగరం పైడిమాంబ సిరిమానోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉత్సవానికి ముందు జరిగే ఘట్టం.. తొలేళ్ల ఉత్సవానికి సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 4.45 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం తొలేళ్ల ఉత్సవానికి సిద్ధం చేస్తారు. వివిధ రకాల పూలతో అలంకరిస్తారు. భక్తులు సోమవారం ఉదయం నుంచి మంగళవారం సిరిమానోత్సవం జరిగే వరకూ పైడిమాంబను దర్శించుకుంటారు. తొలేళ్ల నేపథ్యంలో రాజవంశీయులు పైడిమాంబకు సారే, పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల మధ్య పూసపాటి వంశీయులు ఈ తంతులో పాల్గొంటారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకడంతో పాటు ప్రత్యేక పూజలకు అవకాశం కల్పిస్తారు

ఫోర్టో చైర్మన్‌గా కరణం హరికృష్ణ

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్(ఫోర్టో) చైర్మన్‌గా కరణం హరికృష్ణ ఎన్నికయ్యారు. ఫోర్టో రాష్ట్ర కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. సెక్రటరీ జనరల్‌గా అంకాల్ కొండయ్య, గౌరవాధ్యక్షునిగా టీ.వెంకట్‌రెడ్డి, ముఖ్య సలహాదారుగా బలివాడ ధనుంజయ్, కోశాధికారిగా సీహెచ్ శ్రీనివాసరావు, కోచైర్మన్లుగా బృందలై, ఎస్.శ్రీనివాసరావు, డీ.విజయలక్ష్మి, ఎల్.దుర్గారావు, షేక్ కరీముల్లా తదితరులు ఎన్నికయ్యారు.

వివిధ

కొత్త పాఠకులు ఏం చదువుతున్నారు...



తెలుగులో పుస్తకాలు చదవడం మొదలుపెట్టాలి అనుకొనేవాళ్ళకి కొన్ని పుస్తకాలు చెప్పమంటే, ఎక్కువమంది తమకి నచ్చిన పుస్తకాల గురించి చెప్పేవారు. 2021 హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఆ పుస్తకాలను వెతికి కొన్నాను. కానీ చదవడానికి ఇబ్బంది పడ్డాను. క్లిష్టమైన భాషే కాకుండా, నాకు తెలియని ఎన్నో గొప్ప సిద్ధాంతాలతో ఉన్న పుస్తకాలు అవి. కానీ ఒక కొత్త పాఠకుడు సులువుగా అర్థమయ్యే పుస్తకాలను చదవడానికి ఇష్టపడతాడు. ఇలాంటి బిగినర్ ఫ్రెండ్లీ పుస్తకాల గురించి మాట్లాడంతోపాటు, సమకాలీన సాహిత్యాన్ని అందరికీ పరిచయం చెయ్యాలి అనే ఉద్దేశంతో మొదలు పెట్టిందే- 'The తెలుగు Collective' ఇన్‌స్టాగ్రామ్ పేజీ. ఈరోజుకు దాదాపు 25వేల మంది ఫాలోయర్స్ ఉన్నారు. ఎక్కువమంది 30ఏళ్ల లోపువారే. తెలుగు పుస్తకాలు ఈ మధ్యనే మొదలుపెట్టిన వాళ్ళ నుంచి ఎన్నో ఏళ్లుగా చదువుతున్న వాళ్ళ దాకా అందరూ ఉన్నారు. ఈ ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా పుస్తక పరిచయాలు మాత్రమేగాక, 'మీట్ & గ్రీట్' పేరుతో బుక్ క్లబ్ కూడా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఒక పుస్తక రచయితను పాఠకులు కలుసుకొని ఆ పుస్తకంపై తమ అభిప్రాయాలు, సందేహాల గురించి చర్చించే అవకాశం ఉంటుంది. ఈ పేజీ నిర్వహణలో భాగంగా కొత్త పాఠకులు, వారి అభిరుచుల గురించి తెలుసుకొనే అవకాశం నాకు దొరికింది. ఇప్పుడు 'వివిధ' పేజీ తరపున 30ఏళ్ల లోపు పాఠకులు కొందరితో మాట్లాడాను. వారు చదివిన మొదటి పుస్తకం ఏమిటి? ఇష్టమైన రచయిత (రచయిత్రి) ఎవరు? ఎక్కువగా చదవడానికి ఇష్టపడే జానర్ ఏమిటి? పుస్తకాలు ఎక్కడ కొంటారు? లాంటి ప్రశ్నలను అడిగితే- వారి నుంచి వచ్చిన జవాబులు ఇవి.

■ ఆదిత్య అన్నావఝుల
instagram.com/telugu_collective/



భార్గవి బెజ్జం
నేను జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణిని మరోపక్క పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాను. బాల్యం నుంచే పుస్తక పఠనం చేస్తున్నాను. నేను చదివిన మొదటి నవల 'మానవి'. దీనిని ఓల్గా గారు రచించారు. వీరు నాకు ఇష్టమైన రచయితల్లో ముఖ్యులు. దళిత, స్త్రీవాద, సామాజిక స్పృహ కలిగిన పుస్తకాలు చదువుతాను. అన్ని రచనా ప్రక్రియలు చదువుతాను. వ్యాసాలు నన్ను ఎక్కువ ఆకట్టుకొంటాయి. మనం ఏ స్థితిలో ఉన్నా, పుస్తక పఠనం గుండె నిబ్బరాన్నీ స్థిత ప్రజ్ఞతను ఇస్తుందని నమ్ముతాను. పుస్తకాలను నేరుగా షాపుల్లో కొనడానికి ఇష్టపడతాను. పుస్తకం వెనక అట్ట మీద రచయిత లేదా ఇతరులు రాసిన విషయాన్ని బట్టి పుస్తకాన్ని ఎంచుకుంటాను.



పవన్
ఈ మధ్యనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరాను. 'అమరావతి కథలు'తో తెలుగు పుస్తకాలు చదవడం మొదలుపెట్టాను. కవనమాలి రచనలు నన్ను ఎప్పుడూ అబ్బుర పరుస్తాయి. ఏదో తెలియని సంతృప్తిని ఇస్తాయి. ఒక పాఠకుడిగా నాకు అన్ని రచనలు చదవాలి అని ఉంటుంది. ఒకటి ఇష్టంగా పెట్టుకుని గోడ కట్టుకోవాలి అని లేదు. హైదరాబాద్‌లో ఉన్నపుడు బుక్ షాప్‌లో కొనేవాడిని. ఇప్పుడు అమెజాన్‌లో కొంటున్నాను. పుస్తకం కవర్ పేజ్ చూసి, రచయిత ముందు రచనలని బట్టి, లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే సజెషన్స్‌ను బట్టి పుస్తకాలు తీసుకుంటాను.



మాధవ్
ప్రస్తుతం సినిమాల్లో పని చేస్తున్నాను. నేను చదివిన మొదటి పుస్తకం గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం'. పింగళి సూరన్న, కేశవరెడ్డి రచనలు అంటే చాలా ఇష్టం. చదివే టప్పుడు డ్రామా లేదా ఫాంటసీ ఉండే నవలలు చదవడానికి ఇష్టపడతాను. మొదట్లో ఆన్‌లైన్ లేదా స్నేహితుల సలహాలతో పుస్తకాలు కొనుక్కునే వాడ్ని. కానీ ఇప్పుడు పుస్తకం వెనుక అట్ట మీద కథ గురించి రాసింది చదివి కొంటున్నాను. హైదరాబాద్‌లో ఉంటే షాపులో కొనడానికి ఇష్టపడతాను. లేదంటే అమెజాన్, లోగిలి లాంటి వెబ్‌సైట్స్‌లో కొంటాను.



సాయి చరణ్
నేను ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. చిన్నప్పుడు చిట్టి వికటన్ అనే మాసపత్రికలో వచ్చే కథలను ఇష్టంగా చదివేవాడిని. నాకు నచ్చిన రచయిత కేశవరెడ్డి. సూటిగా, వ్యంగ్యంగా ఆయన వాస్తవాన్ని నిర్వచించే తీరు నచ్చుతుంది. చిన్నప్పటి చందమామ కథల ప్రభావం వల్ల పెద్ద పేరాలుగా ఉన్న నవలల కన్నా చిన్నచిన్న పేరాలతో ఉండే కథల్లాంటివి చదవడం ఇష్టం. అభ్యుదయ, భావ కవిత్వం సూటిగా ఉంటుంది కాబట్టి ఇష్టంగా చదువుతాను. సాధారణంగా నేను పుస్తకాలను షాపుల్లోనే కొంటాను. ఈమధ్య ఆడియో బుక్స్, ఆన్‌లైన్ కొనుగోలు అలవాటైంది. పుస్తకాలపై వచ్చే సమీక్షలను బట్టి, లేదా ఆ పుస్తకం ముందుమాట, కవర్ ఫోటోలు ఏమైనా కథపై ఆసక్తి కలిగిస్తే వాటిని బట్టి పుస్తకాన్ని కొంటాను.



ప్రసన్న ఓరుగంటి
ప్రస్తుతం అమెరికాలో అగ్రికల్చర్ మీద పీహెచ్‌డీ చేస్తున్నాను. చిన్నప్పుడు అమ్మమ్మ ఇంట్లో ఉన్న 'తులసీదాసు జీవిత చరిత్ర' నేను చదివిన మొదటి పుస్తకం. అప్పటి రచయితలలో యద్దనపూడి సులోచనారాణి, యండమూరి, గొల్లపూడి మారుతీరావు, పి. శ్రీదేవి, రంగనాయకమ్మ నచ్చితే, ఇప్పటి రచయితలలో వి. మల్లికార్జున్, రవి మంత్రి రచనలు బాగా నచ్చాయి. నేటివిటీకి దగ్గరగా సాగే రచనలు ఎక్కువగా నచ్చుతాయి. ఆత్మపరిశీలనకి తోడ్పడే రచనలను చదవడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. విదేశాలలో ఉండడం వల్ల తెలుగు పుస్తకాలు దొరకటం ఇబ్బంది. ప్రస్తుతానికి ఈ కొరియర్ సర్వీసుల పుణ్యమా అని అక్కడ స్నేహితుల సాయంతో కావాల్సిన పుస్తకాలు అన్నీ ఒకేసారి ఇక్కడికి తెప్పించుకుంటున్నాను. ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.



చిత్కళ
నేను ఇప్పుడు ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ చేస్తున్నాను. నేను తెలుగులో చదివిన మొదటి పుస్తకం శ్రీశ్రీ 'మహాప్రస్థానం'. నాకు కేశవరెడ్డి, సొలోమోన్ విజయ్ కుమార్ రచనలు ఇష్టం. సామాజిక జీవనాన్ని ప్రతిబింబించే రచనలు, మిస్టరీ నవలలు ఇష్టం. పుస్తకాలు బుక్ షాప్‌లో కొనడాన్ని ఇష్టపడతాను. పుస్తకం కథాసారాన్ని చదివి, లేదా ఒక్కోసారి పుస్తకం పేరును బట్టి కూడా పుస్తకాల్ని ఎంపిక చేసుకుంటాను.



విరూపాక్ష
నేను సాఫ్ట్‌వేర్ కంపెనీలో బిజినెస్ అనలిస్టుగా పనిచేస్తున్నాను. మొదటగా పరవస్తు చిన్నయ సూరి 'నీతి చంద్రిక' చదివాను. ప్రత్యేకంగా ఇష్టమైన రచయిత అని లేరు కానీ, ఓల్గా, కె.ఎన్.వై. పతంజలి, కొడవటిగంటి, రావిశాస్త్రి రచనలు అంటే మక్కువ ఎక్కువ. మాండలికంలో ఉన్న కథలు, నాన్ ఫిక్షన్ పుస్తకాలు చదవడానికి ఎక్కువ ఇష్టపడతాను. పుస్తకాలు సాధారణంగా బుక్‌షాప్‌లలో కొనడానికే ఇష్టపడతాను. మా నాన్నగారు, లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉండే స్నేహితుల సూచనలతో పుస్తకాలను కొనడానికి ఇష్టపడతాను.



నిర్వాణ
ప్రస్తుతం సీఏగా పనిచేస్తున్నాను. మొదటి చదివిన పుస్తకం 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి' అని గుర్తుంది. సూర్యదేవర రామ్మోహనరావు రచనలు చదవడానికి ఇష్టపడతాను. ఉత్కంఠభరితంగా సాగే నవలలు లేదా హాయిగా వెళ్లిపోయే షార్ట్ స్టోరీస్ ఎక్కువగా చదువుతాను. ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే రికమెండేషన్స్‌తో దగ్గరలో ఉండే బుక్ షాపులో కొనుక్కుంటాను.





రోహిత్ సత్య
ఈ మధ్యనే సాఫ్ట్‌వేర్ రంగంలోకి అడుగుపెట్టాను. చదివిన మొట్టమొదటి పుస్తకం 'బట్టి విక్రమార్క కథలు'. మనిషిని అర్థం చేయించే పుస్తకాలు ఎక్కువగా ఇష్టపడతాను. అందుకే కాశీభట్ల వేణుగోపాల్ గారు అంటే ఇష్టం. పుస్తకాలు ఎక్కువగా ఆన్‌లైన్‌లో కొనే వాడిని. ఇప్పుడు హైదరాబాద్‌లో బుక్ షాప్‌కు వెళ్లి కొంటున్నాను. స్నేహితుల సలహాలు, ఆన్‌లైన్‌లో వచ్చే సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.



చరణ్ చిన్నన్నగారి
నేను ఇప్పుడు హెచ్‌సీయూలో ఎం.ఏ తెలుగు చదువుతున్నాను. నేను తెలుగులో చదివిన మొదటి పుస్తకం ఓల్గా రాసిన 'విముక్త'. రచయితల్లో ఒకరు ఇష్టం అని చెప్పలేను. ప్రస్తుతానికి ఓల్గా, కేశవరెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, సొలోమోన్ విజయ్ కుమార్ రచనలు, శ్రీశ్రీ, తిలక్ వచన కవితలు బాగా ఇష్టం. మానవుల నిజమైన జనజీవనాన్ని, సంఘటల్ని కొత్త దృక్కోణంలో చిత్రించే నాటకాలు, వచన కవితలు, కథలు, నవలలు, బొమ్మల కథల పుస్తకాలు బాగా ఇష్టపడతాను. నేను పుస్తకాలు ఎక్కువగా బుక్ షాపుల్లో, ఇంకా బుక్ ఫెయిర్లో కొంటాను. స్నేహితుల సూచనలను బట్టి, కథాంశాలను బట్టి బట్టి పుస్తకాలు ఎంపిక చేసుకుంటాను.



రిషిత
సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర'తో చదవడం మొదలుపెట్టాను. 'కాలతీత వ్యక్తులు' రాసిన శ్రీదేవి గారు నాకు చాలా ఇష్టం. ఏదైనా ఆలోచింప చేసేది కానీ ఏదైనా కొత్త అంశం చెప్పే కథలు కానీ ఎక్కువగా చదువుతాను. పుస్తకాలను నవోదయా బుక్ షాప్‌లో గానీ లేదా అమెజాన్‌లో గానీ కొనుక్కుంటాను. రచయితలను ఇన్‌స్పైర్ చేసిన రచనలను ఎన్నుకొని చదువుతాను, లేదా సమీక్షల ఆధారంగా పుస్తకాలు ఎంచుకుంటాను.



సాయి కీర్తన
సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాను. నేను కాలేజీలో ఉన్నప్పుడు 'మస్టర్డ్' అనే పుస్తకం చదివాను (సంపాదకులు: కడలి సత్యనారాయణ, అన్వేష్ చెట్టుపల్లి). ఈ జెనరేషన్ ఫేస్ చేస్తున్న అన్ని ఇష్యూస్ ఆ కథల్లో కనిపిస్తాయి. కొన్నిటికి రిలేట్ అయ్యాను. సీనియర్ రచయితలలో యద్దనపూడి సులోచనారాణి నా ఫెవరేట్. ప్రస్తుతం రాస్తున్న వాళ్లలో కడలి సత్యనారాయణ, మొహమ్మద్ గౌస్ రచనలు బాగా నచ్చాయి. నేను ఎక్కువగా లవ్ స్టోరీస్, థ్రిల్లర్స్ చదవడానికి ఇష్టపడతాను. పుస్తకాలను బుక్‌ఫెయిర్లో లేదా అమెజాన్‌లో కొంటాను. నచ్చిన జానా అయ్యుంటే తప్పకుండా తీసుకుంటాను. లేదంటే స్నేహితుల సూచనలతో తీసుకుంటాను.

మన అనువాదాలకు మార్కెట్ పెంచుకోవాలి

మూడు ప్రశ్నలు

'హర్షణీయం' టీమ్: గిరి, అనిల్, హర్ష

తెలుగు రచయితల పరిచయాలతో, సంభాషణలతో నాలుగేళ్ళ క్రితం మొదలైన 'హర్షణీయం' ఆడియో పాడ్‌కాస్ట్ చానెల్ క్రమంగా ప్రపంచవ్యాప్త అనువాదకులతోను, ప్రచురణకర్తలతోనూ సంభాషణలు నిర్వహిస్తూ పరిధిని విస్తరించుకున్నది. ప్రస్తుతం అరవై భాషల్లో నుంచి వచ్చిన పుస్తకాల గురించి డెబ్భై గంటలకు పైగా ఆడియో హర్షణీయంలో అందుబాటులో ఉంది (harshaneeyam.in). 'హర్షణీయం' పాడ్‌కాస్ట్ టీమ్‌తో (గిరి, అనిల్, హర్ష) ఈవారం 'మూడు ప్రశ్నలు'.

హర్షణీయం పాడ్‌కాస్ట్‌లో అనువాదాలకు (ముఖ్యంగా ప్రపంచ సాహిత్యంలో ఇప్పుడు వస్తున్న అనువాదాలకు) ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చి, ఆ అనువాదకుల ఇంటర్వ్యూలు చేస్తున్నారు. అటువైపు దృష్టి పెట్టాలని ఎందుకు అనిపించింది?

రెండేళ్ళ క్రితం తమిళ రచయిత జయమోహన్ 'అరం' తమిళ కథలు, కన్నడ నవల 'తేజోతుంగభద్ర' వీటి ఆంగ్ల అనువాదాలు చదివాం. అదే సమయంలో కన్నడ రచయిత వసుధేంద్ర, 'ఛాయా' మోహన్ బాబు, కాలచ్చువడు పబ్లిషింగ్ కణ్ణన్ గార్లు అనువాదం గురించి మాట్లాడిన విషయాలు ఆసక్తిని రేకెత్తించాయి. రచన లాగే అనువాదం కూడా ఒక కళారూపం, సృజనాత్మక ప్రక్రియ అని తెలిసింది. అనువాద ప్రక్రియ గురించి తెలుసుకోవాలన్న ఆసక్తితో ఇతర భాషల అనువాదకులతో, పబ్లిషర్లతో మా పాడ్‌కాస్ట్‌లో సంభాషణ మొదలు పెట్టాం. తమిళ – ఇంగ్లిష్ అనువాదకురాలు సుచిత్రా రామచంద్రన్‌తో మాట్లాడినప్పుడు ఒక పుస్తకం గురించి అనువాదకులకంటే విపులంగా వేరెవరూ మాట్లాడ లేరనే విషయం అర్థమైంది. వారితో జరుపుతున్న ప్రతి సంభాషణ ఒక గొప్ప సాహిత్యానుభవం.

ఈ పాడ్‌కాస్ట్‌లలో అనువాదం చుట్టూ ఇన్ని ఇంటర్వ్యూలు చేసిన తర్వాత ప్రస్తుత అనువాద సాహిత్య వాతారణం మీద మీ అవగాహనకు వచ్చిన కొత్త విషయాల గురించి చెప్పండి?



('హర్షణీయం' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఇతర భాషల అనువాదకులు కొందరి ఫోటోలు.)

ప్రపంచవ్యాప్తంగా అనువాదాలకు ఆదరణ, అనువాదకులకు గుర్తింపు పెరుగుతోంది. భారతీయ భాషల్నించి ఇంగ్లీష్ లోకి అనువాదాలు చాలా తక్కువగా వెడుతున్నాయి (మిగతా భాషలతో పోలిస్తే బెంగాలీ, తమిళ, హిందీ భాషల పరిస్థితి కొంత మటుకు మెరుగు). యూరప్, లాటిన్ అమెరికా, జపాన్, కొరియాల నుంచి సాహిత్యం విరివిగా ఇంగ్లీష్ లోకి అనువాదం అవుతోంది. BCLT (UK), ALTA (USA), SALT (Chicago university) లాంటి సంస్థలు, Words Without Borders, Asymptote లాంటి ఆన్‌లైన్ పత్రికలు ప్రపంచ వ్యాప్తంగా అనువాదాలపై అవగాహన పెంచడానికి విశేషంగా కృషి చేస్తున్నాయి. అనువాదాల్లో ముందుండే దేశాల్లో పిల్లల సాహిత్యం కూడా ఎక్కువగా అనువాదం అవుతోంది. అనువాదాలను తమ భాష నించీ వేరే భాషలకు తీసుకెళ్ళడంతో పాటూ వేరే భాషల సాహిత్యాన్ని తమ భాషలోకి తీసుకురావడం పైన ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. 3.5 లక్షలమంది మాట్లాడే ఐస్లాండిక్ భాషకూ రెండు లక్షలమంది మాట్లాడే ఎస్పెరాంటో భాషకూ కూడా పదుల సంఖ్యలో సాహితీ అనువాదకులు వున్నారు. కొన్ని చోట్ల ప్రసిద్ధి కెక్కిన రచయితల పుస్తకాలు ఒకే సమయంలో ఏడెనిమిది భాషల అనువాదకులు కలిసి అనువాదం చేస్తారు. బుకర్, పెన్ లాటి అనేక సంస్థలు ప్రతి ఏటా అనువాదాలకు పెద్దఎత్తున బహుమతులను ప్రకటిస్తున్నాయి. మన దేశంలో సాహితీ అనువాదాలకు జేసీబీ ఇచ్చే బహుమతి చెప్పుకోదగ్గది.

అనువాదాలు బాగా జరుగుతున్న అమెరికా, యూరప్‌లలో అనువాదాలకు సంబంధించి ఎలాంటి వాతావరణం వుంది?

వారు తమ భాషా సాహిత్యం ఇతర భాషల్లోకి అనువదింపబడటానికి చాలా ప్రాముఖ్యత ఇస్తారు. ముఖ్యంగా ఇంగ్లీషులోకి వస్తే, ఎక్కువమంది పాఠకులకు చేరువ అవ్వటమే కాక, ఇతర భాషలైన ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, స్వీడిష్ లాంటి అనేక భాషల్లోకి పుస్తకం వెళ్ళే అవకాశం ఉంటుంది. ప్రసిద్ధ రచయితలందరూ, స్వీడిష్ భాషలో తమ రచనలు ఉండాలని ఆశిస్తారు. స్వీడిష్‌లో వచ్చే గొప్ప అనువాద రచనలకు నోబెల్ పురస్కారం వచ్చే అవకాశాలు మెరుగవుతాయి. ఫ్రెంచ్, నార్వే ప్రభుత్వాలు, తమ సాహిత్యాన్ని అనువదించి ప్రచురించే పబ్లిషర్లకు ప్రత్యేక రాయితీలు, గ్రాంట్లు ఇస్తాయి. మన దేశం నించి ఇలాంటి సహాయం తరచూ పొందేవారిలో కలకత్తాకు చెందిన సీగల్ పబ్లిషర్స్, నాగర్ కోయిల్‌కు చెందిన కాలచ్చువడు పబ్లిషర్స్ ముఖ్యమైనవి. (ఈ మధ్యనే తమిళనాడు ప్రభుత్వం కూడా ఇలాంటి రాయితీలు ఇవ్వడం మొదలెట్టింది.) ప్రతి ఏటా వచ్చిన అనువాదాల్లో నుంచి ఎంపిక చేసి బహుమతులు ఇచ్చే ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలు అనేకానేకం వున్నాయి.

పబ్లిషర్లు ఫ్రాంక్‌ఫర్ట్, లండన్, ఢిల్లీలలో జరిగే అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలలో తప్పక పాల్గొంటారు. పుస్తకాల హక్కుల కోసం పబ్లిషర్లు రైట్స్ కాటలాగ్ (ప్రచురణ హక్కుల రాయల్టీ తదితర వివరాలతో) తయారు చేసుకోవడం తప్పనిసరి. పబ్లిషర్లు అనువాదాల నాణ్యతపైన ప్రత్యేక శ్రద్ధ పెడతారు.

కొన్ని దేశాల్లో ప్రభుత్వ సంస్థలు అనువాదకులు పుస్తకం ఎంచుకున్న తర్వాత ఏ ఇబ్బంది లేకుండా పని చేసుకోడానికి వాతావరణం కల్పించి అన్ని ఖర్చులతో రెసిడెన్సీలను నిర్వహిస్తాయి. అనువాదకులు కూడా మూల రచన, రచయిత మీద ఎంతో గౌరవంతో అనువాదాలు చేస్తూ, సామర్థ్యాన్ని పెంచుకునేందుకు నిరంతరం కృషి చేస్తారు. సంఘాలుగా ఏర్పడి హక్కులను పరిరక్షించుకుంటారు. అంటే, కనీస వేతనాలకు డిమాండ్లు, అనువాదకుల ఎంపికలో జాతి వివక్ష ఉండకుండా చూడటం, అనువాదకులకు సరైన గుర్తింపు (ఉదాహరణకు పై పేజీలో వారి పేరు)... మొదలైనవి.

తెలుగు భాష నుంచి ఇంగ్లీష్ అనువాదాలకు వస్తే- మన పరిస్థితి అత్యంత నిరాశాజనకంగా ఉంది. వచ్చిన అతితక్కువ అనువాదాల్లోనూ పుస్తకాల ఎంపిక సరిగా లేకపోవటం, అనువాద నాణ్యత కొరవడటం, పుస్తక ముద్రణలో నాణ్యత లేకపోవటం, సరైన అనువాదకులు సరైన సంఖ్యలో లేకపోవడం, పబ్లిషర్లు అనువాదాలతో ఇంగ్లీషులాంటి పెద్ద మార్కెట్‌కు చేరువయ్యే ప్రయత్నాలు చేయకపోవడం దీనికి ముఖ్య కారణాలు. ఇది జరగాలంటే మన సాహిత్యం ఇతర భాషా సాహిత్యాలకు తీసిపోదని గుర్తెరిగి ఉండటం, కొత్త మార్కెట్లను చేరుకోవడానికి కావాల్సిన అన్ని వనరులను పెట్టుబడిగా పెట్టడం ముఖ్యం.

తెలుగు నుంచి ఇంగ్లీష్‌కు అనువాద నాణ్యతను పెంచడానికి ఇప్పుడు రెండు చెప్పుకోదగ్గ ప్రయత్నాలు ఇక్కడ కూడా జరుగుతున్నాయి. మొదటిది- అక్టోబర్ నుంచి ప్రఖ్యాత ఫ్రెంచి అనువాదకురాలు రాస్ స్కాట్ తదితరులు నిర్వహించబోయే ఆరు నెలల మెంటరింగ్ వర్క్‌షాప్. ఈ వర్క్‌షాప్ హైదరాబాద్‌కు చెందిన ఛాయా రిసోర్సెస్, అజు పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతోంది. రెండోది- అమెరికన్ లిటరరీ ట్రాన్స్‌లేటర్స్ అసోసియేషన్ (ALTA) తెలుగు – ఇంగ్లీష్ అనువాదకుల వర్క్‌షాప్. దీనిని తెలుగు కవి అఫ్సర్ నిర్వహిస్తారు.

harshaneeyam@gmail.com

> అనువాద ప్రక్రియ గురించి తెలుసుకోవాలన్న ఆసక్తితో ఇతర భాషల అనువాదకులతో, పబ్లిషర్లతో మా పాడ్‌కాస్ట్‌లో సంభాషణ మొదలు పెట్టాం. తమిళ – ఇంగ్లిష్ అనువాదకురాలు సుచిత్రా రామచంద్రన్‌తో మాట్లాడినప్పుడు ఒక పుస్తకం గురించి అనువాదకులకంటే విపులంగా వేరెవరూ మాట్లాడ లేరనే విషయం అర్థమైంది. వారితో జరుపుతున్న ప్రతి సంభాషణ ఒక గొప్ప సాహిత్యానుభవం.

హర్షణీయం అందరికీ

వేదగిరి రాంబాబు పురస్కారాలు
వేదగిరి రాంబాబు పురస్కారాల ప్రదానోత్సవం, 'మా కథలు 2023' పుస్తకావిష్కరణ సభ అక్టోబర్ 14 ఉ.10గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. పురస్కార గ్రహీతలు కెఎస్వీ రమణమ్మ (బాలసాహిత్య పురస్కారం), హుమాయూన్ సంఘీర్ (కథానికా పురస్కారం). 'మా కథలు 2023'ను కె.వి. రమణాచారి ఆవిష్కరిస్తారు. సభలో విహారి, బి.ఎస్. రాములు, పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 9849061668.
సింహప్రసాద్ సాహిత్యసమితి

సుమనశ్రీ సాహితీ సమాలోచన
కవి సుమనశ్రీ (చెల్లపిళ్ల కామేశ్వరరావు) సాహితీ సమాలోచన అక్టోబర్ 15 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సుమనశ్రీ సాహిత్య జీవన వ్యక్తిత్వం గురించి మిత్రులు పాఠకులు ఆలోచనలను, జ్ఞాపకాలను కలబోసుకుంటారు. మిత్రులందరికీ ఆహ్వానం.
సుమనశ్రీ మిత్రులు

కథల ముచ్చట్లు
తెలంగాణ రచయితల వేదిక (తె.ర.వే.) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి కలెక్టరేట్ ప్రాంగణంలో అక్టోబర్ 17 సాయంత్రం '138వ ఎన్నీల ముచ్చట్లు' సాహిత్య కార్యక్రమంలో భాగంగా ఈ విడత 'కథల ముచ్చట్లు' కార్యక్రమం జరుగుతుంది. సింగిల్ పేజీ చిన్న కథలతో హాజరు కావాలని రచయితలకు పిలుపు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ ఆతిథ్యంలో ఈ 'కథల ముచ్చట్లు' జరుగుతాయి. గాజోజు నాగభూషణం, బి.వి.ఎన్. స్వామి, పుల్లూరి జగదీశ్వరరావు కథలను సమీక్షిస్తారు.
సి. వి. కుమార్

రెండు అనువాదాలు
గీతాహరిహరన్ రచనకు ఓల్గా అనువాదం 'పోటెత్తిన కెరటాన్ని', ఆకార్ పటేల్ రచనకు ఎన్. వేణుగోపాల్ అనువాదం 'నియంత అంతం' ఈ రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ మలుపు బుక్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 19 సా.6 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ పుస్తకాల్ని ఆకార్ పటేల్, గీతా హరిహరన్‌లు ఆవిష్కరిస్తారు. సభాధ్యక్షత ఎ.కె. ప్రభాకర్, వక్తలు కె. శ్రీనివాస్, కె.ఎన్. మల్లీశ్వరి; నిర్వహణ మలుపు బాల్‌రెడ్డి.
మలుపు బుక్స్

సుద్దాల పురస్కారం
సుద్దాల ఫౌండేషన్ ప్రకటించిన 'సుద్దాల హనుమంతు – జానకమ్మ' జాతీయ పురస్కారాన్ని అరుణోదయ నాగన్న స్వీకరిస్తారు. పురస్కార ప్రదానోత్సవం అక్టోబర్ 19 సా.6గంటలకు సుందరయ్య కళానిలయం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి జస్టిస్ నగేష్ భీమపాక; విశిష్ట అతిథులు పిల్లల మర్రి రాములు, సూర్య ధనుంజయ్; సభాధ్యక్షులు సుద్దాల సుధాకర్ తేజ; స్మారకోపన్యాసం పోరెడ్డి రంగన్న; ఆత్మీయ అతిథి యోచన; స్వాగతం సుద్దాల ప్రభాకర్, వందన సమర్పణ చి. ఉన్నత్.
సుద్దాల అశోక్ తేజ

'వంశవృక్షం' నవలపై ప్రసంగం
రాజాం రచయితల వేదిక 117వ సమావేశం అక్టోబర్ 20 ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా, రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. రౌతు గణపతి రావునాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'వంశవృక్షం నవల – పరిశీలన' అంశంపై పొదిలాపు శ్రీనివాసరావు ముఖ్యప్రసంగం చేస్తారు. వివరాలకు: 98857 58123.
గార రంగనాథం

కళింగాంధ్ర కవితలు
కళింగాంధ్ర ప్రాంతానికి చెందిన కవులు రాసి ఇప్పటికే అచ్చైన దళిత, మత్స్యకార కవితలతో విడివిడి సంకలనాలను 'చంపావతి ప్రచురణలు'గా నా సంపాదకత్వంలో తీసుకువస్తున్నాను. మీ వద్ద ఉన్న పై విభాగాలకు చెందిన కవితలను, వాటి అచ్చైన వివరాలను champaavathi@gmail.comకు ఈమెయిల్ చేయాల్సిందిగా కోరుతున్నాను. ఫోన్: 96764 93680.
బాలసుధాకర్

మొదటి నవలలకు ఆహ్వానం
అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్, వరంగల్ నవలాకారుల మొదటి నవలలను ఆహ్వానిస్తున్నది. మొదటి, రెండవ బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు. నవల నిడివి ప్రింట్‌లో 100 పేజీలకు తగ్గకుండా, 250పేజీలకు మించకుండా ఉండాలి. 2023 – 2024 మధ్య నవలా రచన జరిగి, పత్రికలలో ప్రచురితం కాని నవలనే, డిటిపి చేయించి మాత్రమే అక్టోబర్ 31 తేదీ లోగా పంపాలి. చిరునామా: డి. స్వప్న, 2-7-71, ఎక్సయిజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్ – 506001. ఫోన్: 99892 91299.
అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్





పూర్ణాహుతిలో పాల్గొన్న ఈవో రామారావు



కంపార్ట్‌మెంట్లలో కిక్కిరిసిన భక్తులు





పార్వతీ గంగా సమేత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు



క్యూలైన్లలో పోటెత్తిన భక్తులు, భవానీలు

జన జాతర

మునుపెన్నడూ లేనంతగా భవానీ భక్తుల రాక

- విజయ దశమిన పోటెత్తిన ఇంద్రకీలాద్రి
- మూలా నక్షత్రాన్ని మించి 2 లక్షల మంది వరకు దర్శనం

- శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిసారిగా కంపార్టుమెంట్ విధానం
- 38 కంపార్టుమెంట్లు నిండి రోడ్లపైకి చేరిన జనం
- వీఐపీ దర్శనాలు రద్దు.. అన్నిలైన్లు ఉచితం
- దర్శనానికి 7 గంటల సమయం
- రంగంలోకి ఆక్టోపస్, స్పెషల్ బలగాలు
- వరద కారణంగా నదీ విహారానికి బ్రేక్
- హంస వాహనంపై ప్రత్యేక పూజలతో సరి
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఇంకా వస్తున్న భవానీలు.. ఏర్పాట్లు కొనసాగింపు

భక్తజనసంద్రం ఇంద్రకీలాద్రికి పోటెత్తింది. భవానీ మాలధారులు వెల్లువలా కదిలివచ్చారు. మూలా నక్షత్రాన్ని మించి మునుపెన్నడూ లేనంత రద్దీ విజయ దశమికి తరలివచ్చింది. ఆలయ పరిసరాలతో పాటు క్యూలైన్లు, కనకదుర్గానగర్, ఘాట్‌రోడ్డు, కెనాల్‌రోడ్డు, వీఎంసీ కార్యాలయం వద్ద రహదారి, స్నానఘాట్లు కిక్కిరిసిపోయాయి. భక్తుల రద్దీని నియంత్రణలో ఉంచడానికి కంపార్టుమెంట్ల విధానంలో దర్శనానికి అనుమతించారు. అయినా రద్దీ పెరగడంతో పోలీసులు ఆక్టోపస్ బలగాలను రంగంలోకి దింపారు. భవానీలు నిరంతరాయంగా కదిలివస్తుండటంతో అన్ని దర్శనాలను ఉచితంగా అనుమతించారు. దీంతో దశమి రోజు దర్శనానికి 7 గంటల సమయం పట్టింది. ఉత్సవాలు ముగిసినా.. ఆదివారం కూడా రద్దీ ఏమాత్రం తగ్గకపోవడంతో ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు.



ప్రసాదాల కౌంటర్ వద్ద కిటకిట



దుర్గాఘాట్‌లో పార్వతీ గంగా సమేత మల్లేశ్వరస్వామికి పూజలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రి జనసంద్రమైంది. సాధారణ భక్తులను మించిపోయి భవానీ మాలధారులు రావడంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. అధికారుల అంచనాలను తలకిందులు చేస్తూ శనివారం తెల్లవారుజాము నుంచి ఆదివారం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. భవానీ దీక్షలు తీసుకున్న భక్తులు మంగళవారం, శుక్రవారం మాల విరమణ చేయరు. దీంతో శనివారం ఒక్కసారిగా పోటెత్తారు. ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా.. మొత్తం మీద 5లక్షల మంది దీక్ష తీసుకున్నట్టు గురుభవానీలు చెబుతున్నారు. వీరిలో చాలామంది శనివారమే విజయవాడకు చేరుకున్నారు. దీంతో క్యూలన్నీ ఒక్కసారిగా నిండిపోయాయి. క్యూల్లోకి వెళ్లలేమని భావించిన భక్తులు ఘాట్‌రోడ్డు ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న డివైడర్ వద్ద గుమిగూడారు. తమను ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి పంపాల్సిందేనని పోలీసులతో వాదనకు దిగారు. దీంతో విజయదశమి రోజున దర్శనానికి 7 గంటల సమయం పట్టింది. శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు భవానీలు అడ్డదారిలో కొండ ఎక్కడానికి ప్రయత్నించారు. కుమ్మరిపాలెం వైపున నిర్మిస్తున్న ఘాట్‌రోడ్డు రిటైనింగ్ వాల్ పక్క నుంచి చెట్లను పట్టుకుని కొండ ఎక్కారు. ఆదివారం మధ్యాహ్నం వరకు భక్తులు రహదారులపై నిలబడే ఉన్నారు. రాత్రి వరకు హోల్డింగ్ పాయింట్ల నుంచే క్యూల్లోకి వదిలారు.

డ్రోన్ల పర్యవేక్షణ.. ఆక్టోపస్ అదనపు బలగాలు

సాధారణంగా శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రం రోజున - మిగతా 6లో



కనకదుర్గానగర్‌లో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) సొమ్మసిల్లిన భవానీ



నేడు కంకిపాడులో పల్లె పండుగ

అభివృద్ధి పనులు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

- వారం రోజుల పాటు పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాల నిర్వహణ
- కృష్ణాజిల్లాలో 2,113 ఎన్ఆర్ఈజీఎస్ పనులకు రూ.169 కోట్లు విడుదల
- రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్న ప్రభుత్వం

కంకిపాడు, అక్టోబరు 13 : గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా పల్లె పండుగ కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల రూపురేఖలను మార్చనుంది. ఈ పండుగను కృష్ణాజిల్లా కంకిపాడు నుంచే ప్రారంభించనుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభంకానున్నాయి. కంకిపాడులోని టీడీపీ కార్యాలయ ఆవరణలో సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కంకిపాడులో రూ. 91 లక్షలతో నిర్మించే 11 సిమెంటు రోడ్లు, రూ. 4.15 లక్షలతో రెండు గోకులాలు, పునాదిపాడులో రూ.54 లక్షలతో రెండు సిమెంటు రోడ్ల నిర్మాణానికి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే కంకిపాడులో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. సోమవారం నుంచి వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు జరపనున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల రూపురేఖలు మార్చనున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టనున్న 2,113 అభివృద్ధి పనులకు రూ.169 కోట్లు మంజూరయ్యాయి. వీటితో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, శ్మశానాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాల భవనాలకు ప్రహరీలు, డ్రెయిన్లు నిర్మించనున్నారు. అలాగే రోజు వారీ పనులు చేసే కూలీలకు చెల్లింపులు చేయనున్నారు. కంకిపాడులో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖమంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొననున్నారు. కాగా, కంకిపాడులో జరిగే పల్లె పండుగ సభ ఏర్పాట్లను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా తదితరులు ఆదివారం పరిశీలించారు.



నగరంలో భాగ్యశ్రీ బోర్సే సందడి

ప్రముఖ మోడల్, మిస్టర్ బచ్చన్ సినిమా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే నగరంలో ఆదివారం సందడి చేసింది. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఆమె తన అందచందాలతో యువతను ఆకట్టుకుంది. - పటమట

లాటరీకి వేళాయె

- మద్యం దుకాణాల కేటాయింపునకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలోని 113 షాపులకు 8,767 దరఖాస్తులు

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేయనున్న 113 మద్యం దుకాణాలను సోమవారం లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. జిల్లాలోని 113 మద్యం షాపులకు 8,767 దరఖాస్తులు వచ్చాయి. విజయవాడ గురునానక్ కాలనీలో ఉన్న నాక్ (ఎన్ఏసీ) కల్యాణ మండపంలో లాటరీ తీయనున్నారు. దరఖాస్తుదారులు ఉదయం ఏడు గంటలకు హాల్లోకి చేరుకోవాలని ఎక్సైజ్ శాఖ డీసీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.



దీక్ష విరమించేందుకు కాలినడకన వస్తున్న భవానీ మాలధారి



కృష్ణవేణి ఘాట్ ప్రాంతంలో..



పీఎంసీ రోడ్డులో..



కీలాద్రి.. కిటకిట

దీక్షల విరమణకు పోటెత్తిన భవానీలు • కిక్కిరిసిపోయిన దుర్గగుడి పరిసరాలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో దీక్షల విరమణ కోసం భక్తులు శని, ఆదివారాల్లో ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. దీంతో దుర్గగుడి పరిసరాలు కిటకిటలాడాయి.



దీక్షలు విరమిస్తున్న భవానీలు

దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలపై ఉండాలి: సురేఖ

వన్‌టౌన్: దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని మెగాస్టార్ చిరంజీవి సతీమణి కొణిదల సురేఖ తెలిపారు. శనివారం ఇంద్రకీలాద్రిపై రాజరాజేశ్వరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను కుటుంబసభ్యులతో కలిసి ఆమె దర్శించుకున్నారు. దుర్గమ్మను నటుడు పృధ్వీ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

దుర్గమ్మకు బంగారు హారం

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆదివారం నెల్లూరుకు చెందిన వ్యాపారవేత్త పంకజ్‌రెడ్డి, సరిత దంపతులు రూ.10 లక్షల విలువైన బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. ఈవో రామారావును ద్వారా హారాన్ని దేవస్థానానికి అందజేశారు.

అలరించిన కళారూపాలు

పున్నమీఘాట్ ప్రాంతంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో



గిరిజనుల సంప్రదాయ నృత్యప్రదర్శన

నిర్వహిస్తున్న నారీశక్తి విజయోత్సవాలు రెండో రోజు కార్యక్రమానికి మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. శనివారం విజయదశమి సందర్భంగా మహిళల రాక, వివిధ కళారూపాల ప్రదర్శనతో కృష్ణా తీరం ప్రత్యేక శోభను సంతరించుకుంది. గిరిజన సంప్రదాయ కొమ్ము నృత్యం మహిళలను అలరించింది. తెలంగాణ సంప్రదాయమైన పోతురాజు వేషధారణలో విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

మహర్నవమి రోజున రూ.84.02 లక్షల ఆదాయం

వన్‌టౌన్, అక్టోబరు 13: ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు శుక్రవారం(మహర్నవమి)తో ముగిశాయి. శుక్రవారం మహిషాసురమర్దినీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. ఆరోజున కనకదుర్గమ్మ దేవస్థానానికి రూ.84,02,775 ఆదాయం సమకూరింది. 4,149 మంది భక్తులు రూ.500 టికెట్లు కొనుగోలు చేయగా రూ.20,74,500, 1,847 మంది రూ.300 టికెట్లు కొనుగోలు చేయగా రూ.5,54, 100, రూ.100 టికెట్‌తో 4,686 మంది దర్శించుకోగా రూ.46, 86,000 సమకూరింది. 26,584 లడ్డూలను విక్రయించగా, రూ.3,98,760, రూ.100 చొప్పున ఆరు లడ్డూలున్న ప్యాకింగ్ లను విక్రయించగా రూ.44,06,600 సమకూరింది. మొత్తం 2,64,396 లడ్డూలను విక్రయించారు. పరోక్ష ప్రత్యేక కుంకు మార్చన రూ.3000 టికెట్లను 18 మంది కొనుగోలు చేయగా రూ.54వేలు, పరోక్ష ప్రత్యేక చండీహోమానికి రూ.4వేల టికెట్లను ఏడుగురు కొనుగోలు చేయగా రూ.28వేలు, శ్రీచక్ర నవావరణార్చన కోసం రూ.3,000 టికెట్‌ను ఇద్దరు కొనుగోలు చేయగా రూ.6వేలు ఆదాయం వచ్చింది. పబ్లికేషన్లు, ఫొటో లు, క్యాలెండర్ల ద్వారా రూ.10,230, ఇతరత్రా ఆదాయం రూ.20, 545, రూ.40 టికెట్ ద్వారా 9,536 మంది తలనీలాలు సమర్పించగా రూ.3,81,440 ఆదాయం సమకూరింది.



దుర్గామల్లేశ్వరస్వామి నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు



చిరంజీవి సతీమణి సురేఖకు వేద ఆశీర్వచనం



నటుడు పృథ్వీరాజ్ కుటుంబసభ్యులు

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ట్రాఫిక్ పోలీస్ అధికారి

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఓ చిన్నారి తల్లిదండ్రుల నుంచి తప్పిపోయాడు. బందోబస్తు నిర్వర్తిస్తున్న పోలీసులు ఆ చిన్నారిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. కోనసీమ జిల్లా యానాం ప్రాంతానికి చెందిన విష్ణు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చాడు. శనీశ్వరుడి ఆలయం వద్ద ఘాట్‌లో స్నానం చేసి దుస్తులు మార్చుకోవడానికి తల్లిదండ్రులు వెళ్లారు. వారి రెండున్నరేళ్ల బాలుడిని మెట్ల వద్ద కూర్చోబెట్టారు. వారు దుస్తులు మార్చుకుని వచ్చేసరికి బాబు కనిపించలేదు. బాబును అక్కడ కూర్చోబెట్టిన విషయం తల్లిదండ్రులు మరిచిపోయారు. బ్యాగుల్లో దుస్తులు సర్దుకుని దర్శనానికి వెళ్లిపోయారు. బాబు అక్కడ రోడ్డుపై ఏడుస్తూ తిరుగుతుండగా ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న ఆర్ఐ సూర్యభాస్కరరావు, తోటి సిబ్బంది గుర్తించారు. బాబుకు ఎదుటి వ్యక్తుల మాటలు వినిపించడం లేదు. మాట్లాడలేకపోతున్నాడు. దీంతో పోలీసులు మైకుల్లో బాబు తప్పిపోయాడని ప్రకటన చేయించారు. ఈ ప్రకటన విన్న విష్ణు కుటుంబసభ్యులు బాబు తమతో లేకపోవడంతో వెంటనే వచ్చి పోలీసుల వద్ద నుంచి బాబును తీసుకున్నారు.

ఈతకు వెళ్లి.. సీఏ విద్యార్థి గల్లంతు



రేపల్లె రాజ్ (ఫైల్)

వన్‌టౌన్, అక్టోబరు 13: స్వర్గపురి ఘాట్ సమీపంలో కృష్ణానదిలో ఈతకు ఆదివారం వెళ్లిన ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు గల్లంత య్యారు. కృష్ణ లంక పైడయ్య వీధిలోని ఓ ప్రైవేట్ బాలుర హాస్టల్‌లో ఉం టూ సీఏ చదువుతున్న అవనిగడ్డ సమీపంలోని కొత్తపాలేనికి చెందిన రేపల్లె రాజ్ (20), ప్రకాశం జిల్లా మేదరమె ట్లకు చెందిన పోతినేని కేశవ(21) నెల్లూరుకు చెందిన లెక్కల విష్ణు వర్ధన్(21) ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో కృష్ణాన దిలో సరదాగా స్నానానికి దిగారు. రేపల్లె రాజ్ నదిలో గల్లంతవ్వగా కేశవ, విష్ణు వర్ధన్ బయ టకు వచ్చారు. కృష్ణలంక పోలీసులు రేపల్లె రాజ్ ఆచూకీ కోసం నదిలో గాలింపు ప్రారంభించారు. పొద్దు పోయేంతవరకు వెదికినా ఆచూకీ తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

చంద్రబాబు స్ఫూర్తితో సంక్షోభాన్ని అధిగమించాం

- బుడమేరు వరదతో 40 రోజులు మిల్క్ ఫ్యాక్టరీ మూత
- ఆరు దశాబ్దాల చరిత్రలో ఇదే అతిపెద్ద సంక్షోభం
- యూనియన్‌ను ఆదుకునేందుకు సీఎం చేయూత
- మిల్క్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంలో చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, అక్టోబరు 13: చిట్టినగర్‌లోని కృష్ణా మిల్క్ యూనియన్ ఫ్యాక్టరీ కార్యకలాపాలను శనివారం విజయదశమి సందర్భంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడారు. 'బుడమేరు వరదలతో తీవ్రంగా నష్టపోయినప్పటికీ తిరిగి అతి తక్కువ కాలంలో ఫ్యాక్టరీని ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది. వరద ముంపుతో ఫ్యాక్టరీ కార్యకలాపాలు 40 రోజులపాటు నిలిచిపోయినా, ముందు చూపుతో నిర్మించిన ప్రాజెక్ట్ కామధేను వీరవల్లి ఫ్యాక్టరీ కష్ట కాలంలో సంజీవనిలా ఆదుకుంది. పాడి రైతులు, వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా యూనియన్ కృషి చేసింది. మిషనరీ అంతా వరదలో మునిగిపోయినా అధికారులు, సిబ్బంది సంఘటితంగా పనిచేశారు. త్వరగా ఫ్యాక్టరీ ప్రారంభించేలా చేశారు. విపత్తులో యూనియన్‌కు అండగా నిలిచిన పాడి రైతులు, సంఘాల అధ్యక్షులకు కృతజ్ఞతలు'. అని చైర్మన్ తెలిపారు. '42 రోజుల తర్వాత ఫ్యాక్టరీలో అన్ని కార్యకలాపాలు యథావిధిగా కొనసాగిస్తున్నాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బోనస్‌గా రూ.50 కోట్లు చెల్లించాం. వార్షిక టర్నోవర్ రూ.1200 కోట్లకు చేరింది. పన్నులకు ముందు వార్షిక లాభాలు రూ.41 కోట్లకు పెరిగాయి. యూనియన్ నికర విలువ రూ.95.50 కోట్ల నుంచి రూ.205.65 కోట్లకు పెరిగింది. క్షీరబంధు పథకం కింద ఇప్పటివరకు చనిపోయిన 3000 మంది పాడి రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు అందించాం.' అని ఎండీ కొల్లి ఈశ్వరబాబు తెలిపారు. పాలకవర్గసభ్యులు వేమూరి సాయి వెంకట రమణ, కొండలరావు, ఎ.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

> 'ఆరు దశాబ్దాల చరిత్రలో కృష్ణా మిల్క్ యూనియన్‌కు బుడమేరు వరద రూపంలో అతి పెద్ద సంక్షోభం ఎదురైంది. సంక్షోభాలను అధిగమించడంలో సీఎం చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకున్నాం. 40 రోజుల్లో ఫ్యాక్టరీని మళ్లీ గాడిలో పెట్టి పునఃప్రారంభించుకుంటున్నాం. యూనియన్‌ను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేయగానే స్పందించారు. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్‌డీడీబీకి ఆర్థికసాయం చేయాల్సిందిగా సిఫారసు చేశారు. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.' అని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు.

అక్కడ నష్టాలు.. ఇక్కడ లాభాలు

2017-18లో కృష్ణా మిల్క్ యూనియన్ వార్షిక టర్నోవర్ రూ.662 కోట్లు. 2023-24 నాటికి ఇది రూ.1200 కోట్లకు చేరింది. ప్రస్తుతం యూనియన్ రూ.40 కోట్ల లాభాన్ని నమోదు చేయడంతోపాటు రూ.50 కోట్లను బోనస్ రూపంలో రైతులకు అందించగలిగింది. మరో రూ.15 కోట్లను రైతుల సంక్షేమానికి వినియోగించింది. మరోవైపు రూ.1750 కోట్ల టర్నోవర్ ఉన్న విశాఖ డెయిరీ నష్టాలను నమోదు చేయడం గమనార్హం. కృష్ణా మిల్క్ యూనియన్ సహకార రంగంలో ఉండటం, సమర్థనాయకత్వం తోడవడంతో దినదినాభివృద్ధి చెందుతోంది.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

మచిలీపట్నం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్ష రాసే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణ పొందేందుకు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ షాహిద్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్య ర్థులు ఉచిత శిక్షణ పొందడం కోసం జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తులను సమర్పించాలని ఆయన సూచించారు. ఈనెల 27న అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అర్హులైనవారిని ఎంపికచేసి, శిక్షణ ఇస్తామని ఆయన తెలిపారు.

రద్దీగా పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్

- పండగకొచ్చి తిరిగి వెళ్తున్న వారితో కిటకిట
- ప్రయాణికుల కోసం 59 స్పెషల్ బస్సులు, 16 ప్రత్యేక రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పండగ సెలవులు ఆదివారంతో ముగియడంతో సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు పయనమయ్యారు. దీంతో పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడిపోయాయి. ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు 32, ఇతర ప్రాంతాలకు 23, చెన్నైకు 2, విశాఖకు 2 స్పెషల్ సర్వీసులను నడిపారు. మొత్తం 59 స్పెషల్ బస్సులను నడిపారు. రెగ్యులర్ షెడ్యూల్డ్ బస్సులు పూర్తిగా కిటకిటలాడిపోయాయి. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రయాణించారు. ఇక్కడి నుంచి వెళ్లే వారితో పాటు సోమవారం నుంచి కళాశాలలు ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకూ పెద్ద సంఖ్యలో వచ్చారు. రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు పెద్ద సంఖ్యలో ప్రయాణించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు భారీగా రాకపోకలు సాగాయి. రద్దీని పురస్కరించుకుని రైల్వే అధికారులు 16 స్పెషల్ రైళ్లను నడుపుతున్నారు. శనివారం చెన్నైలో జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో రైళ్లు రద్దయ్యాయి. ఆదివారానికి పునరుద్ధరించటంతో రైళ్లన్నీ కిటకిటలాడుతూ వెళ్లాయి.



రైలు కోసం ప్లాట్‌ఫాంపై ప్రయాణికుల పడిగాపులు



నుజ్జయిన కారు



కారును ఢీకొన్న టిప్పర్

టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తుకు టీడీపీ నేత బలి

- అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టి..అవతలి వైపున ప్రయాణిస్తున్న కారును ఢీకొన్న టిప్పర్
- చెవిటికల్లు మాజీ సర్పంచ్ దుర్మరణం



మృతిచెందిన కోగంటి విష్ణువర్ధనరావు(ఫైల్)

నందిగామరూరల్/కంచికచర్లరూరల్, అక్టోబరు 13: టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తు ఒక నిండు ప్రాణాన్ని బలికొంది. తన దారిన తాను కారులో వెళుతున్న టీడీపీ నేతను అతివేగంగా వచ్చిన టిప్పర్ డివైడర్‌ను దాటి వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న టీడీపీ నాయకుడు, కంచికచర్ల మండలం చెవిటికల్లు మాజీ సర్పంచ్ కోగంటి విష్ణువర్ధనరావు అక్కడికక్కడే మరణించారు. కోగంటి విష్ణువర్ధనరావు విజయవాడలో ఉంటున్నారు. గతంలో తన ఇంట్లో పనిచేసిన వ్యక్తి మనుమరాలి వివాహానికి ఆదివారం ఉదయం చందర్లపాడు మండలం తోటరావులపాడుకు కారులో వస్తున్నారు. నందిగామ మండలం ఐతవరం శివారులో నందిగామ నుంచి విజయవాడ వెళుతున్న టిప్పర్ డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు అవతలి వైపున ప్రయాణిస్తున్న విష్ణువర్ధనరావు కారుపై పడింది. కారు నుజ్జు నుజ్జైంది. కారులో ఉన్న విష్ణువర్ధనరావును నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు సీఐ ఎస్‌పీఎల్ నాయుడు తెలిపారు. మార్చురీ వద్ద భౌతికకాయానికి మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, వసంత నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నివాళులర్పించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. భౌతిక కాయాన్ని కంచికచర్ల పరిసర గ్రామాల ప్రజలు సందర్శించి నివాళులర్పించారు.

ఉద్యమాలతోనే కార్మిక సమస్యలకు పరిష్కారం

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13: ఉద్యమాల ద్వారానే కార్మికుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ భవనంలో ఆదివారం నిర్వహించిన ఎల్ఐసీఈ ఉద్యోగుల సంఘ నాయకుడు చంద్రపాల్ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై చంద్రపాల్ పోరాడుతున్నారన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకులు జి.సుధాకర్ బాబు, జి.తిరుపతయ్య, జి.కిషోర్‌కుమార్, సీఐటీయూనేతలు వెంకటేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

జన జాతర

(ఐదో పేజీ తరువాయి)

మాత్రమే హోల్డింగ్ పాయింట్లను ఉపయోగిస్తారు. ఈ పాయింట్లలో ఉన్న ఒక్కో కంపార్ట్‌మెంట్‌లోని భక్తులను క్యూల్లోకి పంపుతారు. ఈ ఏడాది మూలా నక్షత్రం రోజున లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా వేసిన అధికారులు 38 హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇంద్రకీలాద్రి చరిత్రలో హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించడం ఇదే మొదటిసారి. మూలా నక్షత్రం రోజు అంతగా హోల్డింగ్ పాయింట్ల అవసరం రాకున్నా.. విజయదశమి నాడు మాత్రం వీటిని ఉపయోగించాల్సి వచ్చింది. మోడల్ గెస్ట్‌హౌస్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించారు. వాస్తవ పరిస్థితిని తెలుసుకోవడానికి పోలీసు శాఖ వద్ద ఉన్న ఐదు డ్రోన్లను ఉపయోగించారు. అవి సరిపోకపోవడంతో అదనంగా మరో ఏడు తెప్పించారు. కీలక ప్రాంతాలను డ్రోన్లతో పరిశీలించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని సెక్టార్ల ఇన్‌చార్జులకు ఆదేశాలిచ్చి రహదారులపై ఉన్న భక్తులను హోల్డింగ్ పాయింట్లలోకి పంపేలా ఏర్పాటు చేశారు. 38 కంపార్టుమెంట్లు నిండిపోవడంతో వీఎంసీ రోడ్డు, పూలమార్కెట్, పీసీఆర్ ఫ్లైఓవర్, ఫ్లైఓవర్ కింద ఉన్న ప్రాంతాల్లో రోప్‌లతో తాత్కాలిక కంపార్టుమెంట్లు ఏర్పాటు చేశారు. డీజీపీ ద్వారకాతిరుమలరావు, ఇంటెలిజెన్స్ డీజీ లడ్హాకు పోలీసు కమిషనర్ పరిస్థితిని వివరించడంతో ఆక్టోపస్, బెటాలియన్లలో సిబ్బందిని రంగంలోకి దింపారు. శరన్నవరాత్రుల్లో ఆక్టోపస్ బందోబస్తుకు వినియోగించడం ఇదే ప్రథమం.

అన్ని క్యూలు ఉచితం

భక్తుల రద్దీ నేపథ్యంలో కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు దేవదాయ శాఖ అధికారులతో చర్చించారు. క్యూల్లో టికెట్లు విక్రయిస్తే ఇబ్బందులు వస్తాయని వివరించారు. దీంతో ఆలయ అధికారులు అన్ని క్యూల నుంచి భక్తులను ఉచితంగా దర్శనానికి అనుమతించారు. శనివారం ఉదయం నుంచి అన్ని వీవీఐపీ, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. అప్పటికే విక్రయించిన వీఐపీ దర్శన టికెట్లను రద్దు చేశారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న పరిస్థితిని వీవీఐపీలకు తెలియజేసి దర్శనాలకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. రద్దీ నేపథ్యంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు దంపతులు ముఖమండపం నుంచే దర్శనం చేసుకున్నారు. టోల్‌గేట్ ముందున్న రహదారిపై భక్తులు భారీగా గూమి గూడటంతో తొక్కిసలాటకు అవకాశముంటుందని పోలీసులు వారిని కొండపైకి పంపారు.

నదీ విహారానికి బ్రేక్

విజయదశమి రోజున కృష్ణానదిలో నిర్వహించే తెప్పోత్సవంలో నదీ విహారానికి బ్రేక్ పడింది. దుర్గాఘాట్ వద్ద హంస వాహనంపై శ్రీపార్వతీ గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. ప్రకాశం బ్యారేజీకి ప్రస్తుతం 41,464 క్యూసెక్కుల నీరు రావడం వల్ల నదీ విహారాన్ని రద్దు చేశారు. దుర్గాఘాట్ వద్దే మూడు సార్లు హంస వాహనాన్ని వెనక్కి, ముందుకు కదిలించారు. పూజల అనంతరం ఉత్సవమూర్తులను పోలీసులకు అప్పగించారు. పోలీసులు పల్లకీలో ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ శమీవృక్షం వద్ద పూజలు చేశాక ఊరేగింపుగా తీసుకెళ్లి ఆదివారం తెల్లవారుజామున ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, యాగశాలలో పూర్ణాహుతి జరిగింది. దీంతో ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

అమ్మవారి సేవ పూర్వజన్మ సుకృతం: తుమ్మలపల్లి

పటమట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఉత్సవ కమిటీ సభ్యుడిగా దుర్గమ్మకు సేవ చేసే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతమని టీడీపీ నేత తుమ్మలపల్లి హరికృష్ణ తెలిపారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన ప్రభుత్వ పెద్దలకు, ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దర్శిపేట రాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శనివారం అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. 600 మంది ముత్తైదువులు కుంకుమ పూజల్లో పాల్గొనగా, 30 జంటలతో చండీయాగం చేశారు. పటమట శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని వెలసిన మరకతరాజరాజేశ్వరి అమ్మవారిని విజయదశమి రోజున శ్రీ పూర్ణ కళారాజరాజేశ్వరిగా అలంకరించారు.

రాజరాజేశ్వరీదేవిగా దుర్గమ్మ

ముగిసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

చిట్టినగర్, అక్టోబరు 13: దసరా మహోత్సవాలు చివరి రోజు శనివారం అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులు దర్శనమిచ్చారు. చిట్టినగర్‌లోని రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చిన మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు మహిళలు అధిక సంఖ్య వచ్చారు. అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు పర్యవేక్షించారు. పాలఫ్యాక్టరీ సమీపంలో విజయదుర్గా రామలింగేశ్వర, పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో విజయదుర్గా అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేటలో గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలోని మంగళగౌరి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేబీఎన్ కాలేజీలో..

వన్‌టౌన్: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కేబీఎన్ కాలేజీలో కన్యకాపరమేశ్వరి విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్విశత చండీయాగం, దసరా మహోత్సవాలు శనివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. కాలేజీలోని దాసాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శనివారం రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబా విజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాస్, పొట్టిశ్రీరాములు చలువాది మల్లిఖార్జునావు ఇంజనీరింగ్ కాలేజీ కార్యదర్శి చిట్టా అమర సుధీర్, హిందూ హైస్కూల్స్ విద్యా సంస్థల పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు పాల్గొన్నారు. 64వ డివిజన్ పరిధి కండ్రిక రామాలయం వద్ద స్థానిక టీడీపీ నేత కె.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదానం జరిగింది. నిర్వాహకులు కె.రవికుమార్, వరలక్ష్మి, పార్టీ నేతలు జయరాజ్, శివ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఉత్సవాలు

సత్యనారాయణపురం: శ్రీదేవిశర్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శనివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి అవతారంలో భక్తుల పూజలందుకున్నారు. సాయంత్రం శమీవృక్ష పూజ, అన్నదానం జరిగింది.

● అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యంలో శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకారం చేసి పూజలు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ చేతుల మీదుగా వేదపండితులు పూజలు నిర్వహించారు. ఆదివారం శ్రీ శివకామేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి శాంతి కల్యాణం జరిగింది. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అమ్మవారికి రథోత్సవం నిర్వహించారు.

● ముత్యాలంపాడులో శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో శనివారం అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవిగా పూజలు అందుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు జరిగింది. సామంతపూడి చిన్నా, క్షత్రియసేవా సంఘం నేతలు విజయరామరాజు కేఎస్ ప్రసాదరాజు పాల్గొని పూజలు చేశారు.

రాజరాజేశ్వరీగా ధనకొండ అమ్మవారు

మొగల్రాజపురం: దసరా మహోత్సవాల్లో భాగంగా శనివారం మొగల్రాజపురం ధనకొండపై దుర్గా భవానీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. సాయంత్రం పవళింపు సేవ నిర్వహించారు. మధురానగర్ మెయిన్ రోడ్డు రత్నా గార్డెన్స్‌లో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించారు. సాయంత్రం శమీ పూజ, భక్తులకు ప్రసాదం పంపిణీ భజన నిర్వహించారు.

రాజరాజేశ్వరీ దేవిగా కాళీమాత

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు దసరా శరన్నవరాత్రుల 10వ రోజైన శనివారం భక్తులకు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చింది. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో..

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 34వ డివిజన్ కేదారేశ్వరపేట శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దేవినవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా శనివారం రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. పెద్దలు వీవీ రమణరావు, కేటీ రాజు, లక్ష్మయ్య, రత్న, ఆర్ రాజు, వీకే పద్మనాభం, కన్నా రాజు పాల్గొన్నారు. ● స్థానిక 55వ డివిజన్ కంసాలిపేటలోని విజయ కనకదుర్గ దేవి ఆలయం వద్ద శ్రీదేవి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీడీపీ వాణిజ్యవిభాగం కార్య నిర్వహణ కార్యదర్శి ధనేకుల వెంకట సుబ్బారావు పాల్గొని అన్నసంతర్పణ చేశారు.





రాజరాజేశ్వరీదేవి అలంకారంలో మహాలక్ష్మి... విజయదుర్గమ్మ... మంగళగౌరి అమ్మవారు




కండ్రిక రామాలయం వద్ద అన్నదానం.. 55వ డివిజన్ కంసాలిపేటలో..




కేబీఎన్ కళాశాలలో రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు.. పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు



రాజరాజేశ్వరీ దేవిగా కాళీమాత



మొగల్రాజపురం ధనకొండపై



శివకాళేశ్వరీ పీఠంలో..

హెడ్‌కానిస్టేబుల్‌కు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న ఆర్పీఎఫ్ దళ సభ్యులు

రైల్వేస్టేషన్, అక్టోబరు 13: బ్రెయిన్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పి.సుధాకర్‌రావుకు తోటి ఆర్‌పీఎఫ్ దళ సభ్యులు రూ.1,43,000 సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు. విరాళ సేకరణకు కృషి చేసిన డాగ్ స్క్వాడ్ ఏఎస్ఐ బి.విజయరాజును అధికారులు, సిబ్బంది ప్రశంసించారు. ఆర్‌పీఎఫ్ ఎస్పీ మధుసూదనరావు పాల్గొన్నారు. ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ పి.సుధాకర్‌రావు గత ఏడాది ఆగస్టు నుంచి బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ప్రస్తుతం లాలాగూడ రైల్వే ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి సీరియస్‌గా ఉందని తెలియటంతో దళం సభ్యులు ముందుకొచ్చి విరాళాలు సేకరించారు.

వడియ రాజుల సమస్యలను పరిష్కరించాలి

● ఏపీ వడియ రాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి



సమావేశంలో మాట్లాడుతున్న వేముల బేబీరాణి

పటమట, అక్టోబరు 13 : ఏపీలో వడ్డెరలు, వడియ రాజులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వడియారాజుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీరాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఆదివారం వడియరాజుల సంక్షేమ సంఘం ప్రారంభోత్సవం జరిగింది. సంఘ నేతలు డేరంగుల వెంకట రమణరావు, బత్తుల నాగేశ్వరరావు, ఉప్పు ప్రసాద్, చల్లారంగారావు, చిన్న ఏడుకొండలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ చంటిపై పోలీసుల తీరు బాధాకరం

చిట్టినగర్, అక్టోబరు 13: సీనియర్ కార్పొరేటర్ ఉమ్మడి చంటిపై పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుర్గమ్మ దర్శనానికి వెళ్లిన కార్పొరేటర్ ఉమ్మడి చంటిని పోలీసులు తాను స్థానిక కార్పొరేటర్‌నని చెప్పిన వినకుండా బలవంతంగా పక్కకు నెట్టడం దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పాతపాడులో దుస్తుల పంపిణీ



విజయవాడ రూరల్, అక్టోబరు 13 : దసరా పండుగను పురస్కరించుకుని పాతపాడు గ్రామంలో పారిశుధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక వ్యాపారి కలపాల అబ్రహం పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహించే ఇరవై మంది కార్మి కులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలపాల కార్తిక్, కౌశిక్, జాలాది గాంధీ పాల్గొన్నారు.

బాబా పుణ్యతిథి మహాసమాధి ఉత్సవం

గవర్నర్‌పేట, అక్టోబరు 13: లెనిన్ సెంటర్‌లోని శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగ మానసాదేవి మందిరంలో ఆదివారం బాబా 106వ పుణ్యతిథి మహాసమాధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి బాబాకు అభిషేకాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు ఉత్సవాలకు హాజరై స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. 23వ డివిజన్ కార్పొరేటర్ ఎన్. బాలస్వామి, వైసీపీ 25వ డివిజన్ అధ్యక్షుడు బంకా భాస్కరరావు ముఖ్య అతిథులుగా హాజరై బాబాకు ప్రత్యేక పూజలు చేశారు.



సాయిబాబా ఆలయంలో దీపాల వెలుగులు

బాబాకు సాంబ్రాణి దూపం

భవానీపురం: విజయదశమి రోజున శనివారం మధ్యాహ్నం హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ధి షిర్డీసాయిబాబా ఆలయంలో బాబా సమాధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబాకు సాంబ్రాణి దూపం వేశారు. కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు పూటుకూరి శివనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా బాబాకు అన్నాభిషేకం

వన్‌టౌన్: విజయదశమిని పురస్కరించుకుని గొల్లపూడిలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శనివారం బాబాకు ఘనంగా అన్నాభిషేకం నిర్వహించినట్లు మందిర అధ్యక్షుడు రావూరి కిషోర్ తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు దేవినేని రామయ్య, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, కాజా కృష్ణారావు, మన్నే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విటుల కోసం వేట..?

- రెడ్‌లైట్ ఏరియాలా మారుతున్న కాంగ్రెస్ ఆఫీస్ రోడ్
- పట్టించుకోని పోలీసులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, స్థానికులు

గవర్నర్‌పేట, అక్టోబరు 13: పగలు, రాత్రి అన్న తేడా లేకుండా విటుల కోసం మహిళలు నిరీక్షిస్తున్న దృశ్యాలు ఇటీవల నిత్యం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రోడ్‌లో కనిపిస్తున్నాయి. శనివారం, ఆదివారాలు వస్తే చాలు అసాంఘిక కార్యకలాపాలకు ఈ ప్రాంతం అడ్డాగా మారి, నిరీక్షించే మహిళల సంఖ్య మూడు రెట్లు పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఏలూరు రోడ్డు రాజ్‌టవర్స్ కార్నర్ నుంచి నవరంగ్ థియేటర్ వరకు ఈ రోడ్డులో జనసంచారం తక్కువగా ఉంటుంది. దీంతో చీకటి పడితే చాలు కరెంట్ వెలుగులు పడని ఈ రోడ్డుపై మహిళలు విటుల కోసం నిరీక్షిస్తూ ఉంటారు. నివాసాలు తక్కువగా ఉండటం, అన్నీ వ్యాపార సముదాయాలు కావడం, మోటారు ఫీల్డ్ వర్కర్స్ ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో శనివారం వేతనాలు వచ్చే రోజున ఈ మహిళల సందడి మరీ ఎక్కువ. చిన్న, పెద్ద లాడ్జిలుండే ప్రాంతం కావడంతో వీరి వ్యాపారానికి అనుకూలంగా ఉంది. కూతవేటు దూరంలో ఎస్పీ కార్యాలయం, కలెక్టరేట్ ఉన్నా రెడ్‌లైట్ ప్రాంతంలా బహిరంగంగా విటుల కోసం మహిళలు రోడ్డు మార్జిన్లలో నిలబడి పిలుస్తుండటం గమనార్హం. జిల్లా అధికారుల కార్యాలయాలు, న్యాయస్థానాలు, వాణిజ్య సంస్థలతో నిత్యం జన సంచారం ఎక్కువగా ఉండే గవర్నర్‌పేట ప్రాంతంలోనే ఈ తంతు నడుస్తుండటం విభ్రాంతికి గురిచేస్తోంది. ఈ తంతుపై వ్యాపారులు, నివాసులు పోలీసు స్టేషన్‌కు ఫోన్లు చేసి చెబితే మీరెందుకు చూస్తున్నారు. కిటికీలు, తలుపులు వేసుకోండంటూ పోలీసులు నీతులు చెబుతుండటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలుగా ఈ తంతు మరీ పెరిగిపోవడంతో షాపుల్లో పనిచేసి ఇళ్లకు వెళ్లే మహిళలు, పనులపై బయటకు వెళ్లి సొంతింటికి వచ్చే స్థానికులకు కూడా ఈ చేదు అనుభవాలు ఎదురౌతున్నాయి. స్థానిక మహిళలు ఇళ్ల నుంచి పనులపై బయటకు వెళుతుంటే వారిని కూడా ఆ కేటగిరిలో జమకట్టి ఆకతాయిలు బేరాలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుర్రకారు, గంజాయి బ్యాచ్ ఇదో రెడ్‌లైట్ ఏరియాగా ప్రచారం చేసుకుంటూ షేర్ చేసుకుంటున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఈ అసాంఘిక కార్యకలాపాలను నివారించాలని వ్యాపారులు, నివాసితులు కోరుతున్నారు.



కాంగ్రెస్ కార్యాలయం రోడ్డులో
విటుల కోసం రాత్రిపూట నిరీక్షిస్తున్న మహిళలు

దిక్సూచి DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణం-అధ్యయనానికి సంబంధించి గతంలో వాతావరణం, పర్యావరణాల్లోని పలు విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు వివిధ ఆవరణాల వివరాలను తెలుసుకుందాం.

జలావరణం

ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో హైడ్రోస్పియర్ అని అంటారు. గ్రీకుభాషలో హర్యాడర్ అనగా జలం అని అర్థం. 'భూమిపై ఉన్న జల వనరులన్నీ అనగా సముద్రాలు, నదులు, జలాశయాలు, కుంటలు, సరస్సులు వాటన్నింటినీ కలిపి జలావరణం అంటారు. హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువుల కలయిక వల్ల హెచ్‌టూ(జలము) ఏర్పడుతుంది.

- భూ ఉపరితలంపై 71% అనగా 2/3వ వంతు జలభాగం ఆవరించింది. దీనిలో 1) సముద్రాల్లోని ఉప్పునీటి శాతం 97.3% 2) మంచినీటి శాతం 2.7%
- ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉన్న మంచినీటి శాతం 2.14%
- చెరువులు, కుంటలు, సరస్సులో ఉన్న ద్రవస్థితిలో ఉన్న మంచినీటి శాతం 0.0009%
- నదులు, చెరువులు, కాలువల్లో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- వాతావరణంలోని తేమ రూపంలో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- భూగర్భంలో ఉన్న మంచినీటి శాతం 0.61%
- జల సంబంధిత చక్రం కీలకపాత్ర వహిస్తూ జీవులకు ఆధారమైన నీటిని సమకూర్చడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

శిలావరణం

భూమిలో ఘనీభవించిన పొర, లేదా గట్టిగా ఉండే పైపొర ఇది. దీనిలో రాళ్లు, ఖనిజ లవణాలు ఉండి మందపాటి మట్టి పొర ఉంటుంది. గ్రీకుభాషలో లిథోస్ అనగా శిల అని అర్థం. స్పేయిరా అంటే గోళం లేదా బంతి. ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో లిథోస్పియర్ అంటారు. దీనిని ఆశ్మావరణం అని కూడా పిలుస్తారు. భూమి, దానిపై ఘనరూపంలో ఉండే భాగాలన్నింటిని శిలావరణం అంటారు.

- భూ ఉపరితలం నుంచి సగటున 40 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘనస్థితిలోని భూమి బాహ్యపొర.
- భూమిపై ఉండే పర్వతాలు, మట్టిపొరలు, పీఠభూములు, రాళ్లు మొదలైనవి శిలావరణం కిందికి వస్తాయి.
- భూమి ఉపరితలం పొరను సాంద్ర మండలం అంటారు. భూమి పొరల్లో ఉండే మట్టి ఖనిజాలు, ఖనిజ ఇంధనాలు మొదలైనవి శిలావరణంలో చేరతాయి.

జీవావరణం

పర్యావరణ వ్యవస్థలోని వాతావరణం, జలావరణం, శిలావరణాలు వ్యాపించి జీవులకు అనువైన ఆవరణ భాగాన్ని జీవావరణం అంటారు. జీవావరణం భూ ఉపరితలం మీదనూ, భూ ఉపరితలం నుంచి దాదాపు 200 మీ. లోతు వరకు, భూ ఉపరితలం వాతావరణంలో దాదాపు 7 నుంచి 8 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది.



- సూక్ష్మక్రీములు, బ్యాక్టీరియా, వైరస్, మొక్కల నుంచి వెలువడే బీజాంకురాలు, పుప్పొడి కణాలు వాతావరణంలోని వాయువుల ద్వారా అంతటా వ్యాపిస్తాయి.
- అలాగే కోట్లాది జీవులు సముద్ర జలాల్లో నివశిస్తున్నాయి. కాబట్టి జీవులకు అనువైన జలావరణం, వాతావరణం, శిలావరణం వీటన్నింటినీ జీవావరణం అంటారు.
- జీవావరణంలో జీవుల మధ్య పరస్పరము ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. వీటినే ఉత్పత్తిదారులు వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అంటారు.

పర్యావరణంపై మానవుని ప్రభావం

సహజసిద్ధ పర్యావరణంలో భూమిపై నివశిస్తున్న భిన్నర కాల జీవజాతులు, చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా, పరిసరాలకు లోబడి నివసించేవి. ప్రతి జీవి జీవన చర్యలను వాటి చుట్టూ ఉన్న పర్యావరణంలోని వనరులు నియంత్రిస్తాయి.

- సహజసిద్ధ పర్యావరణంలో జీవులకు, వాటి చుట్టూ ఉన్న పరిసరాలకు మధ్య గల సంబంధాలు సకారాత్మకంగా ఉన్నందున పర్యావరణ సమతుల్యం స్థిరంగా ఉంటుంది.
- జీవరాశులన్నింటిలో ఒక్క మానవునికి మాత్రమే తన పరిసరాల్లోని సహజ వనరులను వివిధ రూపాల్లో వినియోగించుకునే సామర్థ్యం ఉంది.
- ప్రాచీన మానవుడు తన కనీస అవసరాలు(గాలి, నీరు, నేల, ఆవాసం) మేరకే సహజ వనరులను వినియోగించేవాడు. దీనిలో భాగంగా ఏర్పడే వ్యర్థాలను తన చుట్టూ ఉన్న పర్యావరణం సులభంగా తనలో ఇముడ్చుకునేది.
- మానవుడు నిప్పును కనిపెట్టడంతో పర్యావరణంపై మానవ ప్రభావం ప్రారంభమైంది. దీనితో క్రూర మృగాలను దెబ్బతీయడం, అడవులను తగులపెట్టి వ్యవసాయ భూములుగా మార్చడం, స్థిర వ్యవసాయాన్ని ప్రారంభించడంతో ఆవరణ వ్యవస్థలపై మానవుని ప్రభావం వేగవంతమైందని చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం తరవాత పర్యావరణంపై మానవ ప్రభావం పెరగడానికి, పర్యావరణ వనరులు క్షీణించడానికి గల కారణాలు

1) జనాభా పెరుగుదల 2) వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ 3) ఆధునిక ప్రపంచ ఆర్థిక పోకడలు(సరళీకరణ, ప్రపంచీకరణ) 4) శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం 5) కొత్త వినిమయ సంస్కృతి కారణంగా ఘన వ్యర్థాలు పెరగడం.

- ఉపాధికి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల అక్కడ జనాభా పెరిగి నగర ఆవరణ వ్యవస్థలు కాలుష్యానికి గురయ్యాయి. మురికివాడల సంఖ్య పెరిగింది.
- మానవుడు తన సాంకేతిక నైపుణ్యం ద్వారా తన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంతో సహజ ఆవరణ వ్యవస్థ తన స్వభావాన్ని మార్చుకోవడంతో సహజ వనరుల నాణ్యత తగ్గి జీవ వైవిధ్యత దెబ్బతింటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేసే ప్రయత్నంలో హరితవిప్లవ సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం వల్ల జల వనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహకాలతో కలుషితమయ్యాయి.
- మానవుడు అభివృద్ధి కార్యకలాపాలు, ఆర్థిక ప్రయోజనాలకు, విలాసవంతమైన జీవనానికి భవిష్యత్ తరాలకు అందించాల్సిన వనరులను కూడా దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత, జల వనరుల కొరత, భూకంపం, సునామీలు ఏర్పడుతున్నాయి.
- పై వాటితో పాటు నివాస, పారిశ్రామిక ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగు, పంట పొలాలు, చేపల చెరువులు, రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, పోషకాలు జలాశయాల్లో చేరుతున్నాయి. దాంతో జలాశయాలు యూట్రిఫికేషన్ కాలుష్యానికి లోనై సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతున్నాయి.
- అదేవిధంగా కోస్టల్ కారిడార్ నిర్మాణాలు, ట్రాలరీ బోట్స్, డీప్ - సీ - ఫిషింగ్ విధానాల వల్ల కోస్తా ఆవరణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పైన తెలిపిన ధోరణులను పరిశీలిస్తే మానవుడు తన జీవన శైలిని పర్యావరణ సామర్థ్యానికి అనుకూలంగా మార్చుకోవాలి. పర్యావరణానికి, మానవునికి మధ్య సంబంధాలు సహకారాత్మకంగా ఉండాలి. లేకపోతే పర్యావరణ ఆధిపత్యం శీతోష్ణస్థితిలో మార్పుల రూపంలో అధికమై జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది.
- మానవుడు అభివృద్ధి కార్యక్రమాల్లో చేపట్టే చర్యల వల్ల ఏర్పడే పర్యావరణ క్షీణతను జీవావరణ వధ అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటిసారిగా 1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ఉపయోగించారు.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

పాచికలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్



పాచికలు టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఒక పాచిక రెండు లేదా మూడు లేదా నాలుగు స్థితులను(పొజిషన్) ఇస్తుంటారు. ఆ డయాగ్రామ్స్‌లో అంకెలను లేదా వర్ణమాల అక్షరాలను లేదా చుక్కలను లేదా మేథమెటికల్ గుర్తు (+, -, x, 4)లను లేదా చిన్న చిన్న రేఖాచిత్రాలను (Δ, □, ▭, ▯) ఇస్తారు. డయాగ్రామ్స్‌లో ఇచ్చిన ఏదేని అంకె లేదా చుక్కలు లేదా వర్ణమాల అక్షరాల్లో ఏదో ఒక దానిని తెలుపుతూ దానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె లేదా అక్షరం లేదా గుర్తు లేదా రేఖాచిత్రాన్ని తెలపమని అడుగుతారు.

పాచికకు(సిక్స్ సైడ్స్) ఆరు ముఖభాగాలు ఉంటాయి. ప్రతి ముఖభాగానికి ఎదురు ముఖభాగం అనేది ఉంటుంది. ఎదురు ముఖభాగం అనేది కనిపించదు. ప్రతి ముఖ భాగానికి (ఫోర్ సైడ్స్) నాలుగు పక్కపక్క ముఖభాగాలు కనిపించే విధంగా ఉంటాయి. ఒక ముఖభాగం కనిపించదు. కనిపించని ముఖభాగాన్ని ఎదురు ముఖభాగంగా గుర్తించాలి.


ఈవిధంగా పాచికకు ఆరు ముఖభాగాలు ఉంటాయి.

ఆరు ముఖభాగాలు ఉండే పద్ధతి (రూల్)

అడిగినటువంటి ముఖభాగంలో గల అక్షరం		దానికి కనిపించే విధంగా నాలుగు పక్క ముఖభాగాలు		అడిగినటువంటి ముఖభాగానికి ఎదురుగా (కనబడకుండా) ఉండే ముఖభాగం
1	+	4	+	1
				= 6 (సిక్స్ సైడ్స్)

గమనిక: ఏదేని ఒక ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగం కనబడదు అనేది అర్థమైనది. ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలన్నీ ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం లేదా సంఖ్య లేదా గుర్తు ఆ విధంగా మాత్రమే ఉంటాయి.

1. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?



ఎ) 6 బి) 4 సి) 5 డి) 3

సమాధానం: (సి)


వివరణ: ఇచ్చిన పాచికల స్థితులను గమనిస్తే

మొదటి డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 3 అంకెలు

రెండో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 3, 4 అంకెలు

నాలుగో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 6 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 2కు పక్కగా 1, 3, 4, 6 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '2'కు పక్కగా '5' అంకె కనిపించడం లేదు. కాబట్టి 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '5' అవుతుంది. కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

2. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 6 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?



ఎ) 4 బి) 2 సి) 1 డి) 5


సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 6కు పక్కగా 1, 3 అంకెలు

రెండో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 3 అంకెలు

మూడో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 6కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '6'కు పక్కగా 4 అంకె కనిపించడం లేదు. కాబట్టి 6 అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగంలో గల అంకె '4' అవుతుంది. కాబట్టి సమాధానం(ఎ) అవుతుంది.

3. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'Q' అనే అక్షరం గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?



ఎ) T బి) U సి) R డి) S

సమాధానం: (డి)

వివరణ: ఇటువంటి ప్రశ్నల్లో ముందుగా ఇచ్చిన ఆరు అక్షరాలు పరిశీలించాలి.

ఈ ప్రశ్నలో ఇచ్చిన ఆరు అక్షరాలు P, Q, R, S, T, U పై డయాగ్రమ్‌లలో మూడో డయాగ్రమ్‌లో మాత్రమే 'Q' ఉంది. Qకు పక్కగా గల అక్షరాలు P, R. అనగా Uకు ఎదురుగా ఉండే ముఖభాగంలో S, T, Uల్లో కచ్చితంగా ఏ అక్షరం ఉంటుందో తెలియడంలేదు. ఇలాంటి సందర్భాల్లో అడిగినటువంటి అక్షరం గల పాచిక వదిలివేసి మిగిలిన పాచికల్లో కామన్ లెటర్ ఉంటే ఆ అక్షరమే సమాధానం అవుతుంది. దానిని మరింత వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రశ్నలో Q అనే అక్షరం గల మూడో పాచికను వదిలివేసి మిగిలిన 1, 2, 4 పాచికల్లో S అనేది కామన్ లెటర్ ఇప్పుడు 'S'ని పరిశీలిస్తే మొదటి డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, T అక్షరాలు

రెండో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, R అక్షరాలు

నాలుగో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా U, R అక్షరాలు కనిపిస్తున్నాయి. అనగా 'S'కు పక్కగా P, R, R, U అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 'S'కు పక్కగా 'Q' అక్షరం కనిపించడం లేదు. అనగా 'S'కి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం 'Q' అని అర్థం. (అనగా Q అండ్ S లుఆపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (డి) అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దేవరగట్టు.. తలలు పగిలేట్టు



దేవరగట్టుపై కర్రల సమరం సాగిస్తున్న భక్తులు

- ఉత్సవమూర్తుల కోసం హోరాహోరీగా కర్రల సమరం
- 80 మందికిపైగా గాయాలు... కొందరికి పగిలిన తలలు
- కర్నూలు జిల్లాలో అనాదిగా వస్తున్న ఆచారం

ఆలూరు, అక్టోబరు 13: కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం విజయదశమి రోజున అర్ధరాత్రి బన్ని (కర్రల సమరం) హోరాహోరీగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన ఈ పోరాటంలో పదుల సంఖ్యలో భక్తులు గాయాల పాలయ్యారు. మరి కొంత మంది తలలు పగిలాయి. శనివారం అర్ధరాత్రి నెరణికి, నెరణికి తండా.. కొత్తపేట, అరికేర గ్రామాల భక్తులు ఇనుప రింగులు తొడిగిన కర్రలతో సమరానికి బయల్దేరారు. చేతిలో అగ్ని దివిటీలతో 'డిర్ర్.. గో పరాక్..' అంటూ కేకలు వేస్తూ ఉత్సవమూర్తులను దక్కించుకునే సమయంలో పోటీ పడ్డారు. ఎప్పటిలాగే నెరణికి గ్రామస్థులే ఉత్సవ మూర్తులను దక్కించుకుని తమ గ్రామానికి తీసుకెళ్లే సమయంలో కొత్తపేట, అరికేర, నెరణికి తండాలకు చెందిన భక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సమరంలో 80మందికి పైగా గాయాలపాలయ్యారు. వారికి పసుపు పూసి చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కర్రలతో దాడులను నివారించేందుకు పోలీసులు వారం ముందునుంచే అవగాహన కల్పిస్తూ వచ్చారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురు మృతి

దేవరగట్టు ఉత్సవానికి వస్తుండగా ఘటన

ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టు బన్ని ఉత్సవాలను వీక్షించేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తగ్గి నబుదిహాల్ గ్రామనికి చెందిన హరీష్(22), మల్లికార్జున (26), రవి కుమార్ (27) ముగ్గురూ ఒకే బైక్‌పై దేవరగట్టు ఉత్సవాలను వీక్షించేందుకు హొళగుందకు బయల్దేరారు. హొళగుంద మండలం అరికెర క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. యువకులు బళ్లారి జిల్లా కరేకల్లు జిందాల్ ఫ్యాక్టరీలో దినకూలీలుగా పనిచేస్తున్నారు.



హరీష్, మల్లికార్జున రవి కుమార్

తిరుమలలో వైభవంగా చక్రస్నానం



చక్రత్తాళ్వారును పుష్కరిణిలోకి తీసుకొస్తున్న అర్చకులు

- ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- వాహన సేవలను వీక్షించిన 15 లక్షల మంది భక్తులు : టీటీడీ ఈవో

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం శనివారం వైభవంగా జరిగింది. 9 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు చక్రస్నానం, ధ్వజావరోహణంతో టీటీడీ ముగింపు పలికింది. ముందుగా తెల్లవారుజామున 3 నుంచి 6గంటల వరకు స్వామి కి పల్లకీ ఉత్సవం, ఉదయం 6నుంచి 9గంటల మధ్యలో శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో మునక వేయించగా, భక్తులు కూడా అదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇక, శనివారం సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. సాధారణంగా చక్రస్నానం అనంతరం తిరుమలలో పూర్తిగా రద్దీ తగ్గిపోతుంది. అయితే పెరటాసి మాసం చివరి శనివారం కావడంతో శని, ఆదివారాలు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ధ్వజావరోహణం ముందు మాడవీధుల్లో నిర్వహించిన తిరుచ్చి వాహనసేవలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కాగా, చక్రస్నానంలో టీటీడీ ఉన్నతాధికారులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి పాల్గొన్నారు. ఉదయం వీరు ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

విజయవంతంగా బ్రహ్మోత్సవాలు: టీటీడీ ఈవో

సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు టీటీడీ ఈవో శ్యామల రావు సంతోషం వ్యక్తం చేశారు. టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొత్తం 6 లక్షల మంది మూలవిరాట్టును దర్శించుకోగా, దాదాపు 15 లక్షల మంది శ్రీవారి వాహన సేవలను వీక్షించారని చెప్పారు. ప్రత్యేకించి గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.

శ్రీవారికి సీఎం పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్టు

- విజిలెన్స్ ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్ట్ చేసిన వ్యవహారంపై టీటీడీ సీరియస్ అయింది. విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన ఈ నెల 4న చంద్రబాబు.. శ్రీవారికి సమర్పించే పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని ధ్వజస్తంభానికి మొక్కుతున్న వీడియో స్క్రీన్ షార్ట్‌ను చైతన్య అనే వ్యక్తి 'బ్లైండ్ మన్' అనే ఎక్స్ పేజ్‌లో పోస్టు చేశారు. దానికింద 'దేవుడికి ఇష్టం లేదు అని స్పష్టంగా కనిపిస్తుంది. మళ్లీ చెప్తున్నా ప్రాణగండం ఉంది' అంటూ నవ్వుతున్న రెండు ఎమోజీలను జత చేశారు. ఈ వ్యవహారంపై టీటీడీ విజిలెన్స్ విభాగం ఏవీఎస్వో పద్మనాభం ఫిర్యాదు చేశారు. చైతన్యతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోటెత్తిన ఇంద్రకీలాద్రి



శనివారం బెజవాడ దుర్గమ్మ దర్శనం కోసం తరలి వచ్చిన భవానీ దీక్షాధారులు; (ఇన్‌సెట్) రాజరాజేశ్వరీ రూపంలో దుర్గమ్మ

- విజయదశమికి భారీగా తరలివచ్చిన భక్తులు
- మూలా నక్షత్రం రోజు కంటే ఎక్కువగా రాక
- ఒక్కరోజే సుమారు 2 లక్షల మందికి దర్శనం
- కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారం రద్దు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ముగిశాయి. పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం సాయంత్రం పార్వతి, గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం కనకదుర్గానగర్ మీదుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చి హంస వాహనంపై ఉంచి పూజలు చేశారు. కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారాన్ని రద్దు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పోలీసులకు అప్పగించారు. వారు దుర్గాఘాట్ నుంచి ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడ శమీవృక్షం వద్ద ఉన్న ఆలయంలో శమీపూజ నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, విజయదశమి ఒక్కరోజే సుమారు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దశమి రోజు అంతకుమించి తరలివచ్చా రు. ఆలయానికి ఉన్న అన్ని వైపులా రహదారులు భక్తులతో నిండిపోయాయి. పోలీసులు అప్పటికప్పుడు అదనపు బందోబస్తును ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. తొలిసారిగా ఆక్టోపస్‌ను రంగంలోకి దింపారు. భక్తుల రాక వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఏడు డ్రోన్లను ఉపయోగించారు. ఉత్సవాల చరిత్రలోనే తొలిసారిగా దసరా రోజు, ఆ మర్నాడు హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. భక్తుల రద్దీ కారణంగా విజయదశమి రోజున అన్ని వీవీఐపీ, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగింది.

స్ఫూర్తి



నడవలేని వారికి ఎక్కువగా అందుబాటులో ఉండేవి... చేతులతో బలంగా నెట్టనిదే ముందుకు కదల్లేని చక్రాల కుర్చీలే. బ్యాటరీతో నడిచే చక్రాల కుర్చీలు కొనే స్థోమత అందరికీ ఉండదు.
ఈ ఇబ్బందులను స్వయంగా అనుభవించిన
డాక్టర్ నల్లూరి హిమబిందు...
తక్కువ ధరకే ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్‌ను రూపొందిస్తూ, దివ్యాంగుల అవసరాలను తీరుస్తున్నారు. ఆమె 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

వీల్‌చైర్స్‌తో... వైకల్యాన్ని గెలిచి!

"ఏడాది వయసుకే పోలియో బారిన పడ్డాను. సర్జరీ చేసిన తర్వాత, క్యాలిపర్స్‌తో పడుతూ లేస్తూ నడక కొనసాగించాను. కానీ బాత్రూమ్‌లో పట్టుతప్పి పడిపోయి, భుజానికి దెబ్బ తగలడంతో సర్జరీ చేయించుకోవలసి వచ్చింది. క్యాలిపర్స్ సహాయంతో నడవగలిగినా... వాటి వల్ల ప్రమాదాలు కూడా జరుగుతాయి కాబట్టి చక్రాల కుర్చీకే పరిమితమవడం మేలని నిర్ణయించుకున్నాను. అయితే కానీ ఎక్కడ వెతికినా, సాదాసీదా చక్రాల కుర్చీలే కనిపించాయి. కానీ వాటిని ఉపయోగించాలంటే ఇతరుల సహాయం కావాలి. తోడు లేకుండా ఎక్కడికీ వెళ్లలేను. అది నాకు ఇష్టం లేదు. స్వతంత్రంగా నడుపుకొంటూ వెళ్లగలిగే వీల్ చైర్ కావాలి. కానీ అలాంటి ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ మన దగ్గర ఎక్కడా కనిపించలేదు. దాంతో గత్యంతరం లేక.. 2016లో, రెండున్నర లక్షల ఖర్చుతో, తైవాన్ నుంచి ఒక ఎలక్ట్రిక్ వీల్‌చైర్ దిగుమతి చేసుకున్నాను. ఏడాది తర్వాత ఢిల్లీలో ఒక కాన్ఫరెన్స్‌కి హాజరైనప్పుడు, అకస్మాత్తుగా వీల్‌చైర్ బ్యాటరీ డిశ్చార్జ్ అయిపోయింది. దాన్ని చేతులతో నడిపించలేం! మరమ్మతు చేయించాలని ఎంత ప్రయత్నించినా... వాటి స్పేర్ పార్ట్స్ దొరకలేదు. సర్వీసింగ్ లేదు. చివరకు ఆ ఎలక్ట్రిక్ కుర్చీని అలాగే ఇంటికి తీసుకొచ్చేశాను. తర్వాత బ్యాటరీని స్థానికంగా రిపేర్ చేయించాను. ఛార్జింగ్ పెట్టి, అలారం వచ్చిన తర్వాత డిస్కనెక్ట్ చేశాను. అది పండుగ రోజు. మా కుటుంబ సభ్యులం అందరం ఇంటి బయట వేడుకలో పాల్గొంటున్నాం. ఆ సమయంలో ఇంట్లో నుంచి హఠాత్తుగా పెద్ద శబ్దం వచ్చింది. కుర్చీకి బిగించి ఉన్న బ్యాటరీ పేలిపోయి, ఇంట్లోని సామానంతా ధ్వంసమైపోయింది. ఈ సంఘటనతో నాలో ఆలోచన మొదలైంది. మన దేశంలో ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ తయారుచేయకపోవడం వెనుక ఉన్న కారణాల గురించి లోతుగా పరిశోధించాను. వాటిని తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తెస్తే, ఎంతోమంది దివ్యాంగుల ఇబ్బందులు తీరతాయనిపించింది. అలా ఆ ఆలోచన నుంచే, "ఈజీలైఫ్ వీల్‌చైర్' సంస్థ రూపం పోసుకుంది.

అవరోధాలను అధిగమించి...

మొదట్లో చైనా నుంచి కొన్ని ఎలక్ట్రిక్ వీల్‌చైర్స్ స్పేర్ పార్ట్స్ తెప్పించాం. వాటికి సర్వీసింగ్ చేయగలిగే నిపుణులను నియమించుకొని, అమ్మకాలు మొదలుపెట్టాం. 2020లో కొవిడ్ సమయంలో దిగుమతులకు అవరోధం ఏర్పడింది. దీనికి తోడు అదే సమయంలో, మన దేశానికి చైనాతో విభేదాలు పెరగడంతో, చైనా ఉత్పత్తుల పట్ల దేశవ్యాప్తంగా అయిష్టత ఏర్పడింది. ఈ పరిస్థితి మాకు ఆటంకంగా మారింది. దాంతో చైనా నుంచి దిగుమతికి స్వస్తి చెప్పి, స్థానికంగా చెన్నై ఐఐటీని సంప్రతించాం. కానీ వాళ్లు తయారుచేసి అందించే మోడల్... దిగుమతి చేసుకున్న మోడల్ కంటే ఖరీదైనది కావడంతో స్వయంగా మేమే ఎలక్ట్రిక్ కుర్చీల తయారీకి పూనుకున్నాం. కొందరు ఐఐటీ విద్యార్థుల సాయంతో ఇంట్లోనే ఎలక్ట్రిక్ వీల్‌చైర్ తయారీ మొదలుపెట్టాం. అలా 2021లో ప్రొటోటైప్ ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌ను రూపొందించగలిగాం. అప్పటికే ఇండియా మార్ట్‌లో రిజిస్టర్ అయి ఉన్నాం. కాబట్టి ఆ వేదిక ద్వారా కుర్చీల అమ్మకాలు. మొదలుపెట్టాం.

ఎన్నో రకాల వీల్‌చైర్స్

వీల్‌చైర్స్‌లో ఎన్నో రకాలుంటాయి. దివ్యాంగుల అవసరాలకు తగ్గట్టు రూపొందే వీల్‌చైర్స్ కూడా ఉంటాయి. కాబట్టి వీటి ధరల్లో తేడాలుంటాయి. విదేశీ వీల్‌చైర్స్‌తో పోలిస్తే, 'ఈజీలైఫ్' వీల్‌చైర్స్ చవకగా దొరకడమే కాకుండా, వాటి విడిభాగాలను కొనుక్కోవచ్చు, ఇతరత్రా సర్వీసింగ్ సేవలు కూడా పొందవచ్చు. మరీ ముఖ్యంగా నేల మీద దోగాడుతూ కదిలే వైకల్యం కొందరికి ఉంటుంది. ఇలాంటి వాళ్లు చేతుల సహాయంతో పైకి లేవలేరు. ఇతరుల సహాయం లేకుండా కుర్చీలో కూర్చోలేరు. వాళ్ల కోసం 'గ్రౌండ్ లిఫ్టింగ్ వీల్ చైర్‌ను కూడా మేం తయారుచేశాం. దీనిలో చైర్ నేలకు సమాంతరంగా కిందకు చేరుకోగలుగుతుంది. దీని మీదకు చేరుకుంటే... అది నెమ్మదిగా పైకి లేస్తుంది. ఇలా ఏ ఎత్తు కావాలనుకుంటే ఆ ఎత్తుకు కుర్చీ కదులుతుంది. ఇలాంటి కుర్చీని దిగుమతి చేసుకోడానికి 3 నుంచి 4 లక్షల రూపాయలు ఖర్చవుతుంది. మేం ఒకటిన్నర లక్షలకే ఇస్తున్నాం. ఇలా మా దగ్గర పది రకాల వీల్‌చైర్స్ అందుబాటులో ఉన్నాయి. దివ్యాంగులు కస్టమైజ్ కూడా చేసుకోవచ్చు. ఇప్పటివరకూ 400 వీల్‌చైర్స్ అమ్మకాలు జరిపాం.

> మాది ఒంగోలు. అక్కడే పుట్టి పెరిగాను. వైద్య విద్యలో ఫీటల్ మెడిసిన్ నా స్పెషాలిటీ. ఫెర్నాండెజ్ హాస్పిటల్‌లో ఫీటల్ అటాప్సీ కన్సల్టెంట్‌గా పని చేశాను. ప్రస్తుతం రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌లో ఫీటల్ మెడిసిన్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను. అమ్మ భూమా నాగేశ్వరమ్మ, ప్రభుత్వ టీచర్. మేం ముగ్గురు పిల్లలం. నాకు అక్క, అన్న, నేను చివరిదాన్ని. మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం కోసం నిర్వహించిన 'టై' (ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) విమెన్స్ గ్లోబల్ పిచ్ కాంపిటీషన్ రీజనల్ ఫైనల్స్‌లో... మొదటి రన్నరప్‌గా గుర్తింపు సాధించాను.

సవాళ్లను ఎదుర్కొని, వైద్యురాలిగా ఎదిగి...

చిన్నప్పటి నుంచే నేను చదువరిని. దివ్యాంగురాలిగా నన్ను చిన్నచూపు చూసిన సందర్భాలు కూడా లేవు. కుటుంబసభ్యులు, స్నేహితులు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచారే తప్ప, ఎప్పుడూ ఆత్మన్యూనతకు గురి చేయలేదు. అయితే డాక్టర్‌గా ఎదగాలనే కోరిక మాత్రం బలంగా ఉండేది. అందుకు కారణం నా వైకల్యం కాదు. ఎంతలా దేవుడిని కొలిచేవాళ్లైనా, అనారోగ్యం బారిన పడితే ముందుగా వైద్యులనే ఆశ్రయిస్తూ ఉంటారు. అలాంటి సందర్భాలు నాకు ఎదురైనప్పుడు... నేను కూడా వైద్యురాలిగా ఎదగాలనే కోరిక నాలో నాటుకుపోయింది. నా ఆలోచనను గ్రహించిన కొందరు "కుదురుగా నిలబడలేవు. నువ్వు వైద్యం ఎలా చేయగలుగుతావు?" అన్న సందర్భాలు కూడా ఉన్నాయి. దాంతో పట్టుదలగా చదివేదాన్ని. క్యాలిపర్స్‌తో సమర్థంగా నడవడం సాధన చేసేదాన్ని. ఇంటర్ ఒంగోలులో పూర్తి చేసిన తర్వాత, ఎంసెట్‌లో 320 ర్యాంకు సాధించాను. 'దివ్యాంగుల కోటాలో సీటు సాధిస్తే, వైకల్యం కారణంగా మెడిసిన్ ప్రవేశానికి అనుమతించరేమో?' అనే ఆలోచన కూడా వేధిస్తూ ఉండేది. దాంతో మెరిట్‌లో సీటు సాధించాలని పట్టుదలతో చదివాను. అనుకున్నది సాధించాను. అలా తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో ఎమ్‌బిబిఎస్ పూర్తి చేశాను. ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎండి చేశాను.

మేమిద్దరం ప్రాణ స్నేహితులం

నాకు పెళ్లి ఆలోచన ఉండేది కాదు. ఒక కోచింగ్ సెంటర్‌లో, జినేంద్ర సత్యశ్రీనివాస్ పరిచయం అయ్యారు. తక్కువ కాలంలోనే మేమిద్దరం మంచి స్నేహితులమైపోయాం. కలకాలం స్నేహితులుగా ఉండాలంటే పెళ్లొక్కటే మార్గమని నిర్ణయించుకున్నాం. అలా 2013లో మేము దంపతులమయ్యాం! ఇప్పటికీ ఆయనే నా బెస్ట్ ఫ్రెండ్. ప్రతి విషయంలో ఆయన తోడ్పాటు ఉంటూనే ఉంటుంది. ప్రస్తుతం ఆయన 'ఈజీలైఫ్ మొబిలిటీ ఇన్నొవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్'కు సిఇఒగా వ్యవహరిస్తున్నారు.

• గోగుమళ్ల కవిత

ఆదివాసీల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేశారు ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో అరెస్టయిన ఆయన కొంతకాలం జైలు జీవితం గడిపారు. అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రోజున కన్నుమూశారు. సాయిబాబా జైలు జీవితం గడుపుతున్న సమయంలో ఆయన జీవనసహచరి ఎ.ఎస్ వసంతకుమారి నవ్యతో ముచ్చటించారు.



ఆదివాసీల కోసం ఆయన జీవితం అంకితం

"ఆయన జైలు జీవితం మా కుటుంబాన్ని ఆర్థికంగా, మానసికంగా ఎంతో కుంగదీసింది. జైలులో ఉన్నప్పుడు ఆయనకు మందులు అనుమతించలేదు. దాంతో ఎడమ చేతి నరాలు, కండరాలు బాగా దెబ్బ తిన్నాయి. ఆయనకు రెండు కాళ్లూ పనిచేయవు కాబట్టి చేతుల మీదే ఆధారపడేవారు. దాంతో ఆయన పరిస్థితి మరింత దిగజారింది. వైద్యపరీక్షల్లో 'ఎక్యూట్ పాంక్రియాటిస్'తో బాధపడుతున్నారని తెలిసింది. ఆ తర్వాత గాల్‌బ్లాడర్‌లో ఉన్న రాళ్లను తీయడానికి సర్జరీ చేయాలన్నారు. రక్తపోటుకు, గుండెలోని ఇన్ఫెక్షన్‌కు, చేతులు, వెన్నెముక సమస్యలకు మందులు వాడేవారు. ఆ మందులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపకూడదు. కానీ జైలులో మందులు వాడే పరిస్థితి లేక ఆయన శరీరంలోని చాలా అవయవాలు దెబ్బతిన్నాయి. ఆరోగ్యపరంగానే కాదు ఆర్థికంగా కూడా ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నాం. తను సస్పెండ్ అయినప్పటి నుంచి మాకు సగం జీతమే ఇచ్చారు. దీనికి తోడు యూనివర్సిటీ క్వార్టర్స్‌ను ఖాళీ చేయించారు. ఇతర ఆదాయమార్గాలేవీ మాకు లేవు. ఇంత బాధలో ఉన్న మమ్మల్ని సాయిబాబా తోటిసిబ్బంది ఎంతగానో ఆదుకున్నారు. ఇంకా ఎందరో కళాకారులు, రైతులు, దళితులు, మానవహక్కుల కార్యకర్తలు అందరూ మాకు అండగా నిలబడ్డారు. వారందరికీ ఏమిచ్చి రుణం తీర్చుకోగలను.

> నేను జైలుకు వెళ్లిన మొదట్లో ప్రాణాలతో బయటకు రానని అనుకున్నా. ఆ సమయంలో ఎలా బతికాననే విషయం చెప్పలేను. అక్కడ పరిస్థితుల గురించి వర్ణించటం చాలా కష్టం. అలాంటి అమానవీయ పరిస్థితులున్నాయి. మొదట్లో ఐదారు నెలల కన్నా ఎక్కువ బతకననుకున్నా. వాస్తవిక పరిస్థితిని గమనించా. నేను జైలులో బతికి బయటకు వచ్చినా.. జైలు లోపలే చనిపోయినా- ఏదో ఒకటి చేయాలనుకున్నా. జైలులోనే చనిపోతే- నా ఆలోచనలు బయట ప్రపంచానికి తెలియాలి. బయటకు రావాలంటే- నా కోసం నేనే పోరాటం చేయాలి. ఇలా ఆలోచనలు మొదలయిన తర్వాత నాలో భయం పోయింది. రకరకాల పద్ధతుల ద్వారా నేను ఉన్న పరిస్థితుల గురించి ఉత్తరాలు రాసేవాడిని. ఇలా ఆరు నెలలు గడిచిన తర్వాత నాకు పుస్తకాలు ఇవ్వటం మొదలుపెట్టారు. దీనికి నా కూతురు పెద్ద పోరాటమే చేసింది.
> - జీఎన్ సాయిబాబా

నిత్యం ప్రజల కోసమే...

ఆయన 'ఆపరేషన్ గ్రీన్ హంట్'కు వ్యతిరేకంగా పోరాడారు. ఆదివాసీ యువతను చంపేయడాన్నీ, ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, వారి నివాసాలను తగలబెట్టేయడాన్నీ ఆయన తీవ్రంగా నిరసించారు. ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్‌లలో ఉన్న ఖనిజసంపదపై కన్నేసి బహుళజాతి కంపెనీలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందాలు కుదుర్చుకోవడాన్ని వ్యతిరేకించారు. అక్కడ ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో చంపేయడాన్ని తప్పుపట్టారు. ఇలాంటి ఎన్నో దారుణాలను ప్రపంచం ముందుకు తెచ్చారు. మానవహక్కుల కోసం కృషిచేశారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మానవహక్కుల పరిరక్షణకు, ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశారు.



అలా కలిశాం..

మా ఇద్దరిదీ తూర్పు గోదావరి జిల్లా అమలాపురం. 1991లో మా వివాహం అయింది. చదువుకునే రోజుల్లో ట్యూషన్‌లో పరిచయం అయ్యారు. చిన్నప్పటి నుంచి గ్రామాల్లోని దళితులు, స్త్రీలు, ఆదివాసీల ఈతిబాధలను దగ్గరి నుంచి చూశారు. సమాజంలో అణచివేతకు గురవుతున్న వారికి ఏమైనా చేయాలని ఆయన స్వప్నించారు. ఇద్దరం హైదరాబాద్ వచ్చిన తర్వాత మా స్వప్నాలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేశాం. సామ్రాజ్య వ్యతిరేక ఉద్యమాల్లో సాయిబాబా, మహిళా ఉద్యమాల్లో నేను పాల్గొన్నా. ఇద్దరం ఒకరికొకరం అండగా నిలబడ్డాం. ఆయన శారీరక లోపం మా ప్రేమకు, లక్ష్యాలకు ఆటంకం అనుకోలేదు. ప్రజాఉద్యమాలే ముందుకు నడిపించాయి."

హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...



1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
4. ఆయీ నై (స్త్రీ-2)
5. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
6. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉలాయా)
7. మిలియనీర్ (గ్లోరీ)
8. మేరీ మెహబూబ్ (విక్కీ విద్యా కా ఓ వాలా వీడియో)
9. అపనా బనాలే (భేడియా)
10. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)


బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరి!

రాత్రి నుంచి ఉన్న ఫాస్టింగ్‌ను ఉదయం అల్పాహారం తీసుకోవడం ద్వారా బ్రేక్ చేస్తాం. ఈ బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేస్తే కొత్త సమస్యలు చుట్టుముడతాయని అంటున్నారు నిపుణులు.



- ఉదయం వేళల్లో రక్తంలో షుగర్ లెవెల్స్ తక్కువ స్థాయిలో ఉంటాయి. బ్రేక్‌ఫాస్ట్ చేయడం వల్ల ఈ షుగర్ లెవెల్స్ సాధారణ స్థితికి చేరుకుంటాయి. జీవక్రియలు గాడిలో పడటానికి బ్రేక్‌ఫాస్ట్ అనేది శరీరానికి ఫ్యూయల్ మాదిరిగా ఉపకరిస్తుంది.
- నిద్రలేచినపుడు అందరిలోనూ ఎనర్జీ లెవెల్స్ చాలా తక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయంలో టిఫిన్ చేయకపోతే మెదడుకు అవసరమైన ముఖ్యమైన పోషకాలు అందకుండా పోతాయి. దీనివల్ల మరింత నీరసపడతారు.
- సమయానికి బ్రేక్‌ఫాస్ట్ చేయకపోతే యాసిడ్ రిఫ్లక్స్ అయ్యే అవకాశం ఉంది. ఎసిడిటీ సమస్య దరిచేరకుండా ఉండాలంటే లైట్‌గానైనా బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి.
- రోజంతా మెదడు అలర్ట్‌గా ఉండాలి. ఒకవేళ మీరు బ్రేక్‌ఫాస్ట్ మిస్ చేస్తే ముఖ్యమైన పోషకాలు అందక మెదడు చురుగ్గా పనిచేయదు. ప్రొటీన్ అధికంగా లభించే బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం ద్వారా ఈ సమస్య నుంచి సులువుగా బయటపడొచ్చు.
- బ్రేక్‌ఫాస్ట్‌ను మానేస్తే గుండె జబ్బులు వచ్చే రిస్క్ కూడా పెరుగుతుందని అంటున్నారు వైద్యులు. బ్రేక్‌ఫాస్ట్‌ను తరచుగా స్కిప్ చేసే వారిలో డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ అని హెచ్చరిస్తున్నారు.
- ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్ బరువు నియంత్రణకు ఉపయోగపడుతుంది. ఎక్కువసేపు పొట్ట నిండి ఉన్న ఫీలింగ్‌ని అందిస్తుంది. స్నాక్స్ వంటి వాటి జోలికిపోకుండా చేస్తుంది.

నవ్య | చిత్రజ్యోతి



మెగాస్టార్ చిరంజీవి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడిని కలిశారు. శనివారం, జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన ఆయన ఏపీలో వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి తన తరపున రూ. 50 లక్షలు, రామ్‌చరణ్ తరపున మరో రూ. 50 లక్షల విరాళం చెక్కులను సీఎంకు అందజేశారు.



సినీ హీరో నారా రోహిత్, సిరి వివాహ నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం నారా చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి

ప్రియురాలితో నిశ్చితార్థం

నారా రోహిత్ త్వరలోనే ఓ ఇంటివాడవబోతున్నారు. తన ప్రేయసి, హీరోయిన్ సిరి లెల్లాను పెళ్లాడనున్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో వీరి నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. సిరి లెల్లా, నారా రోహిత్ 'ప్రతినిధి-2'లో కలసి నటించారు. ఈ నిశ్చితార్థ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు నారా, నందమూరి, సిరి లెల్లా కుటుంబాలకు చెందిన పలువురు హాజరయ్యారు. నారా రోహిత్, సిరి లెల్లా డిసెంబరు 15న పెళ్లి పీటలెక్కనున్నారు.

టైటిల్ దీపావళికి.. సినిమా సంక్రాంతికి



బాబీ దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న సినిమా వర్కింగ్ టైటిల్ 'ఎన్‌బీకే109' అని తెలిసిందే. దసరా సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. సంక్రాంతికి సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. దీపావళికి టైటిల్‌ను ప్రకటిస్తామని తెలిపారు. మరోవైపు, అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అప్‌డేట్ వచ్చేసింది. 'సింహా', 'లెజెండ్', 'అఖండ' తర్వాత బోయపాటి శ్రీను దర్శకత్వంలో నాలుగో సారి బాలకృష్ణ నటించనున్న సినిమాను ఈ నెల 16న ప్రారంభిస్తున్నట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రకటించారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'బీబీ4'. బాలకృష్ణ కూతురు తేజస్విని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



మొదటి పాట వచ్చేస్తోంది

పవన్‌కల్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ పీరియడ్ డ్రామా 'హరిహర వీరమల్లు'. జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా నుంచి దసరా సందర్భంగా ఓ నూతన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. త్వరలోనే మొదటి గీతం విడుదవుతుందని తెలిపారు. ఈ పాటను పవన్‌కల్యాణ్ ఆలపించడం విశేషం. వచ్చే ఏడాది మార్చి 28న సినిమా విడుదలవుతోంది.



శ్రీదేవి కపూర్ చౌక్

దివంగత నటి శ్రీదేవి జ్ఞాపకార్థం ముంబైలోని ఓ రహదారి కూడలికి ఆమె పేరు పెట్టారు. శ్రీదేవి తుదిశ్వాస విడిచేవరకూ లోఖండ్‌వాలా ప్రాంతంలో నివసించారు. ఆమె అంతిమ యాత్ర కూడా ఈ రహదారి గుండానే సాగింది. ఈ నేపథ్యంలో ముంబై మున్సిపల్ కార్పొరేషన్ లోఖండ్‌వాలా కాంప్లెక్స్ ఏరియాలోని ముఖ్య కూడలికి శ్రీదేవి కపూర్ చౌక్ అని పేరు పెట్టింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని శనివారం శ్రీదేవి భర్త బోనీకపూర్, కూతురు ఖుషీకపూర్ ఆవిష్కరించారు.

కొత్త తేదీన గేమ్ చేంజర్

శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటిస్తున్న పొలిటికల్ యాక్షన్‌థ్రిల్లర్ 'గేమ్‌చేంజర్'. దిల్‌రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ, శ్రీకాంత్, ఎస్.జే.సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా విడుదలపై నెలకొన్న సస్పెన్స్ వీడింది. సంక్రాంతి కానుకగా సినిమాను వచ్చే ఏడాది జనవరి 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. మొదట ఈ సినిమాను క్రిస్మస్‌కు విడుదల చేయాలనుకున్న సంగతి తెలిసిందే.

మాస్ పాత్రలో నాని

నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' చిత్రం సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా, వీరిద్దరి కలయిలో మరో చిత్రం ప్రారంభమైంది. 'నాని ఓదెల 2' వర్కింగ్ టైటిల్‌తో పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాని ఇది వరకు పోషించనంత మాస్ పాత్రలో కనిపించనున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కే ఈ చిత్రం 'దసరా'ను మించి ఉండబోతోందని నాని ఓ సందర్భంలో తెలిపారు.

అంచనాలను మించేలా..

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాను వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మిస్తున్నారు. త్రిష, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దసరా సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వశిష్ఠ మాట్లాడుతూ "సినిమా షూటింగ్ దాదాపు పూర్తయ్యింది. మీ అందరి అంచనాలను మించేలా సినిమా ఉంటుంది. చిరంజీవితో సినిమా చేయడం మరిచిపోలేని అనుభూతి" అని చెప్పారు.

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 14 అక్టోబరు 2024

ఇంగ్లండ్ చేతిలో స్కాట్లాండ్ చిత్తు

షార్జా: మహిళల వరల్డ్‌కప్ గ్రూప్-బి మ్యాచ్‌లో ఇంగ్లండ్ పది వికెట్లతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. తొలుత స్కాట్లాండ్ 20ఓవర్లలో 109/6 స్కోరు చేసింది. స్వల్ప ఛేదనను కేవలం 10ఓవర్లలో 113/0తో ఇంగ్లండ్ ముగించింది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ గ్రూప్-బిలో టాపర్‌గా నిలిచింది.

సుతీర్థ జోడీ కంచు మోత



ఆసియా టీటీ

అస్తానా (కజకిస్థాన్): ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మూడో పతకం చేరింది. తాజాగా మహిళల డబుల్స్‌లో భారత జోడీ సుతీర్థ ముఖర్జీ, అయిహిక ముఖర్జీ కంచు మోత మోగించింది. ఆదివారం జరిగిన డబుల్స్ సెమీస్‌లో అయిహిక ముఖర్జీ-సుతీర్థ జోడీ 4-11, 9-11, 8-11తో జపాన్ జంట మివా హరిమోటో-మియు చేతిలో ఓడి కాంస్యం దక్కించుకొంది. దీంతో ఈ ఈవెంట్‌లో పతకం నెగ్గిన తొలి భారత జోడీగా అయిహిక-సుతీర్థ రికార్డులకెక్కారు. రెండ్రోజుల క్రితం మహిళల టీమ్ ఈవెంట్‌లో మనికా, అయిహిక, సుతీర్థ త్రయం, పురుషుల టీమ్ సెమీస్‌లో శరత్ కమల్, మానవ్, హర్మీత్ త్రయం కాంస్యాలు నెగ్గిన సంగతి తెలిసిందే.

హర్మన్‌ప్రీత్ @ రూ. 78 లక్షలు



హెచ్ఐఎల్ వేలంలో అత్యధిక ధర

న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) వేలంలో భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ టాప్ లేపాడు. ఆదివారం జరిగిన తొలిరోజు వేలంలో సూర్మ హాకీ క్లబ్ రూ. 78 లక్షల భారీ మొత్తానికి డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ను ఖరీదు చేసింది. మొత్తంగా లీగ్‌లోని 8 ఫ్రాంచైజీలు భారత జాతీయ జట్టు ఆటగాళ్ల కోసం ఎక్కువగానే వెచ్చించాయి. అత్యధిక ధర పలికిన రెండో ఆటగాడిగా నిలిచిన అభిషేక్‌ను బెంగాల్ టైగర్స్ రూ. 72 లక్షలకు కొనుగోలు చేయగా.. హార్దిక్ సింగ్‌ను యూపీ రుద్రాస్ రూ. 70 లక్షలకు దక్కించుకొంది. అమిత్ రోహిదాస్ (తమిళనాడు డ్రాగన్స్), జుగ్‌రాజ్ సింగ్ (బెంగాల్ టైగర్స్) చెరో రూ. 48 లక్షలు పలికారు. సుమీత్‌ను హైదరాబాద్ తుఫాన్స్ రూ. 46 లక్షలకు సొంతం చేసుకొంది. విదేశీ ఆటగాళ్లలో గోంజాలో పిల్లెట్ (జర్మనీ)ను రూ. 68 లక్షలు, జిప్ జన్సన్(నెదర్లాండ్స్)ను రూ. 54 లక్షలకు డ్రాగన్స్ కొనుగోలు చేసింది. మొత్తంగా మొదటి రోజు 18 ఓవర్‌సీస్ ప్లేయర్లు సహా 54 మంది అమ్ముడయ్యారు.

భారత్-ఎ కెప్టెన్ తిలక్



ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌నకు భారత జట్టు

న్యూఢిల్లీ: ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌లో భారత్-ఎ జట్టు సారథిగా తెలుగు ఆటగాడు తిలక్ వర్మ వ్యవహరించనున్నాడు. ఈ నెల 18 నుంచి ఒమన్‌లో టోర్నీ జరగనుంది. తొలిసారి టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే ఈ కప్‌లో తిలక్‌తోపాటు అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవం ఉన్న అభిషేక్ శర్మ, రాహుల్ చాహర్‌కు చోటుదక్కగా.. మిగతా వారిలో ఎక్కువ మంది ఐపీఎల్ ఆటగాళ్లు. గ్రూప్-ఎలో అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, హాంకాంగ్.. గ్రూప్-బిలో భారత్, పాకిస్థాన్, ఒమన్, యూఏఈ జట్లు ఉన్నాయి. ఈనెల 19న తమ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ పాక్‌తో భారత్ తలపడనుంది. .

భారత్-ఎ జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), అభిషేక్ శర్మ, బదోని, నిషాంత్ సింధు, అనూజ్ రావత్, ప్రభ్‌సిమ్రన్, నేహల్ వధేరా, అన్షుల్, హృతిక్ షోకీన్, ఆకిబ్ ఖాన్, వైభవ్ అరోరా, రసిక్ సలాం, సాయి కిషోర్, రాహుల్ చాహర్.



మహిళల వరల్డ్‌కప్‌లో నేడు
న్యూజిలాండ్ X పాకిస్థాన్
రా. 7.30

కీలక మ్యాచ్‌లో భారత అమ్మాయిల ఓటమి
సెమీస్ ఆశలు సంక్లిష్టం
9 పరుగులతో ఆసీస్ విజయం

ఒత్తిడికి చిత్తయ్యారు

షార్జా: గత టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్, 2020 ప్రపంచ కప్ ఫైనల్లో కంగారూల చేతిలో ఓడిన భారత్‌కు మరోసారి అదే ఫలితం ఎదురైంది. నాకౌట్ దశకు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఒత్తిడిలో పడి చిత్తయ్యింది. దాంతో ఆదివారం జరిగిన టీ20 ప్రపంచకప్ గ్రూప్ 'ఎ' కీలక మ్యాచ్‌లో 9 పరుగులతో భారత్ ఓడింది. ఫలితంగా మనోళ్ల సెమీస్ ఆశలూ సంక్లిష్టమయ్యాయి. సోమవారం న్యూజిలాండ్-పాకిస్థాన్ మధ్య జరిగే గ్రూపు ఆఖరి లీగ్ మ్యాచ్‌పై భారత్ నాకౌట్ చాన్స్ ఆధారపడి ఉంది. ఆ మ్యాచ్‌లో పాక్ గెలిస్తే భారత్ సెమీస్ చేరుతుంది. కివీస్ గెలిస్తే మన జట్టు ఇంటిబాట పట్టక తప్పదు. ఇక..ఈ మ్యాచ్‌లో తొలుత ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 151/8 స్కోరు చేసింది. హ్యారిస్ (40), పెర్రీ (32), మెక్‌గ్రాత్ (32) సత్తాచాటారు. రేణుక, దీప్తి రెండేసి వికెట్లు తీశారు. ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 142/9 స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (54 నాటౌట్) హాఫ్ సెంచరీతో పోరాడగా, దీప్తిశర్మ (29), షఫాలీ (20) మోస్తరుగా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మోలినెక్స్, సదర్లాండ్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ గెలుపుతో ఆసీస్ వరుసగా 9వసారి టీ20 ప్రపంచ కప్‌లో సెమీస్‌కు చేరింది.

వికెట్లు వరుసగా: షఫాలీ దూకుడుతో ఛేదనను భారత్ ధాటిగానే ప్రారంభించింది. కానీ 4వ ఓవర్లో షఫాలీ అవుట్ కాగా..ఆపై మంధాన, జెమీమాను పెవిలియన్ చేర్చి ఆసీస్ గట్టి దెబ్బకొట్టింది. ఈ దశలో హర్మన్, దీప్తి నాలుగో వికెట్‌కు 63 రన్స్ జోడించినా రన్‌రేట్ పెరిగిపోయింది. దీప్తి తర్వాత వచ్చిన బ్యాటర్లు వచ్చినట్టు పెవిలియన్ చేరారు. ఆఖరి ఓవర్లోనే నలుగురు భారత బ్యాటర్లు నిష్క్రమించడం గమనార్హం. మరోవైపు అర్ధసెంచరీతో హర్మన్ జట్టును గెలిపించేందుకు శాయశక్తులా ప్రయత్నించినా.. దీప్తి మినహా మరెవరూ సహకారం అందించలేకపోయారు.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 151/8 (హ్యారిస్ 40, పెర్రీ 32, మెక్‌గ్రాత్ 32, రేణుక 2/24, దీప్తిశర్మ 2/28).

భారత్: 20 ఓవర్లలో 142/9 (హర్మన్ 54 నాటౌట్, దీప్తి 29, షఫాలీ 20, సదర్లాండ్ 2/22, మోనిలెక్స్ 2/32).

ఎదురులేని భారత్



(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినివ్వడంతో బంగ్లాదేశ్‌తో జరిగిన మూడు టీ20ల సిరీస్‌ను భారత్ ఎక్కువగా యువ ఆటగాళ్లతోనే ఆడింది. కానీ బరిలోకి దిగాక వీరంతా సీనియర్లు లేని లోటును తెలియకుండా విరుచుకుపడ్డారు. ప్రతీ మ్యాచ్‌లోనూ దూకుడైన ఆటతీరుతో బంగ్లాను బెంబేలెత్తిస్తూ ముందుకుసాగారు. ఈ క్రమంలో భారత్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయగలిగింది. అయితే ఈ 3 మ్యాచుల్లో జట్టుకు లభించిన సానుకూల అంశాలను పరిశీలిస్తే..

ఆల్‌రౌండర్ల హవా: నాణ్యమైన ఆల్‌రౌండర్ల కొరత భారత జట్టును చాలాకాలంగా వేధిస్తోంది. కానీ ఇకపై ఆ ఇబ్బంది ఉండకపోవచ్చు. బంగ్లాదేశ్‌తో ఆడిన భారత జట్టును పరిశీలిస్తే చాలామంది ఆల్‌రౌండర్లను చూడవచ్చు. ప్రతీ మ్యాచ్‌లో కెప్టెన్‌కు కనీసం ఏడుగురు బౌలర్లు అందుబాటులో ఉండడం విశేషం. హార్దిక్‌కు జతగా నితీశ్ ఎదిగాడు. అలాగే రియాన్ పరాగ్, సుందర్ కూడా లభించిన అవకాశాన్ని వినియోగించుకున్నారు.



శాంసన్ (111)

ఆటగాళ్ల ఎదురుదాడి: సిరీస్ ఆరంభానికి ముందు కెప్టెన్ సూర్యకుమార్ మాట్లాడుతూ, తమ ఆటగాళ్లు స్థాయికి తగ్గట్టుగా ఆడితే చూడాలనుకుంటున్నట్టు చెప్పాడు. కెప్టెన్ కోరుకున్నట్టుగానే ప్రతీ ప్లేయర్ చెలరేగాడు. తొలి టీ20లో 128 పరుగుల స్వల్ప ఛేదనే అయినా ఓపెనర్ సంజూ శాంసన్ ఇన్నింగ్స్‌ను వేగంగా ఆరంభించాడు. రెండో మ్యాచ్‌లో జట్టు 41/3 స్కోరుతో ఇబ్బందిపడినా.. నితీశ్ ధనాధన్ ఆటతో స్కోరు 221కి వెళ్లగలిగింది. ఇక ఆఖరి మ్యాచ్‌లో అందరూ దాడికి దిగడంతో ఈ ఫార్మాట్‌లో రెండో అతి భారీ స్కోరు నమోదైంది.

మెరిసిన శాంసన్: శ్రీలంక టూర్‌లో శాంసన్ వరుసగా రెండు సార్లు డకౌట్లు కావడంతో అతడి పని అయిపోయినట్టేనని అంతా భావించారు. కానీ కోచ్, మేనేజ్‌మెంట్ తనపై ఉంచిన నమ్మకాన్ని బంగ్లాతో సిరీస్‌లో నిలబెట్టుకున్నాడు. తొలి మ్యాచ్‌లో 19 బంతుల్లోనే 29 రన్స్ చేసిన సంజూ.. ఉప్పల్ మ్యాచ్‌లో కసితీరా బాదేసి సెంచరీ అందుకున్నాడు. ఇప్పటికీ అతను తొలి ప్రాధాన్య వికెట్ కీపర్ కాకపోయినా.. రానున్న సఫారీ టూర్‌లో తన ప్లేస్‌పై బెంగపెట్టుకోనవసరం లేదు. అలాగే అరంగేట్ర పేసర్ మయాంక్ యాదవ్, పునరాగమన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి సెలెక్టర్లను నిరాశపర్చలేదు.

హైదరాబాద్: విజయదశమి రోజున భారత టీ20 జట్టు అభిమానులకు మరింత ఉత్సాహాన్నిచ్చింది. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో ఉప్పల్ స్టేడియం రికార్డుల మోతతో ఊగిపోయింది. సంజూ శాంసన్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్లతో 111) శతకంతో పాటు సూర్యకుమార్ (35 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 75) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత బౌలర్లు సత్తా చూపడంతో భారత్ ఏకంగా 133 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 297 పరుగుల భారీ స్కోరు సాధించింది. హార్దిక్ (18 బంతుల్లో 4 ఫోర్లు, 4

మోతెక్కించారు

సిక్సర్లతో 47), రియాన్ పరాగ్ (13 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 34) కూడా చెలరేగారు. తన్‌జీమ్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం బంగ్లా 20 ఓవర్లలో 164/7 స్కోరుకే పరిమితమైంది. తౌహీద్ హ్రిదయ్ (63 నాటౌట్), లిట్టన్ దాస్ (42) రాణించారు. రవి బిష్ణోయ్‌కు 3, మయాంక్ యాదవ్‌కు2 వికెట్లు దక్కాయి. ఓవరాల్‌గా టీ20 ఫార్మాట్‌లో నేపాల్ (314) తర్వాత రెండో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్ నిలిచింది. అలాగే అత్యధిక బౌండరీల (47) రికార్డును నెలకొల్పింది.

7.1 ఓవర్లలోనే 100: అటు శాంసన్.. ఇటు సూర్య ధాటికి బంగ్లా బౌలర్లకు శనివారం కాళరాత్రిగా మిగిలింది. ఓపెనర్ అభిషేక్ (4) విఫలమైనా శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రెండో ఓవర్‌లో శాంసన్ వరుసగా 4 ఫోర్లు బాదగా.. ఆరో ఓవర్‌లో సూర్య 4,4,4,6తో పవర్‌ప్లేలో జట్టు 82 రన్స్ రాబట్టింది. తర్వాత ఓవర్ తొలి 3 బంతులను శాంసన్ 4,4,6కు పంపి 22 బాల్స్‌లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అటు జట్టు స్కోరు 7.1 ఓవర్లలోనే వందకు చేరింది. ఇక పదో ఓవర్‌లో అతడు 0,6,6,6,6,6తో ఏకంగా 30 రన్స్ పిండుకున్నాడు. ఇదే జోరుతో సంజూ 40 బంతుల్లోనే కెరీర్‌లో తొలి శతకం సాధించాడు. తర్వాత వరుస ఓవర్లలో శాంసన్, సూర్య వెనుదిరిగినా.. హార్దిక్, పరాగ్ దూకుడు కొనసాగించారు. 16వ ఓవర్‌లో హార్దిక్ 4,6,6,4తో, తర్వాతి ఓవర్‌లో పరాగ్ 6,4,6తో సత్తా చాటారు. అయితే పరాగ్ 19వ ఓవర్‌లో.. ఆఖరి ఓవర్‌లో హార్దిక్, నితీశ్ (0) వరుస బంతుల్లో అవుటవడంతో స్కోరు 300లోపే ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు: భారత్: 20 ఓవర్లలో 297/6 (సంజూ శాంసన్ 111, సూర్యకుమార్ 75, హార్దిక్ 47, రియాన్ 34; తన్‌జీమ్ హసన్ 3/66).

బంగ్లాదేశ్: 20 ఓవర్లలో 164/7 (తౌహీద్ 63 నాటౌట్, లిట్టన్ 42; బిష్ణోయ్ 3/30, మయాంక్ 2/32).

పోరాడుతున్న ఆంధ్ర

నాగ్‌పూర్: విదర్భతో రంజీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు విజయం కోసం పోరాడుతోంది. 318 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన ఈ జట్టు ఆదివారం ఆట ముగిసేసరికి 79/1 స్కోరుతో ఉంది. క్రీజులో అభిషేక్ (38), రషీద్ (18) ఉన్నారు. విజయానికి ఆంధ్ర ఇంకా 239 పరుగులు చేయాలి. అంతకుముందు విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 366 రన్స్ చేసింది. అథర్వ (118) సెంచరీ కొట్టగా, డానిష్ (61), అమన్ (53) రాణించారు. విజయ్‌కు 4, మోహన్‌కు 3, సత్యనారాయణకు 2 వికెట్లు దక్కాయి. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 167 రన్స్ చేసింది. అభిషేక్ (68), రషీద్ (56) మినహా అంతా విఫలమయ్యారు. అక్షయ్, హర్ష్ నాలుగేసి వికెట్లతో దెబ్బతీశారు.

'త్రివేణి'కే గ్లోబల్ చెస్ టైటిల్

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంపియన్ త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ నిలబెట్టుకొంది. శనివారం ఉత్కంఠగా జరిగిన ఫైనల్స్‌లో టేబుల్ టాపర్ అలాస్కన్ నైట్స్‌కు త్రివేణి కింగ్స్ షాకిచ్చింది. తొలి మ్యాచ్‌లో కింగ్స్ 9-7తో నైట్స్‌ను ఓడించిన త్రివేణి జట్టు.. రెండో మ్యాచ్‌లో 13-7తో గెలిచి వరుసగా రెండోసారి టైటిల్‌ను అందుకొంది.

'ముంబై' చీఫ్ కోచ్‌గా మహేల



ముంబై: శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్దనే రెండేళ్ల తర్వాత మళ్లీ ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్‌గా నియమితులయ్యాడు. మార్క్ బౌచర్ స్థానంలో అతడు బాధ్యతలు చేపట్టనున్నాడు. గతంలో 2017 నుంచి 2022 వరకు మహేల ముంబై కోచ్‌గా ఉన్నాడు.

బాబర్, అఫ్రీదిపై వేటు

కరాచీ: ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో చిత్తుగా ఓడడంతో పాకిస్థాన్ జట్టు రెండు, మూడో టెస్టులకు మార్పులు చేసింది. పేలవఫామ్‌లో ఉన్న బాబర్ ఆజమ్‌తో పాటు పేసర్ షహీన్ షా అఫ్రీదీ, నసీమ్ షా, సర్ఫరాజ్ అహ్మద్‌లపై వేటు వేసింది. వీళ్ల స్థానంలో అన్‌క్యాప్డ్ ప్లేయర్లు హసీబుల్లా, మెహ్రాన్, కమ్రాన్ గుహ్లామ్‌లను తీసుకుంది.

బిజినెస్

25,300 ఎగువన బుల్లిష్

(అక్టోబరు 14-18 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో టెక్

నిఫ్టీ గత వారం 26,234-24,494 పాయింట్ల మధ్యన కదలాడి 50 పాయింట్లు (0.2%) నష్టపోయి 24,964 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 25,300
బ్రేక్‌డౌన్ స్థాయి: 24,550
నిరోధ స్థాయిలు: 25,175, 25,275, 25,375 (25,075 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,750, 24,650, 24,550

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	525
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	విజయవాడ	135
వరంగల్	126	గుంటూరు	135
కరీంనగర్	126	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	126	చిత్తూరు	133
కర్నూలు	126	నెల్లూరు	133
విశాఖపట్నం	125	అనంతపురం	133
గోదావరి	135		

15 నిమిషాల్లో ఎంఎస్ఎంఈలకు రుణాలు

ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: ఎంఎస్ఎంఈ రుణాలపై మరింత దృష్టి పెట్టాలని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) భావిస్తోంది. ఇందుకోసం వారి రుణ దరఖాస్తుల ఆమోద ప్రక్రియను మరింత త్వరితం చేస్తోంది. ఎంఎస్ఎంఈల యజమానులు తమ ఎంఎస్ఎంఈల బ్రాంచీలకు వెళ్లి..వారి పాన్ నంబరు, జీఎస్‌టీ డేటా వివరాలు అందిస్తే 15 నుంచి 45 నిమిషాల్లో వారి రుణ దరఖాస్తులు పరిశీలించి ఆమోదిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి చెప్పారు. దీనికి తోడు ప్రస్తుతం వీరికి ఉన్న రూ.5 కోట్ల రుణ పరిమితిని మరింత పెంచే విషయాన్నీ పరిశీలిస్తున్నట్టు శెట్టి తెలిపారు.

హెచ్ఏఎల్ ఇక 'మహారత్న' కంపెనీ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు 'మహారత్న' హోదా లభించింది. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌యూ)ల్లో ఈ హోదా పొందిన సంస్థల్లో హెచ్ఏఎల్ 14వది. ఆరు నిర్ణీత ప్రామాణికాలను పూర్తి చేసిన సీపీఎస్‌యూలకు కేంద్ర ప్రభుత్వం ఈ హోదా ఇస్తుంది. ఈ హోదాతో హెచ్ఏఎల్‌కు ఆర్థిక, వ్యూహాత్మక నిర్ణయాల్లో మరింత స్వేచ్ఛ లభించనుంది.

ఏడు నగరాల్లో రిటైల్ లోన్ ప్రాసెసింగ్ కేంద్రాలు: ఐఓబీ

చెన్నై: ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) తన రిటైల్ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఇందుకోసం హైదరాబాద్, ముంబై, చెన్నైతో సహా ఏడు ప్రధాన నగరాల్లో రిటైల్ లోన్ ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో రిటైల్ రుణాల దరఖాస్తులను డిజిటల్ టూల్స్ సాయంతో మదింపు చేసి వీలైనంత త్వరగా రుణాలు మంజూరు చేస్తారు.

విమాన ప్రయాణికులకు దీపావళి ధమాకా

25% తగ్గిన విమాన టికెట్ ధరలు



న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులకు ఈ సంవత్సరం ముందే దీపావళి పండగ వచ్చింది. ప్రధాన దేశీయ రూట్లలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది విమాన టికెట్ల ధరలు సగటున 20 నుంచి 25 శాతం వరకు తగ్గాయి. ఈ నెల 28 నుంచి వచ్చే నెల మూడవ తేదీ వరకు ప్రయాణించే ఉద్దేశంతో నెల రోజుల ముందే టికెట్లు బుక్ చేసుకున్న విమాన ప్రయాణికుల బుకింగ్స్ ఆధారంగా ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీ 'ఇక్సిగో' ఈ విషయం తెలిపింది. అందుబాటులో ఉండే విమాన సీట్ల సంఖ్య పెరగడం, చమురు ధర తగ్గడంతో విమానయాన సంస్థలపై ఇంధన చార్జీలు తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని ఆ సంస్థ పేర్కొంది. అయితే అహ్మదాబాద్-ఢిల్లీ, ముంబై-డెహ్రాడూన్, మార్గాల్లో మాత్రం విమాన చార్జీలు గత ఏడాది పండగల సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది 33 నుంచి 34 శాతం పెరిగాయి.

38 శాతం వరకు తగ్గుదల: గత ఏడాది నవంబరు 10-16 మధ్య కాలంతో పోలిస్తే ఈ ఏడాది అక్టోబరు 28-నవంబరు 3వ తేదీ మధ్య కాలంలో ప్రధాన నగరాల మధ్య విమాన టికెట్ చార్జీలు సగటున 20 నుంచి 25 శాతం తగ్గాయి. బెంగళూరు-కోల్‌కతా మార్గంలో మాత్రం మిగతా ఏ మార్గంలో లేనంతగా రూ.10,195 నుంచి రూ.6,319కి (38 శాతం) తగ్గాయి. చెన్నై-కోల్‌కతా మార్గంలో 36 శాతం, ముంబై-ఢిల్లీ, ఢిల్లీ-ఉదయ్‌పూర్ మార్గాల్లో 34 శాతం చొప్పున, ఢిల్లీ-కోల్‌కతా, హైదరాబాద్-ఢిల్లీ, ఢిల్లీ-శ్రీనగర్ మార్గాల్లో 32 శాతం చొప్పున టికెట్ల ధరలు తగ్గినట్టు ఇక్సిగో తెలిపింది.

బంధన్ ఎంఎఫ్ నుంచి రెండు కొత్త ఫండ్స్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. రెండు కొత్త ఫండ్స్‌ను తీసుకువచ్చింది. బంధన్ నిఫ్టీ 500 వాల్యూ ఇండెక్స్ ఫండ్, బంధన్ నిఫ్టీ 500 మూమెంటమ్ 50 ఇండెక్స్ ఫండ్ పేరుతో వీటిని ప్రారంభించింది. ఈ రెండు ఫండ్స్ ఈ నెల 14న ప్రారంభమై 24న ముగియనున్నాయి. ఈ ఫండ్స్ కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడు (సిప్)ల రూపంలో కనీసం రూ.100 పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది.

మోతీలాల్ ఓస్వాల్ డిజిటల్ ఇండియా ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మ్యూచువల్ ఫండ్.. డిజిటల్ ఇండియా ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. దీర్ఘకాలంలో ఇన్వెస్టర్లకు మంచి రిటర్నులు అందించే విధంగా డిజిటల్ విభాగం, టెక్నాలజీ, టెలికాం, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 25.

విప్రో బోనస్ ఇష్యూ!

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం విప్రో.. వాటాదారులకు త్వరలో శుభవార్త చెప్పే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నెల 16-17 తేదీల్లో జరిగే భేటీలో డైరెక్టర్ల బోర్డు బోనస్ షేర్లు జారీ చేసే విషయాన్ని పరిశీలిస్తుందని కంపెనీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సెబీ నిబంధనలు, కంపెనీల చట్టం, 2013కు అనుగుణంగా ఈ నిర్ణయం ఉంటుందని పేర్కొంది. ఈ నెల 17న కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. దీంతో ఈ వారం విప్రో కంపెనీ షేర్లు చురుగ్గా ట్రేడవుతాయని భావిస్తున్నారు.

ఏపీలో మినీ ఎల్ఎన్‌జీ ప్లాంట్లు

ఓఎన్‌జీసీ

న్యూఢిల్లీ: పైప్‌లైన్లతో అనుసంధానం లేని సహజ వాయువు క్షేత్రాల వద్ద మినీ ఎల్ఎన్‌జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ నిర్ణయించింది. ఇందుకు ఆసక్తి ఉన్న సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం వద్ద రెండు మినీ ఎల్ఎన్‌జీ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. కొద్ది మొత్తంలో మాత్రమే సహజ వాయువు ఉత్పత్తి చేస్తూ, పైప్‌లైన్లతో అనుసంధానత లేని చోట్ల ఓఎన్‌జీసీ ఈ మినీ ప్లాంట్లను తలపెట్టింది. ఈ ప్లాంట్లలో ఈ గ్యాస్‌ను ఎల్ఎన్‌జీగా మార్చి ట్యాంకర్లలో వినియోగ ప్రాంతాలకు లేదా గ్యాస్ పైప్‌లైన్లు ఉన్న ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

25,000 ఎగువన నిలదొక్కుకుంటేనే..

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం కీలక స్థాయిలైన 25,000 దిగువకు పడిపోయి డౌన్‌ట్రెండ్‌ను సూచించింది. మంగళవారం ఈ స్థాయిలకు చేరుకున్నప్పటికీ నిలదొక్కుకోలేకపోయింది. అంతకుముందు వారంతో పోల్చితే మొత్తంగా గత వారం నిఫ్టీ 50 పాయింట్లు నష్టపోయి 24,964 స్థాయిల వద్ద క్లోజైంది. వారమంతా నష్టాల్లో సాగిన నిఫ్టీ చివరకు ఎలాంటి సానుకూల సంకేతాలను వెలువరించలేదు. మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ మాత్రం వారం కనిష్ఠ స్థాయిల నుంచి కోలుకుని చివరకు 740 పాయింట్ల లాభంతో 59,200 వద్ద క్లోజైంది. మరోవైపు స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ కూడా వీక్లీ ప్రాతిపదికన 250 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ గత వారం 24,800 స్థాయిల వద్ద మైనర్ మద్దతు కోసం ప్రయత్నించింది. కాగా సానుకూల సంకేతాల కోసం మరికొద్ది రోజులు ఈ స్థాయిల వద్ద కన్సాలిడేట్ కావాల్సి ఉంటుంది. టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ ఈ స్థాయిల వద్ద పటిష్ఠతను కనబరచాల్సి ఉంటుంది. పాజిటివ్ ట్రెండ్ కోసం 25,000 ఎగువన నిలదొక్కుకోవాలి.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయిలైన 25,200 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి ప్రధాన నిరోధ స్థాయి 25,250. గత కొద్ది రోజులుగా నిఫ్టీ 25,000 స్థాయిల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటూ వస్తోంది. సానుకూల సంకేతాల కోసం వచ్చే కొద్ది రోజులు ఈ స్థాయిలకు ఎగువన తప్పనిసరిగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయిలైన 25,000 ఎగువన కచ్చితంగా నిలదొక్కుకుని తీరాలి. ఒకవేళ నిలదొక్కుకోలేకపోతే మరింత అప్రమత్తతను సూచిస్తుంది. తదుపరి మద్దతు స్థాయి 24,800. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేని పక్షంలో తదుపరి మద్దతు స్థాయిలు 24,650, 24,450 దిగువన ఉంటాయి. ఇవి గతంలో ఏర్పడిన బాటమ్ స్థాయిలు.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా తొలుత 50,200 స్థాయికి పడిపోయింది. చివరకు 290 పాయింట్ల నష్టంతో 51,170 వద్ద ముగిసింది. పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధ స్థాయి అయిన 51,600 ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే 50,500 వద్ద మద్దతు స్థాయిలుంటాయి. తదుపరి మద్దతు స్థాయి 49,800.

పాటర్న్: వీక్లీ చార్టుల ప్రకారం 24,800 స్థాయిల వద్ద డబుల్ బాటమ్ ప్యాటర్న్ ఏర్పడింది. నిఫ్టీ ప్రస్తుతం 50 రోజుల చలన సగటు వద్ద పరీక్షను ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం కొద్ది రోజులు ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవాలి. 25,100 వద్ద సమాంతరంగా దిగువకు నిరోధ ట్రెండ్‌లైన్ ఏర్పడింది. సానుకూల సంకేతాల కోసం ఇక్కడ నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,100, 25,155
మద్దతు	25,000, 24,940

కార్పొరేట్ ఫలితాలు, ద్రవ్యోల్బణమే కీలకం!

పశ్చిమాసియాలో యుద్ధం, అమెరికా ఆర్థిక వ్యవస్థ గణాంకాలు, దేశీయ కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు, ద్రవ్యోల్బణ డేటా నేపథ్యంలో మదుపరులు ఈ వారం మరింత అప్రమత్తంగా ఉండటం మంచిది. గత వారం విశ్రమంగా కదలాడిన సూచీలు ఈ వారం క్రూడాయిల్ ధరలు, ఎఫ్ఐఐల పెట్టుబడుల ఉపసంహరణ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఆటుపోట్లకు గురయ్యే అవకాశాలున్నాయి. నిఫ్టీకి ఈ వారం 25,000 వద్ద మద్దతు, 25.150 వద్ద నిరోధ స్థాయిలున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

గ్రాన్యూల్స్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 20 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం కీలక మద్దతు శ్రేణిలో కదలాడుతున్నాయి. మెరుగైన ఆర్థిక ఫలితాలు వెలువరించ వచ్చన్న అంచనాలతో కన్సాలిడేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 4.4 శాతం లాభంతో రూ.603 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.586 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందేవేర్: ఏడాదిన్నర కాలంగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. ప్రస్తుతం కీలక మద్దతు స్థాయిల వద్ద కదలాడుతోంది. సాధారణంగా ఈ స్థాయి నుంచి ట్రెండ్ రివర్సల్ జరిగే అవకాశం ఉంది. గత శుక్రవారం 7.4 శాతం లాభంతో రూ.323 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.320 వద్ద పొజిషన్ తీసుకుని రూ.375 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే అవకాశాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.300 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎక్సైడ్ ఇండస్ట్రీస్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత కరెక్షన్‌కు గురయింది. ప్రస్తుతం కీలక మద్దతు శ్రేణిలో షేరు కదలాడుతోంది. ఈపీఎస్ పెరుగుతుండటం, రాబోయే త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉండటంతో చక్కని డెలివరీ వాల్యూమ్‌తో ఈ షేరు బలం పుంజుకుంది. గత శుక్రవారం 3.58 శాతం లాభంతో రూ.530 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.500 వద్ద పొజిషన్ తీసుకుని రూ.580 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.470 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఏంజెల్‌వన్: ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. దాదాపు 47 శాతం మేరకు కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం కన్సాలిడేషన్ జరుగుతోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరుగుతోంది. ట్రెండ్ రివర్సల్ జరిగింది. రిస్క్ రివార్డ్ రేషియో బాగుంది. గత శుక్రవారం ఈ షేరు 3.7 శాతం లాభంతో రూ.2,703 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.2,650 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,780/2,825 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,600 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

నేషనల్ అల్యూమినియం (నాల్కో): ఈ మధ్యనే జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసిన ఈ షేరు మంచి బలంతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం కీలకమైన నిరోధ స్థాయి రూ.208 ఎగువన నిలదొక్కుకుంది. చైనాలో ఉద్దీపన పథకం ప్రకటించటంతో మెటల్ షేర్లకు గిరాకీ పెరిగింది. గత శుక్రవారం రూ.4.80 శాతం లాభంతో రూ.222 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.218/215 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.245/275 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

రాష్ట్రానికి రూ.988 కోట్లు
15వ ఆర్థిక సంఘం నిధులు

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మరో శుభ వార్త చెప్పింది. దసరా పండుగ రోజే స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద తొలి విడతగా రాష్ట్రానికి రూ.988.77 కోట్లు విడుదల చేసింది. అందులో.. అన్‌టైడ్ గ్రాంట్లు రూ.395.50 కోట్లు, టైడ్ గ్రాంట్లు రూ.593.26 కోట్లు ఉన్నాయి. వీటిని రాష్ట్రంలో ఎంపిక చేసిన 9 జిల్లా పరిషత్‌లు, 615 మండల పరిషత్‌లు, 12,853 గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. 'స్థానిక స్వపరిపాలనలో భాగంగా ఈ నిధులు ఇస్తున్నాం. రాజ్యాంగంలోని 243 జీ అధికరణ ప్రకారం.. పంచాయతీల్లో సేవలు, మౌలిక సదుపాయాల కల్పనకు వీటిని ఉపయోగించుకోవాలి' అని కేంద్రం స్పష్టం చేసింది.

రాష్ట్ర పన్నుల విభాగం చీఫ్ కమిషనర్‌గా అహ్మద్‌బాబు



అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పన్నుల విభాగం చీఫ్ కమిషనర్‌గా అహ్మద్‌బాబు నియమితులయ్యారు. ప్రస్తుతం చీఫ్ కమిషనర్‌గా ముఖేశ్‌కుమార్ మీనా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన స్థానంలో రెగ్యులర్ చీఫ్ కమిషనర్‌గా అహ్మద్‌బాబును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

వరద నిర్వహణలో స్టార్టప్‌లది కీలక పాత్ర

- వాటి సహకారంతోనే వేగంగా సహాయం: మంత్రి లోకేశ్



అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదలు రాష్ట్రంపై తీవ్ర ప్రభావమే చూపాయి. ఆ సమయంలో వరద నిర్వహణ, త్వరితగతిన సాయం అందించేందుకు స్టార్టప్‌లు ఎంతగానో ఉపయోగపడ్డాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. 'స్టార్టప్ ఆంధ్ర అనేది నినాదం కాదు.. పరిపాలనా విధానాన్ని మార్చేసే ప్రక్రియ..' అని ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. వరద సహాయక చర్యల్లో స్టార్టప్‌లు, డీప్-టెక్ సాంకేతికతను ఏ విధంగా వినియోగించుకున్నామో వివరిస్తూ ఆదివారం ఆయన 'ఎక్స్'లో ఓ కథనాన్ని పోస్ట్ చేశారు. ఇటీవల వరదలతో ఇబ్బంది పడుతున్నప్పుడు రియల్ టైమ్‌లో సమస్యలు పరిష్కారానికి మార్గాలు అందించే స్టార్టప్‌లను ఆహ్వానించామని చెప్పారు. ఈ క్రమంలో సమస్యలను రికార్డు సమయంలోనే పరిష్కరించే స్టార్టప్‌ల సామర్థ్యాన్ని చూసి తామే ఆశ్చర్యపోయామని మంత్రి తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో రేపటి నుంచి ప్రజావేదిక

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నుంచి ప్రజావేదిక నిర్వహించనున్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో 15నుంచి ప్రజల వినతులు తీసుకోవాలని నిర్ణయించారు. వాటిని స్వీకరించే మంత్రులు, పార్టీ నాయకుల వివరాలను పార్టీ కార్యాలయం తెలియజేసింది. మంగళవారం మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు.. 16న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్.. 17న బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్.. 18న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పీ శ్రీనివాసరావు, మంత్రి వాసంశెట్టి సుభాష్.. 21న మంత్రి కొలుసు పార్థసారథి, వైకుంఠం ప్రభాకర్ చౌదరి.. 22న మంత్రి సవిత, నెట్టెం రఘురాం.. 23న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు.. 24న మంత్రి టీజీ భరత్, నూకసాని బాలాజీ.. 25న పల్లా శ్రీనివాసరావు, మంత్రి గొట్టిపాటి రవికుమార్.. 26న పల్లా శ్రీనివాసరావు, మంత్రి అనగాని సత్యప్రసాద్.. 28న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి.. 29న మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీహెచ్‌సీ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, 30న మంత్రి నిమ్మల, కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, 31న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహన్‌రావు పాల్గొంటారని అశోక్‌బాబు వెల్లడించారు.

టీడీపీ కార్యాలయంపై
దాడి కేసు సీఐడీకి

(మొదటి పేజీ తరువాయి)

లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, నాటి బాపట్ల ఎంపీ నందిగం సురేష్, విజయవాడ తూర్పు వైసీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలో వైసీపీ ముఖ్యనేతల ఆదేశాలతో ఈ దాడికి పథక రచన జరిగింది. వందలాది మంది వైసీపీ నాయకులతో పాటు రౌడీషీటర్లు, పలువురు మహిళలు ఈ దాడిలో పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం ప్రధాన గేటును కూల్చి లోపలకి ప్రవేశించిన అల్లరి మూకలు కార్యాలయ సిబ్బందిపై విచక్షణారహితంగా దాడిచేసి హత్యాయత్నం చేశారు. కర్రలు, రాడ్లు, రాళ్లతో అద్దాలు, కార్లను, సామగ్రిని ధ్వంసం చేశారు. అరగంటకు పైగా బీభత్సం సృష్టించారు. దీనిపై ముందే సమాచారం అందుకున్న టీడీపీ కార్యాలయ సిబ్బంది మంగళగిరి టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా నిందితులు వెళ్లిపోయే వరకు పోలీసులు కన్నెత్తి చూడలేదు. ఆ తర్వాత కూడా టీడీపీ నాయకుల ఫిర్యాదుపై తూతూమంత్రంగా కేసుపెట్టి పక్కన పడేయటమే కాకుండా టీడీపీ ముఖ్య నేతలపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

అజ్ఞాతంలోకి నిందితులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జూన్ చివర్లో దాడి కేసు ఫైళ్లు బయటకు తీశారు. ఆ కేసు నమోదులోనూ, దర్యాప్తులోనూ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో అప్పటి సీఐతో పాటు ఇద్దరు ఎస్ఐలను సస్పెండ్ చేశారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసును మంగళగిరి రూరల్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో కీలక నిందితులు అందరూ తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించారు. నిందితుడు నందిగం సురేష్‌ను గతనెల 5న హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఆయనను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. షరతులతో కూడిన బెయిల్ మంజూరైనప్పటికీ రాజధాని ప్రాంతంలో జరిగిన ఓ వృద్ధురాలి హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్న ఆయనను పోలీసులు పీటీ వారెంట్‌తో కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించింది. దీంతో ఆయన గుంటూరు జిల్లా జైల్లోనే రిమాండ్‌లో ఉన్నారు.

విచారణకు సహకరించని వైసీపీ నేతలు

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో పోలీసులు ప్రస్తుతానికి 106మందిని నిందితులుగా గుర్తించారు.. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, దేవినేని అవినాశ్, న్యాయవాది గవాస్కర్‌తో పాటు మరో ఎనిమిది మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపి తుది తీర్పు ఇచ్చేవరకు ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని, అప్పటి వరకు వారిని అరెస్టు నుంచి మినహాయించాలని సుప్రీంకోర్టు పోలీసులను ఆదేశించింది. పోలీసుల విచారణకు సహకరించాలని నిందితులకు స్పష్టం చేసింది. ఈ కేసులో 21న సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. అప్పిరెడ్డి, రఘురాం, అవినాశ్, గవాస్కర్ తదితరులకు మంగళగిరి రూరల్ పోలీసులు రెండు దఫాలు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిపించారు. అయితే విచారణలో పోలీసులకు వారే మాత్రం సహకరించలేదు. రిమాండ్‌లో ఉన్న నందిగం సురేష్ కూడా ఒక్కోసారి ఒక్కోరకమైన సమాధానం చెప్పారు. కాగా, 14న మరోసారి విచారణకు రావాలంటూ ఇప్పటికే పోలీసులు ఆయా నేతలకు నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం వారు మూడోసారి విచారణకు హాజరు కావాల్సి ఉంది. ఈ కేసులో ఇప్పటివరకు నందిగం సురేష్‌తో సహా 28 మందిని అరెస్ట్ చేశారు. మరో 79 మంది వరకు కింది కోర్టు, హైకోర్టులలో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్లు వేసి ఉన్నారు. వారి పిటిషన్‌లపై 16న వాదనలు ప్రారంభం కానున్నాయి. దాడి ఘటనలో అత్యంత కీలకంగా వ్యవహరించిన అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడు పానుగంటి చైతన్యతో పాటు మరొకరు పరారీలో ఉన్నారని, వారికోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.



టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకల దాడి(ఫైల్)

తెలియదు... గుర్తులేదు.. మర్చిపోయాం..

చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో తాడేపల్లిలోని ఆయన నివాసంపై జరిగిన దాడి కేసులో పోలీసులు ఇప్పటివరకు ప్రాథమికంగా 30 మందిని నిందితులుగా గుర్తించారు. ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు జోగి రమేశ్ సహా 11మంది ముందస్తు బెయిల్ కోసం కింది కోర్టుకు తర్వాత హైకోర్టుకు వెళ్లారు. అక్కడ చుక్కెదురు కావడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులోనూ తుది తీర్పు ఇచ్చేవరకు వారిని అరెస్టు చేయవద్దని, అయితే నిందితులు విచారణకు సహకరించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో జోగి రమేశ్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చి ఇప్పటికే విచారించారు. అయితే విచారణలో ఎన్ని ప్రశ్నలు అడిగినా 'తెలియదు, గుర్తులేదు, మర్చిపోయాం' అంటూ సమాధానాలు చెబుతూ విచారణకు సహకరించలేదు. మరోసారి విచారణకు రావాల్సిందిగా జోగితో పాటు మిగిలిన నిందితులకు పోలీసులు ఒకటి, రెండు రోజుల్లో నోటీసులు జారీచేసే అవకాశం ఉంది. ఈ కేసులో ఇంకా అనేక మంది నిందితులను గుర్తించాల్సి ఉందని పోలీసు అధికారులు తెలిపారు. చంద్రబాబు నివాసంపై దాడి ఘటనపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును నార్త్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ కేంద్ర కార్యాలయం, సీఎం చంద్రబాబు ఇంటిపై దాడి కేసుల దర్యాప్తును సీఐడీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రోజువారీ కేసుల దర్యాప్తు కారణంగా ఈ కేసుల విచారణపై పోలీసు అధికారులు దృష్టి సారించలేకపోతున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విచారణ వేగవంతానికి ఆ రెండు కేసులను సీఐడీకి బదిలీ చేశారు. ఇకనైనా దర్యాప్తు వేగం పుంజుకుంటుందో, లేదో వేచి చూడాలి.

నేటి నుంచి
'పల్లె పండుగ'!

20 వరకూ పంచాయతీ వారోత్సవాల నిర్వహణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల పాటు వైసీపీ విధ్వంస పాలన కొనసాగిన తర్వాత మొట్టమొదటసారిగా చేపట్టనున్న 'పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు 14న సోమవారం భూమి పూజ చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అన్నీ జిల్లాల్లో కలెక్టర్లు గ్రామసభల్లో ఆమోదించిన 30 వేల పనులకు సంబంధించి 3 వేల కి.మీ మేర సిమెంట్ రోడ్లకు ఇప్పటికే పరిపాలన అనుమతి మంజూరు చేశారు. సాంకేతిక ఆమోదం కోసం ఇంజనీర్లు అంచనాలు రూపొందిస్తున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పెనమలూరు నియోజకవర్గం కంకిపాడులో జరిగే భూమిపూజలో పాల్గొంటారు. అదే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించారు. సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు పంచాయతీ రాజ్‌శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. సిమెంట్ కొనుగోలుకు సంబంధించి ఒక్కో బస్తా రూ.270 చొప్పున స్థానిక మార్కెట్లలో కొనుగోలు చేసి వాడుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఆమోదించిన క్వారీల నుంచి సేకరించాలని పేర్కొంది. ప్రతి రోడ్డు పని వద్ద వర్క్‌సైట్ బోర్డు ఏర్పాటు చేయాలని, దానిపై ఆయా పనులకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలని సూచించింది. అన్ని పనులకు సంబంధించి పౌరసమాచార బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్లను జనవరి లోపు పూర్తి చేయాలని, వీటిని క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ విభాగం తనిఖీ చేస్తుందని మార్గదర్శకాల్లో తెలిపింది. రానున్న సంక్రాంతి నాటికి సిమెంట్ రోడ్లను ప్రారంభించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

భూమి పూజల్లో ఎమ్మెల్యేలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సిమెంట్ రోడ్ల భూమి పూజకు ఎమ్మెల్యేలు టూర్ షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 14 నుంచి 20 వరకు వారంతా ఆయా ప్రాంతాల్లో చేపట్టనున్న భూమి పూజల్లో నిమగ్నమవుతారు. సీఎం చంద్రబాబు కూడా ఎక్కడో ఒకచోట ఈ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంది. అయితే ఇంకా షెడ్యూలు ఖరారు కాలేదు. ఐదేళ్ల తర్వాత చేపట్టనున్న సిమెంట్ రోడ్ల భూమిపూజను ఒక పండుగలా ప్రారంభించాలని సర్కారు యోచిస్తోంది. ఉపాధి నిధులు అందుబాటులో ఉండటంతో బిల్లు చెల్లింపులకు ఢోకాలేదని తెలియడంతో పనులు చేపట్టేందుకు గ్రామాల్లో కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

మెటీరియల్ నిధుల సద్వినియోగం దిశగా

ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ నిధుల సద్వినియోగం ఐదేళ్ల తర్వాత ప్రారంభమవుతోంది. ఈ ఏడాదిలో రూ.3వేల కోట్ల నిధులతో 3 వేల కి.మీ. సిమెంట్ రోడ్లు , 500 కి.మీ. తారు రోడ్ల నిర్మాణం, 22 వేల మినీ గోకులాలతో పాటు పలు వ్యక్తిగత ఆస్తులను పేదలకు కల్పించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ఉపాధి పథకం మెటీరియల్ నిధులు విస్తృతంగా వినియోగించుకొనేవారు. వైసీపీ సర్కారు వచ్చిన తర్వాత ఉపాధి పథకం స్ఫూర్తిని దెబ్బతీయడంతో పాటు మెటీరియల్ నిధులు వాడుకోవడంలో విఫలమైంది. గత చంద్రబాబు ప్రభుత్వం సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లతో పాటు పలు సాగు, తాగునీటి వనరుల కల్పనకు ఈ నిధులను వాడి సద్వినియోగం చేసుకుంది. అయితే వైసీపీ హయాంలో మొదటి ఏడాది సరైన ప్రణాళికలు లేక నిధులు వృథా అయ్యాయి. ఆ తర్వాత జగనన్న కాలనీల లెవలింగ్ పనులంటూ కొండల్లో, చెరువుల్లో మట్టి పోసి వైసీపీ కార్యకర్తలకు అప్పనంగా నిధులు దోచిపెట్టారు. అలాగే సచివాలయ భవనాల నిర్మాణాలు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రూ.వేల కోట్ల ఉపాధి నిధులను దుర్వినియోగమయ్యాయి.

ఐదేళ్ల తర్వాత రోడ్ల నిర్మాణం

రాష్ట్రంలో గత టీడీపీ హయాంలో వేసిన రోడ్లు తప్ప ఐదేళ్లలో ఎక్కడా ఒక్క రోడ్డు నిర్మాణం కూడా జరగలేదు. గ్రామీణ రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో అయితే ఏకంగా కొన్ని రోడ్లు మాయమయ్యాయి. గతంలో వేసిన తారు రోడ్లు నిర్వహణకు నోచుకోకపోవడంతో వాటిపై కంకర, తారు క్రమంగా కనుమరుగయ్యాయి. ఆ రోడ్లపై వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో బస్సు సర్వీసులు నిలిపివేశారు. ఒకప్పుడు నడక దారిగా ఉన్న రోడ్లను అప్పటి టీడీపీ సర్కారు తారురోడ్లుగా మారిస్తే.. వైసీపీ పాలనలో అవి మళ్లీ నడక దారులుగా మారిపోయాయి. పంచాయతీరాజ్ రోడ్ల మీద కనీసం మట్టి పోసి మరమ్మతులు చేసిన దాఖలాల్లేవు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల ముందు రోడ్ల నిర్మాణాలు చేపడతామని హడావుడి చేసిన వైసీపీ ప్రభుత్వం... రోడ్ల పనులకు టెండర్లు ఖరారు చేసింది. సుమారు రూ.100 కోట్ల మేర పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. అందులో రూ.25కోట్ల మేర చేపట్టిన పనులకు కూడా బిల్లులివ్వక పోవడంతో వారు పనులు నిలిపేశారు. చివరకు కోర్టుకు వెళ్లి బిల్లులు వసూలు చేసుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు పిలిచినా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది.

వైసీపీకి రాపాక బైబై

- పార్టీని వీడిన రాజోలు మాజీ ఎమ్మెల్యే
- ప్రస్తుతం ఏ పార్టీలో చేరడంలేదని ప్రకటన
- ఒక్కొక్కరుగా వైసీపీని వీడుతుంటే ముఖ్యనేతల్లో కలవరం



అమరావతి, మలికిపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల తర్వాత వైసీపీకి షాక్ మీద షాక్ తగులుతోంది. ఆపార్టీకి దళిత నేత, అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రాజీనామా చేశారు. వైసీపీని వీడుతున్నట్లుగా ఆదివారం ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని వైసీపీ అధిష్టానానికి చెప్పానన్నారు. తాను ప్రస్తుతం ఏ పార్టీలోను చేరడంలేదని తన అనుచరులతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. తనను దుర్భాషలాడిన వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి తనను అవమానపర్చారన్నారు. అమలాపురం ఎంపీ టికెట్‌పై తనకు ఆసక్తిలేకపోయినా బలవంతంచేసి పంపించారని, ఓడిపోతానని తెలిసినా వెళ్లానన్నారు. 2019 ఎన్నికల్లో జనసేన నుంచి గెలిచాక రాపాక వైసీపీకి దగ్గరగా మెలిగారు. తెలుగుదేశం పార్టీ కూడా పిలిచే అవకాశం లేనందున ఆయనకు ఇక కాంగ్రెస్ పార్టీయే ఆప్షన్‌గా ఉందని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారు

పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శాసనసభ నియోజకవర్గాల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్న సమయంలోనే బడుగు బలహీన వర్గాలకు చెందిన నేతలు పార్టీని వీడుతుండటం గమనార్హం. జగన్ తమను మోసం చేశాడంటూ పలువురు నేతలు విమర్శిస్తున్నారు. బలహీన వర్గాలకు చెందిన నేతలు మోపిదేవి వెంకట రమణారావు, ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు రాజ్యసభ సభ్యత్వాలకు, ఎమ్మెల్సీ పదవులకు కర్రి పద్మశ్రీ, కల్యాణ చక్రవర్తి రాజీనామా చేసి పార్టీని వీడారు.

బ్లాక్‌మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు

- నిత్యావసరాల ధరలపై నిరంతర పర్యవేక్షణ: చంద్రబాబు
- విజిలెన్స్ క్రియాశీలం కావాలి.. ప్రజలకు ఉపశమనం కలిగించాలి
- పామాయిల్, పప్పుధాన్యాలు, కూరగాయల ఉత్పత్తులు పెంచేందుకు ప్రణాళిక
- గిడ్డంగులు భారీగా అందుబాటులోకి తేవాలి
- సీఎం ఆదేశం.. మంత్రులు, అధికారులతో సమీక్ష



పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారి బుడితి రాజశేఖర్

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అన్ని చర్యలూ తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విజిలెన్స్ విభాగం క్రియాశీలంగా పని చేయాలన్నారు. వ్యాపారులు కూడా సహకరించేలా చూసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకు జనంపై భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. శనివారమిక్కడ ఉండవల్లిలోని తన నివాసంలో పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలపై ఆయన మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధరల నియంత్రణకు చేపట్టిన చర్యలేమిటో ఆరా తీశారు. డిమాండ్-సరఫరా మధ్య వ్యత్యాసానికి గల కారణాలను విశ్లేషించాలని అధికారులకు సూచించారు. ధరలు పెరిగిన తర్వాత తగ్గించే ప్రయత్నం చేయడం, సబ్సిడీలు అందించడం కంటే.. నిరంతర పర్యవేక్షణతో ధరల పెరుగుదలను ముందుగానే పసిగట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో తాత్కాలికంగా, దీర్ఘకాలంగా చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ మూడు శాఖలూ సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. 'రాష్ట్రంలో పామాయిల్, పప్పుధాన్యాలు, కూరగాయల వంటి ఉత్పత్తులు పెంచేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలి. పెద్దఎత్తున గిడ్డంగులను అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు, వినియోగదారులకు న్యాయం చేయాలి. ధరల నియంత్రణకు సంబంధించి ప్రజలకు ఉపశమనం కల్పించేలా చర్యలు ఉంటేనే వారు హర్షిస్తారు. ఆ స్థాయిలో అధికారులు ప్రణాళికలు అమలు చేయాలి' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రైతుబజార్లలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఏ వస్తువును ఎంతకు విక్రయిస్తోందీ అధికారులు వివరించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె, కందిపప్పు, టమాటా, ఉల్లిపాయలను మార్కెట్ ధర కంటే రూ.10-15 తక్కువకు అమ్ముతున్నట్లు తెలిపారు. సమీక్షలో పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, ఆన్‌లైన్ ద్వారా వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ పాల్గొన్నారు.

భేష్.. బాగా చేశారు!

తిరుమల బ్రహ్మోత్సవాలు.. దుర్గమ్మ ఉత్సవాలపై అధికారులకు చంద్రబాబు ప్రశంస

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈసారి తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాలు, బెజవాడ దుర్గమ్మ దసరా మహోత్సవాలను బ్రహ్మాండంగా చేశారని సీఎం చంద్రబాబు అధికారులను ప్రశంసించారు. గతంతో పోలిస్తే ఈసారి ఈ ఉత్సవాల నిర్వహణ బాగుందని, తేడా చూపించారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'తిరుమలలో ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనందం కలిగించింది. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసిన టీటీడీకి అభినందనలు. తిరుమలలో ఏటా మొత్తం 450 ఉత్సవాలు జరుగుతాయి. వీటన్నింటిలోకి బ్రహ్మోత్సవాలు ప్రత్యేకం. ఈసారి ఆరు లక్షల మంది భక్తులు శ్రీవారి మూల విరాట్ దర్శనం చేసుకున్నారు. వాహన సేవల్లో 15 లక్షల మంది పాల్గొన్నారు. 26 లక్షల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. నిరుడు ఇవే ఉత్సవాల్లో అన్న ప్రసాదం స్వీకరించిన వారి సంఖ్య 16 లక్షలు. ఉత్సవాలను తిలకించడానికి ఈసారి ప్రత్యేకంగా డిజిటల్ తెరలు ఏర్పాటు చేశారు. మిరుమిట్లుగొల్పేలా దీపాలంకరణ చేశారు. బ్రహ్మోత్సవాల వైభవం మరింత పెరిగేలా ఏర్పాట్లు జరిగాయి' అని మెచ్చుకున్నారు. ఇంద్ర కీలాద్రిపై బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు ఈసారి మరింత వైభవంగా జరిగాయన్నారు.

నేడే లాటరీ

(మొదటి పేజీ తరువాయి)

కోసం 120దరఖాస్తులు అందాయి. ఇదో రికార్డు! పలు జిల్లాల్లో అనేక షాపులకు 70కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇక స్వయంగా సీఎం హెచ్చరించినా తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో రాజకీయ జోక్యం ఆగలేదు. ఫలితంగా ఈ జిల్లాల్లో ఆశించిన దానికంటే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఇక్కడ ఒక్కో షాపునకు 17 మంది మాత్రమే పోటీలో ఉన్నారు. సిండికేట్లుగా ఏర్పడి తక్కువ దరఖాస్తులు వేసి.. పోటీని తగ్గించుకున్నారు. బాపట్ల, అన్నమయ్య ప్రకాశం జిల్లాల్లోనూ అనేక షాపులకు సింగిల్ డిజిట్ దరఖాస్తులే వచ్చాయి.

నేడు లాటరీ..

మద్యం షాపులకు సోమవారం జిల్లాల్లో లాటరీ నిర్వహిస్తారు. కలెక్టర్ల సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రతి దుకాణానికి వేర్వేరుగా లాటరీ తీసి, ఎంపికైన వారికి లైసెన్స్ పత్రాలు అందజేస్తారు. ఉదయం నుంచే లాటరీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నూతన మద్యం పాలసీతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చిపడింది. ఒక్క దరఖాస్తుల రూపంలోనే రూ.1797.64 కోట్ల ఆదాయం వచ్చింది. సోమవారం లాటరీలో షాప్ దక్కించుకున్న 24గంటల్లోపు మొదటి విడత లైసెన్స్ రుసుము చెల్లించాలి. తద్వారా సుమారు రూ.300 కోట్లు వస్తాయి. వీరు బుధవారం (ఈ నెల 16) నుంచి షాపులు ప్రారంభించుకోవచ్చు. ఆ సమయంలో లైసెన్సీలు కనీసం వారం రోజుల సరుకు కొనుగోలు చేస్తారు. ఆ రూపంలో మరో రూ.300 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. మొత్తంగా నూతన పాలసీ ప్రారంభ దశలోనే ప్రభుత్వానికి రూ.2400 కోట్ల ఆదాయం సమకూరుతుంది.

జిల్లాల వారీగా దరఖాస్తులు ఇవీ

జిల్లా	షాపులు	దరఖాస్తులు
తిరుపతి	227	3920
శ్రీసత్యసాయి	87	1518
బాపట్ల	117	2149
అన్నమయ్య	111	2160
ప్రకాశం	171	3466
పల్నాడు	129	2639
నంద్యాల	105	2221
నెల్లూరు	182	3890
కాకినాడ	1555	3332
చిత్తూరు	104	2266
కడప	139	3257
కృష్ణా	123	2942
అనంతపురం	136	3265
అనకాపల్లి	136	3291
విశాఖపట్నం	155	4139
మన్యం	52	1393
శ్రీకాకుళం	158	4671
ఏఎస్ఆర్	40	1205
కోనసీమ	133	4087
కర్నూలు	99	3046
పశ్చిమగోదావరి	175	5628
విజయనగరం	153	5241
గుంటూరు	127	4448
తూర్పుగోదావరి	125	4384
ఏలూరు	144	5499
ఎన్టీఆర్	113	5825
మొత్తం	**3396**	**89882**

టోల్ గేట్లు కిటకిట!

(మొదటి పేజీ తరువాయి)

బస్సులతో జాతీయ రహదారులు పోటెత్తాయి. టోల్ గేట్ల వద్ద వేల వాహనాలు కిక్కిరిశాయి. ఫలితంగా పలు చోట్ల కిలోమీటరు నుంచి 3 కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ స్తంభించింది. పలు టోల్ ప్లాజాల వద్ద అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినా వాహనాల రద్దీ మరీ ఎక్కువగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ-హైదరాబాద్ (65వ నంబర్) జాతీయ రహదారిపై ఉదయం నుంచే వాహనాల రాకపోకలు పెరిగాయి. సాయంత్రానికి భారీ సంఖ్యలో పెరిగిపోయాయి. కీసర, చిల్లకల్లు, కొర్లపహాడ్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సాధారణ రోజుల్లో 30-35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని.. ఆదివారం సాయంత్రానికే 50 వేలకు పైగా వచ్చాయని పంతంగి టోల్‌గేట్ నిర్వాహకులు తెలిపారు. ఇంకోవైపు.. హైదరాబాద్‌వాసులు పెద్దసంఖ్యలో స్వస్థలాలకు వెళ్లడంతో నగరం ఆదివారం వరకు బోసిపోయింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలు సోమవారం నుంచే తిరిగి ప్రారంభం కానుండడంతో వాటిలో పనిచేసే ఉద్యోగులు చాలామటుకు ఆదివారం అర్ధరాత్రికే చేరుకున్నారు. విద్యాసంస్థలు మంగళవారం తెరుచుకోనున్నాయి.

(మొదటి పేజీ తరువాయి)

నియమితుడయ్యాడు. ఎంత వేగంగా ఎదిగాడో అంతే వేగంగా సీబీఐ, ఈడీలకు దొరికిపోయాడు. సీబీఐ అధికారులతోనే లాబీయింగ్ చేసిన ఘన చరిత్ర ఈయనది. బడాబాబులు ఇరుక్కున్న హై ప్రొఫైల్ కేసుల్లోకి దూరి.. నిందితుల తరఫున సీబీఐ అధికారులకు సొమ్ములు ఎరవేసిన నేపథ్యం ఉంది. ఈ క్రమంలో ఓ సీబీఐ ఉన్నతాధికారి భారీగా లంచం పుచ్చుకున్నట్లు ఆయనే ఆరోపణలు చేశాడు. తర్వాత ఆయన్ను అరెస్టు చేసి విచారణ జరపగా.. మనీలాండరింగ్, లంచం కేసులో అతనే ప్రధాన నిందితుడని సీబీఐ తేల్చింది. 2019లో ఇద్దరు సీబీఐ అధికారులు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుని వీధిన పడిన విషయం గుర్తుందా? ఈ రచ్చలో అతనే ప్రధాన పాత్రధారి అని జాతీయ మీడియా కోడై కూసింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ ఈయన్ను అరెస్టు చేసి జైలుకు కూడా పంపించింది.

రాజకీయ రంగ ప్రవేశం

సీబీఐ, ఈడీ కేసుల్లో అరెస్టు కావడంతో లాబీయింగ్ బిజినెస్ తగ్గిపోయింది. బడా కంపెనీలు అతడిని పక్కన పెట్టేశాయి. దీంతో.. ఖద్దరు తొడగాలని నిర్ణయించుకున్నాడు. తాజా ఎన్నికలకు ముందు క్రియాశీల రాజకీయాల్లోకి దూరి.. ప్రజాప్రతినిధిగా అవతరించేందుకు అనేక ప్రయత్నాలు చేశాడు. ఆయన గత చరిత్రను చూసి.. 'వామ్మో ఇంతటి ఘనుడా!' అని విస్తుపోయి తలుపులు మూసేశాయి. అంతటితో అతని కథ ముగిసిందని అంతా అనుకున్నారు. కానీ.. కూటమి సర్కారు కొలువు తీరిన తర్వాత తన పవర్ చూపించడం మొదలుపెట్టాడు.

చానా ముదురు!

మైనింగ్‌తో మొదలుపెట్టి...

కూటమి సర్కారులో 'నేనే సూపర్ పవర్' అని చెప్పుకొంటున్న ఆ వ్యక్తి తొలుత మైనింగ్ వ్యవహారాల్లో అడుగు పెట్టాడు. ఉభయ గోదావరి, విశాఖ, విజయనగరం జిల్లాల పరిధిలో మైనింగ్ వ్యవహారాలను గుప్పిట పట్టాడు. ఒక దశలో ఆయన విజయవాడలోని ఓ హోటల్‌లో మైనింగ్ అధికారులు, లాటరైట్, బాక్సైట్, గ్రావెల్ మైనింగ్ చేసే లీజుదారులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. 'ఇప్పుడు మైనింగ్ అంతా నేనే చూసుకుంటున్నా. ఎవరికి ఏ పోస్టు కావాలన్నా, ఎవరికి ఏ మైన్ కావాలన్నా నన్నే సంప్రదించండి' అని సూటిగా చెప్పినట్లు సమాచారం. తనవి ఉత్తుత్తి మాటలు కావంటూ.. కొన్ని ఆధారాలు కూడా ప్రదర్శించినట్లు తెలిసింది. అప్పటికి కూటమి సర్కారు కొలువు తీరి నెలరోజులు కూడా కాలేదు. 'ఏమిటీ మీటింగ్‌లు, సెటిల్‌మెంట్లు?' అని ప్రభుత్వ పెద్దలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయన వెనక్కి తగ్గాడు. ఈలోపు.. క్రికెట్‌లో వేలు పెట్టాడు. ఆంధ్రా క్రికెట్ సంఘంలో కీలక పదవి దక్కించుకున్నాడు.

కొన్నాళ్లు సైలెంట్‌గా ఉండి..

సుమారు మూడు నెలలపాటు పాటు సైలెంట్‌గా ఉన్న ఆ ఘటికుడు మళ్లీ రంగంలోకి దిగాడు. మైనింగ్, అటవీ, రెవెన్యూ అధికారుల (డిప్యూటీ కలెక్టర్) బదిలీల్లో ఆయన చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. తనకు కీలకమైన ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖ, విజయనగరం పరిధిలో ఆయా శాఖల్లో తనకు నమ్మకస్తులైన వారిని కీలక స్థానాల్లో కూర్చోబెట్టినట్లు పార్టీ వర్గాలే చెబుతున్నాయి. కాకినాడలో మైనింగ్, అటవీ అధికారులకు ఈయన సిఫారసు మేరకే పోస్టింగ్ ఇచ్చారని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో బాగా విలువైన లేటరైట్ నిల్వలున్నాయి. ఇప్పటికే పలు లీజుదారులు మైనింగ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంపై పట్టుకోసం ఆయన ఎంతగానో ప్రయత్నిస్తున్నాడు. ఇప్పుడు తనకు అనుకూలమైన అధికారులకు పోస్టింగ్ ఇప్పించి... అనుకున్నది సాధించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

పార్టీ నేతల్లో ఆందోళన

ప్రస్తుతం ఆ ఘటికుడు తెలుగుదేశం పార్టీలో ఉన్నాడా? లేడా? ఉంటే ఏ పదవిలో ఉన్నాడు? లేకుంటే, ఆయనకు ఎందుకంత ప్రాధాన్యం లభిస్తోంది? ఉంటే మాత్రం ఇంత అడ్డగోలు వ్యక్తిని ఎందుకు వదిలేస్తున్నారు? అని టీడీపీ సీనియర్ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నేరుగా మంత్రులు, అధికారులకు ఫోన్‌లు చేయడం, పనులు చేసి పెట్టాలని ఆదేశించడమేమిటి? దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా? అని ఓ సీనియర్ నేత ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీలో గతంలో ఎప్పుడూ ఇలాంటి సంస్కృతి లేదని ఓ మాజీ మంత్రి పేర్కొన్నారు.

లోకేశ్ పేరు వాడుకుంటూ...

'మంత్రి లోకేశ్‌కు నేను ఎంత చెబితే అంత' అంటూ ఆ ఘనుడు రెచ్చిపోతున్నట్లు తెలిసింది. 'బిల్లులు ఇప్పిస్తా రండి!' అని నేరుగా ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, విద్యుత్ కాంట్రాక్టర్లు, కంపెనీల ప్రతినిధులతో బేరసారాలు నడుపుతున్నాడని పార్టీకి ఇప్పటికే ఫిర్యాదులు వచ్చాయి. 'ఇదిగో లోకేశ్‌తో మాట్లాడాను. సీఎం కార్యాలయంలోని కీలక ఆఫీసర్‌తో టచ్‌లో ఉన్నాను' అని చెప్పుకొంటూ తన పవర్ ప్రదర్శిస్తున్నాడని సమాచారం!

పోలవరం పనుల్లో కదలిక!

- కేంద్రం అడ్వాన్సుతో జలవనరుల శాఖలో ధీమా
- డయాఫ్రం వాల్ నిర్మాణంపై మేఘా-బావర్ మధ్య ఒప్పందం
- 6-10 తేదీల్లో ప్రాజెక్టు వద్ద వర్క్‌షాపు
- నేడు అధికారులతో మంత్రి నిమ్మల సమీక్ష

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులు త్వరలోనే ఊపందుకోనున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలివిడతగా రాష్ట్రానికి రూ.2,424 కోట్లు అడ్వాన్సుగా ఇవ్వాలని కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయించడంతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయినట్లేనని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. నవంబరులో పనులు ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. ఈ అంశంపై సోమవారం జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులతో సమీక్షించనున్నారు. చేపట్టాల్సిన పనులపై తన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం చీఫ్ ఇంజనీరు నరసింహమూర్తి తదితరులతో చర్చిస్తారు. అనంతరం ఆ వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తారు. ఇంకోవైపు.. డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం తదితర నిర్మాణాలు, ఇతర పనుల డిజైన్లపై నిపుణుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు వచ్చే నెల ఆరో తేదీ నుంచి పదో తేదీ దాకా ప్రాజెక్టు వద్ద వర్క్‌షాపు నిర్వహించనున్నారు. కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జల సంఘం అధికారులు హాజరవుతారు. అమెరికాకు చెందిన నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ కూడా రానున్నారు. వీరు ప్రాజెక్టు క్షేత్రానికి నవంబరు 1కల్లా చేరుకునే అవకాశాలున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఆ సరికి పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) బృందం కూడా వస్తుంది. డయాఫ్రం వాల్ పనులకు సంబంధించిన డిజైన్లను పరిశీలించి కేంద్ర జల సంఘానికి అందజేస్తుంది. ఇక డయాఫ్రం వాల్ నిర్మాణంలో విశేషానుభవం ఉన్న జర్మనీ సంస్థ బావర్‌తో ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ మేఘా ఇంజనీరింగ్ మధ్య తాజాగా అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7,200 కోట్లు ముందస్తుగా ఇవ్వాలని కేంద్రాన్ని రాష్ట్రం అభ్యర్థించింది. ఎట్టకేలకు ఈ నెల 9న రూ.2,424 కోట్లు (ఇందులో రూ.2,348 కోట్లు అడ్వాన్సు) విడుదల చేస్తూ కేంద్ర జలశక్తి శాఖ అధికారికంగా మెమో విడుదల చేసింది. దీంతో రాష్ట్ర జల వనరుల శాఖలో ఒక్కసారిగా ధీమా వచ్చింది.

అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్

- శ్రీసత్యసాయి జిల్లాలో దారుణం
- బాధితులు వలస కార్మికులు
- పోలీసుల అదుపులో ఐదుగురు?
- నిందితుల్లో పాతనేరస్థులు, మైనర్లు?
- ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్
- ఎస్పీకి ఫోన్.. కఠిన చర్యలకు ఆదేశం

అమరావతి(ఆంధ్రజ్యోతి), హిందూపురం/చిలమత్తూరు, అక్టోబరు 13: పొట్టకూటి కోసం వచ్చిన వలస కూలీలపై అర్ధరాత్రి మానవ మృగాలు విరుచుకుపడ్డాయి. నిర్మాణంలో ఉన్న పేపర్ మిల్లులో పనిచేస్తున్న వాచ్‌మన్ కుటుంబానికి చెందిన అత్తాకోడలిపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టాయి. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో శుక్రవారం జరిగిందీ దారుణం. కర్ణాటకలోని బళ్లారికి చెందిన వ్యక్తి ఐదు నెలల క్రితం చిలమత్తూరు మండలంలో పొలాల వద్ద నిర్మాణంలో ఉన్న పేపర్ మిల్లులో వాచ్‌మన్‌గా చేరాడు. ఆ పక్కనే ఉన్న రేకుల షెడ్డులో ఆయనతోపాటు భార్య, కుమారుడు, కోడలు నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి


ఘటనా స్థలంలో నిందితులు పడేసి వెళ్లిన కత్తి, మాస్క్

2 గంటల సమయంలో మూడు ద్విచక్రవాహనాలపై ఆరుగురు దుండగులు ఆ భవనం వద్దకు వచ్చి వాచ్‌మన్‌ను తాగడానికి నీరు అడిగారు. తొట్టెలో ఉన్నాయని చెప్పడంతో వాచ్‌మన్ కుటుంబం నివసిస్తున్న రేకుల షెడ్డువైపు వెళ్లారు. సీసీ కెమేరాలున్నాయని వాచ్‌మన్ చెప్పడంతో దుండగులు వాటిని ధ్వంసం చేశారు. ఆ అలికిడికి వాచ్‌మెన్ భార్య, కుమారుడు, కోడలు బయటికి వచ్చారు. దుండగులు ఆ ఇద్దరు మహిళలపై అఘాయిత్యానికి ప్రయత్నించగా వాచ్‌మన్, అతని కుమారుడు ప్రతిఘటించారు. దీంతో వారిపై దాడి చేశారు. అక్కడున్న కత్తి తీసుకుని బెదిరించడంతో తండ్రీకొడుకు నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. దుండగులు ఆ ఇద్దరినీ బయటికి గెంటేసి, అత్తాకోడలిని రెండు వేర్వేరు రేకుల షెడ్లలోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఏడాదిన్నర వయసున్న చిన్నారి బోరున విలపిస్తున్నా పట్టించుకోలేదు. గంటన్నరపాటు అక్కడే ఉన్న దుండగులు తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. వాచ్‌మన్ కుమారుడు సమీపంలోని గ్రామానికి వెళ్లి ఆ గ్రామస్థుల ఫోన్ ద్వారా పరిశ్రమ యజమానికి జరిగిన ఘోరం గురించి చెప్పగా, ఆయన పోలీసులకు తెలియజేశారు. జిల్లా ఎస్పీ రత్న శనివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. బాధిత మహిళలను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

24 గంటల్లోనే అదుపులోకి నిందితులు?

అత్యాచారం జరిగిన 24 గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. దుండగులను పట్టుకునేందుకు ఎస్పీ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రానికే నిందితుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితుల్లో ముగ్గురు పాత నేరస్థులు, వారిలో ఒకరు అంతర్రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితుల్లో ముగ్గురు మైనర్లు కూడా ఉన్నట్లు సమాచారం. వీరు చోరీ చేసేందుకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు విచారణలో ఒప్పుకొన్నట్టు తెలిసింది.

బాధితులకు అండగా ప్రభుత్వం: సీఎం

ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సీఎం చంద్రబాబు జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని, నిందితులను వెంటనే పట్టుకుని, కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, వారిలో భరోసా నింపాలని ఎస్పీని ఆదేశించారు. హోంమంత్రి అనిత కూడా జిల్లా ఎస్పీతో మాట్లాడి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ బాధితులను ఫోన్‌లో పరామర్శించారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఉనికి కోసమే వైసీపీ విమర్శలు: మంత్రి సవిత



హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అత్యాచార బాధిత మహిళలను బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆస్పత్రి బయట మంత్రి సవిత విలేకరులతో మాట్లాడుతూ... గ్యాంగ్‌రేప్‌పై సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, ఎస్పీ వేగవంతంగా స్పందించారన్నారు. 24 గంటలు తిరక్కుండానే నిందితులను పోలీసులు గుర్తించారని తెలిపారు. పోలీసులు స్పందిస్తున్నది వైసీపీ నాయకుల కళ్లకు కనబడలేదా? అని మండిపడ్డారు. ఉనికి కోసం వైసీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

డీజే సౌండ్‌కు ఆగిన గుండె


సాయివినయ్

- డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిన యువకుడు
- కోనసీమ జిల్లాలో దసరా ఉత్సవాల్లో అపశ్రుతి

అమలాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో వేడుక ఏదైనా డీజే ఉండాల్సిందే..! గుండెలు దద్దరిల్లే సౌండ్‌తో కుర్రకారు ఊగాల్సిందే..! అయితే ఈ డీజే సౌండ్ దెబ్బకు గుండెలు ఆగి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మొన్నామధ్య.. బిహార్‌లో డీజే సౌండ్ దెబ్బకు వరుడు పెళ్లి మండపంలోనే ప్రాణాలు విడవగా.. తాజాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనూ ఓ యువకుడు డీజే వద్ద డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోయాడు. దసరా పండుగ సందర్భంగా శనివారం రాత్రి కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలోని కొంకాపల్లిలో చెడీతాలింఖానా ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజే ఏర్పాటు చేశారు. గుండెలదిరేలా సౌండ్ వస్తున్న డీజే వద్ద డ్యాన్స్ చేస్తున్న అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామానికి చెందిన పప్పుల సాయివినయ్ (22) ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. అతన్ని వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. సాయివినయ్ బీటెక్ పూర్తిచేశాడు. ఈ నెల 16న హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. ఇంతలో మృత్యువాతపడటంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఇంద్రకీలాద్రిపై ముగిసిన దసరా ఉత్సవాలు

శాఖల సమన్వయంతో దసరా ఉత్సవాలు విజయవంతం

కలెక్టర్ సృజన ఆలోచనలు, సీపీ రాజశేఖర్ మార్గదర్శకత్వం, ఈవో రామారావు నిరంతర కృషి



క్యూలైన్లలో భక్తులను దసరా ఏర్పాట్ల పై ఆరా తీస్తున్న కలెక్టర్ సృజన

వన్‌టౌన్, అక్టోబరు 13: ఇంద్రకీలాద్రిపై ఈనెల 3 నుంచి 10 రోజుల పాటు నిర్వహించిన కనకదుర్గమ్మ దసరా మహోత్సవాలు 12వ తేదీతో ముగిశాయి. మరోవైపు భవానీదీక్షాదారులు 13న ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వాస్తవంగా 12నే దసరా మహోత్సవాలు సాంకేతికంగా ముగుస్తాయన్నప్పటికీ ఈనెల 15 వరకు భవానీదీక్షాదారులు పెద్ద సంఖ్యలో తరలివస్తారన్న కారణంగా ముందుగానే కలెక్టర్ సృజన సృజనాత్మకతతో ఆలోచనలు చేసి 15 వరకు అన్ని విభాగాల అధికారులు మూడు షిఫ్టుల్లో పనిచేయాలని, దసరా ఉత్సవాల ప్రారంభానికి ముందు తెలిపారు. దీనికితోడు సీపీ రాజశేఖర్ పోలీసు సిబ్బందికి దసరా ఉత్సవాల నిర్వహణలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా విధులు నిర్వహించాలని మార్గదర్శనం చేశారు. ప్రధానంగా ఈవో రామారావు గత ఏడాది దసరా ఉత్సవాల ప్రారంభంలో దుర్గగుడికి బదిలీ అయి వచ్చారు. కొత్తగా వచ్చినా అప్పటి పరిస్థితులను ఆకళింపజేసుకుని దసరా ఉత్సవాల సమయంలో దుర్గగుడిలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయన్నదానిపై అధ్యయనం చేసి ముందస్తుగానే అన్ని జాగ్రత్తలపై దృష్టి పెట్టి అధికారులను సమన్వయం చేసుకుంటూ దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికను రూపొందించుకున్నారు. ఇంకోవైపు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ విచ్చేసి దసరా ఉత్సవాల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా చూడాలన్న సీఎం ఆదేశాలతో దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సూచనలు చేశారు. అధికారులను పూర్తిస్థాయిలో నిమగ్నం చేయటంతో ఈ 10 రోజులు దసరా ఉత్సవాలు విజయవంతం చేయడంలో కృతకృత్యులయ్యారు. కలెక్టర్ సృజన సమన్వయ సమావేశాలు నిర్వహించి ప్రతి అంశంలోనూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దీంతో పాటు ప్రత్యక్ష, పర్యవేక్షణ చేస్తూ, తగు సూచనలు చేస్తూ, అవసరమైనప్పుడు కొండపైకి వచ్చి సూచనలు చేయటంతో భక్తులకు సజావుగా దర్శనాలు లభించేలా చూశారు. పోలీసులు యూనిఫాం వేసుకుని దర్శనాల పేరిట చేసే అత్యుత్సాహానికి చాలా వరకు అడ్డుకట్ట వేశారు. ఎవరినీ కూడా అడ్డమార్గాల్లో దర్శనాలకు పంపించవద్దంటూ పోలీస్ కమిషనర్ ముందుగానే అధికారుల సమావేశంలో తెలిపారు. శనివారం విజయదశమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున భవానీదీక్షాదారులు రావటంతో ఇంద్రకీలాద్రి అరుణ వర్ణమైంది. దీంతో భవానీలను నియంత్రించేందుకు పోలీసులు కష్టపడాల్సి వచ్చింది. ఈ.ఓ రామారావు కార్యసాధకుడిగా నిరంతరం శ్రమించారు. ప్రముఖ దేవాలయాల నుంచి అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకువచ్చిన సందర్భంలో ఆయా దేవాలయాలకు చెందిన ఈవోలు, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌లు, అధికారులకు అందించాల్సిన మర్యాదల్లో చక్కటి సమన్వయంతో వ్యవహరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ప్రత్యేకాధికారి రామచంద్ర మోహన్ తగు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా దసరా ఉత్సవాలను గుర్తించటంతో వీఎంసీ అనేక కార్యక్రమాలను చక్కని సమన్వయంతో నిర్వహించింది. కమిషనర్ ధ్యానచంద్ర క్షేత్రస్థాయిలో పర్యటించి కంట్రోల్ రూమ్ నుంచి అన్ని విషయాలను పరిశీలిస్తూ చర్యలు తీసుకున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే దసరా ఉత్సవాలు రావటంతో క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో కలెక్టర్ సృజన తన బాధ్యతగా చక్కటి ప్రణాళికతో ఇది ఒక మంచి అవకాశంగా భావించి చర్యలు తీసుకున్నారు. మొత్తానికి రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖ, మునిసిపల్ కార్పొరేషన్, ఫైర్, విద్యుత్, జలవనరుల శాఖ, ఇంకా తదితర శాఖల సమన్వయంతో వ్యవహరించటం ఈసారి హైలెట్‌గా నిలిచింది.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి

వత్సవాయి, అక్టోబరు 13 : చిన్నకల్లు నుంచి వైరా వెళ్ళే రహదారిపై చిట్యాల వద్ద ఎదురెదురుగా బైకులు ఢీకొన్న సంఘటనలో ఒకవ్యక్తి శనివారం మృతిచెందారు. సేకరించిన సమాచారం మేరకు వత్సవాయి గ్రామానికి చెందిన లారీడ్రైవర్ యానం వెంకటేశ్వర్లు(35) డ్యూటీ కోసం తన ద్విచక్ర వాహనంపై వత్సవాయి నుంచి జగ్గయ్యపేట వెళుతుండగా చిట్యాల వద్ద ఎదురుగా వస్తున్న మరోబైక్ బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరోబైక్‌పై వస్తున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. వత్సవాయి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తి గల్లంతు

జగ్గయ్యపేట రూరల్: మండలంలోని రావిరాలలో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఆలూరి సత్యనారాయణ కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లే క్రమంలో పులిచింతల ప్రాజెక్టు వద్ద బుధవారం ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు. మూ డు రోజుల అనంతరం లభ్యమైన మృతదేహాన్ని పో స్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిపందేల శిబిరాలపై దాడులు

ఇబ్రహీంపట్నం: దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరాలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. రాయనపాడు, జూపూడి చినలంకలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన పందెంరాయుళ్ళు శిబిరం నుంచి పరారయ్యారు. పందెంరాయుళ్లు వదిలివెళ్ళిన 20 బైకులను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బైక్ యజమానులపై కేసులు నమోదు చేశారు.

దాడిలో గాయాలు

పెడన రూరల్ : బొల్లా భాగ్యలక్ష్మి, తన కుమారునితో కలిసి కొంకేపూడి నుంచి బైరాగిపాలెం తిరిగి వెళుతున్న సమయంలో బంటుమిల్లి రోడ్డు సెంటర్ వద్ద నాంచారయ్య, శివ , ప్రసన్న, వెంకటేశ్వరరావు దాడిచేశారు. తలకు తీవ్రమైన గాయాలు కావటంతో బందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎసై సత్యన్నారాయణ తెలిపారు.

‘పండుగ’ పేరుతో దంచుడు..!

● ప్రయాణికుల మైండ్ బ్లాంక్ అయ్యేలా అడ్డగోలుగా చార్జీలు ● డీటీసీ మోహన్ ఆదేశాలతో ప్రైవేటు బస్సులపై దాడులు ● 16 ప్రైవేటు బస్సులు సీజ్.. 151 బస్సులపై కేసులు నమోదు ● రూ.28.24 లక్షల జరిమానా విధింపు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: దసరా పండుగను ప్రైవేటు బస్సు యజమానులు అడ్డగోలుగా ఎన్ 'క్యాష్' చేసుకున్నారు. కాంట్రాక్టు క్యారేజీ పర్మిట్లతో స్టేజి క్యారీయింగ్ చేయటమే కాక ప్రయాణికుల నుంచి భారీగా చార్జీలు దండుకున్నారు. పండగ రద్దీ ఎక్కువగా ఉండటంతో ఈ డిమాండ్‌ను సొమ్ముచేసుకునే పనిలో ప్రైవేటు ఆపరేటర్లు పడ్డారు. ఆర్టీసీ బస్సుల్లో రూ.900లోపు చార్జీ ఉండగా రూ.1500 వరకు ప్రైవేటు ఆపరేటర్లు వసూలు చేశారు. బెంగళూరు అయితే దోపిడీ మరీ దారుణంగా ఉంది. రూ. 3500 నుంచి రూ. 4వేల వరకు వసూలు చేశారు. చెన్నైకు రూ.2500 నుంచి రూ.3వేల అడ్డంగా వసూలు చేశారు. సాధారణ రోజుల్లో ఆర్టీసీ కంటే తక్కువ ధరలకు తీసుకువెళ్లే ప్రైవేటు బస్సు ఆపరేటర్లు పండుగలు, పబ్బాలు వచ్చినపుడు వచ్చేరద్దీని ఎన్‌క్యాష్' చేసుకునేందుకు రేట్లను భారీగా పెంచి వసూలు చేశారు. పండగకు సొంతూళ్లకు రావటానికి సిద్ధమైన ప్రయాణికులకు ప్రైవేటు ఆపరేటర్లు భారీ ధరలను చెప్పటం చూసి అవాక్కయ్యారు. ఆన్‌లైన్ పోర్టల్స్‌లో ఒక ధర చూపించి బస్సుల్లో మరో ధరను చెప్పటంబ ప్రయాణికులు విస్తుపోయారు. నిబంధనల ప్రకారం ప్రైవేటు బస్సుల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లను విక్రయించకూడదు. చేసేది అనధికారిక రిజర్వేషన్! అందులోనూ ప్రయాణికులు బస్సుల్లో ఎక్కిన తర్వాత పాటించలేదు. దీంతో ప్రయాణికులు, ప్రైవేటు బస్సుల్లోని సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో కొందరు ప్రయాణికులు రవాణా శాఖాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో జిల్లా ఉప రవాణా శాఖ అధికారి మోహన్ తక్షణం స్పందించారు. ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తుండటాన్ని సహించవద్దని ప్రైవేటు బస్సులను ఆకస్మికంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. దీంతో తనిఖీ అధికారులు బృందాలుగా విడిపోయి 200 బస్సుల వరకు తనిఖీలు చేపట్టారు. మొత్తం 151 బస్సుల్లో ప్రయాణికుల నుంచి అధిక ధరలు వసూలు చేశారని నిగ్గు తేలింది. దీంతో 151 బస్సులపై అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ బస్సుల యాజమాన్యాలు పన్నులు కూడా సరిగా చెల్లించటం లేదని గుర్తించారు. ఈ బస్సులపై మొత్తం రూ.28.24 లక్షల జరిమానా విధించినట్టు డీటీసీ ఏ మోహన్ తెలిపారు. 16 బస్సుల్లో కనీస రవాణా నిబంధనలను కూడా పాటించటం లేదని గుర్తించారు. బస్సుల్లో ప్రాణాంతక పరిస్థితులు ఉండటంతో మొత్తం 16 బస్సులు సీజ్ చేశారు.

డబ్బుల కోసమే హత్య!

● లోకో పైలెట్ హత్యకు ముందు ట్రాక్‌మెన్లకు బెదిరింపులు ● భయంతో పారిపోయిన ట్రాక్‌మెన్లు ● తర్వాత కాసేపటికే లోకో పైలెట్‌పై దాడి ● నిందితుడి అరెస్టు

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నైజాం గేటు ఎఫ్ పాత క్యాబిన్ వద్ద జరిగిన లోకో పైలెట్ హత్య కేసులో నిందితుడ్ని ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. డబ్బుల కోసమే ఈ హత్య చేశాడని నిర్ధారించారు. ఆ వివరాలను డీఎస్పీ రత్నరాజు, ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ శనివారం వెల్లడించారు. బిహార్ రాష్ట్రం బక్సర్ జిల్లా బారు ప్రాంతానికి చెందిన దేవకుమార్ సాహో కొద్దిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చాడు. ఈనెల 9న రాత్రి దుర్గగుడి టోల్‌గేట్ ప్రాంతంలో గంజాయి మత్తులో హల్‌చల్ దీంతో చేశాడు. పోలీసులు అతడ్ని జీపులో తీసుకెళ్లి రైల్వేస్టేషన్ వద్ద దింపేశారు. అక్కడి నుంచి లోపలకు వెళ్లిన దేవకుమార్ కాసేపు 8,9,10 ప్లాట్‌ఫాంలపై తిరిగాడు. అక్కడే ప్రయాణికులను బెదిరించి డబ్బులు వసూలు చేయాలని భావించాడు. ప్రయాణికులు ఎక్కువగా ఉండడం, విద్యుత్‌దీపాలుండడంతో ప్లాన్ పనిచేయదని భావించి 10వ నంబరు ప్లాట్‌ఫాం పైకి వెళ్లాడు. అక్కడ చొక్కా విప్పేసి ఒక ప్రదేశంలో దాచుకుని నడుచుకుంటూ డీజిల్ షెడ్ వైపునకు వెళ్లాడు. వెళ్తూ వెళ్తూ పట్టాల పక్కనున్న ఇనుప బద్ధను తీసుకెళ్లాడు. అక్కడ హైదరాబాద్ ట్రాక్‌పై పనిచేస్తున్న ట్రాక్‌మన్ విజయ్‌కుమార్‌ను డబ్బులివ్వాలని బెదిరించాడు. లేవని చెప్పడంతో దాడికి ప్రయత్నించాడు. పక్కనే విశాఖపట్నం ట్రాక్‌పై పనిచేస్తున్న ట్రాక్‌మన్ రమేష్ దీన్ని గమనించి అతడి ముఖంపై టార్చిలైట్ వేశాడు. దీనితో విజయ్‌కుమార్ పారిపోయాడు. తర్వాత రమేష్‌పై దాడికి ప్రయత్నించాడు. అతడూ పారిపోయాడు. అనంతరం ఎఫ్ పాత క్యాబిన్ వైపునకు వెళ్లాడు. అక్కడ నడుచుకుంటూ ఇంజన్ వద్దకు వెళ్తున్న లోకో పైలెట్ ఎబునైజర్‌ను డబ్బులడిగాడు. లేవని చెప్పడంతో చెప్పడంతో దాడికి దిగాడు. ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో దేవకుమార్ ప్యాంటు జేబులోని ఆధార్‌కార్డు ఘటనా స్థలంలో పడిపోయింది. ఎబునేజర్‌ను బలంగా తోసేయడంతో చొప్పులు వేర్వేరుగా పడ్డాయి. కిందపడిపోయిన తర్వాత ఇనుప బద్దతో దాడి చేశాడు. కదల్లేని స్థితిలో ఉన్న ఎబునేజర్ జేబులో నుంచి రూ.750 తీసుకున్నాడు. దేవకుమార్ ఏం చేస్తున్నాడోనని ఇద్దరు ట్రాక్‌మన్లు దూరం నుంచి చీకట్లో గమనిస్తున్నారు. కాసేపటికి ఎఫ్ పాత క్యాబిన్ ప్రాంతం నుంచి పెద్దగా కేకలు వినిపించాయి. ఎవరి పైనో దేవకుమార్ దాడి చేశాడని భావించారు. తర్వాత పనిలో మునిగిపోయారు. ఎబునేజర్‌పై దాడి తర్వాత నైజాం గేటు వద్ద ఆటోలో నిద్రపోతున్న డ్రైవర్‌పైనా డబ్బుల కోసం దాడి చేశాడు. తర్వాత అక్కడి నుంచి పదో నంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చి చొక్కా తొడుక్కుని గూడ్స్ యార్డులోకి వెళ్లిపోయాడు. పోలీసులు దేవకుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

చెన్నైకు యథావిధిగా రైళ్ల పునరుద్ధరణ!

● ఆదివారం ఉదయం నుంచి రైళ్ల రాకపోకలు
● పండగ తిరుగు ప్రయాణాల నేపథ్యంలో ప్రయాణికులకు ఊరట

ఆంధ్రజ్యోతి, విజయవాడ: చెన్నైలో ఘోర రైలు దుర్ఘటన నేపథ్యంలో, రద్దయిన రైళ్లు ఆదివారం యథావిధిగా నడిచాయి. నగరం నుంచి చెన్నై బయలుదేరే రైళ్లతో పాటు, నగరం మీదుగా చెన్నై వెళ్లే విశాఖపట్నం, ఇతర డివిజన్ల రైళ్లు కూడా ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. చెన్నై ఉదంతంతో డివిజన్ నుంచి మొత్తం 12 రైళ్లను రద్దు చేశారు. వీటిలో ప్రధానమైన పినాకినీ ఎక్స్‌ప్రెస్ ఒకటి. ఘటన తర్వాత పునరుద్ధరణ నేపథ్యంలో నగరం నుంచి వెళ్లే రైళ్ళను గుంటూరు, రేణిగుంట, అరక్కోణం మీదుగా చెన్నైకు బయలుదేరి వెళ్లాయి. ఆదివారం ఆ పరిస్థితి లేకుండా పోయింది. పండగ తిరుగు ప్రయాణాల నేపథ్యంలో చాలామంది చెన్నైకు వెళ్లాల్సి వచ్చింది. ఆదివారం పూర్తిస్థాయిలో రైళ్లను పునరుద్ధరించటంతో ఎలాంటి సమస్యా లేకుండా బయలుదేరాయి.

రాష్ట్రంలో మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటుకు సన్నాహాలు

● మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అరిందం ఘోష్



గన్నవరం: రాష్ట్రంలో మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అరిందం ఘోష్ తెలిపారు. ఆదివారం గన్నవరంలోని కల్యాణి టవర్స్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 50 వరకూ మోటార్ స్పోర్ట్స్ క్లబ్‌లు ఉన్నాయన్నారు. ఏపీలోనూ ఏర్పాటు చేసి కార్ రేసింగ్‌లు నిర్వహించేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. గతంలో మాదిరిగా సీఎం చంద్రబాబు క్రీడలను ప్రోత్సహిస్తూ క్లబ్ ఏర్పాటుకు సహకారం అందిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో సీఎంను కలిసి అనుమతులు కోరతామన్నారు. కార్ రేసింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు దేశీయ కంపెనీలు ఎంఆర్ఎఫ్, జేకే టైర్స్ వంటివి ముందుకు వస్తున్నాయన్నారు. మోటార్ స్పోర్ట్స్ పట్ల దేశవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించటమే కాకుండా ఈ రంగంలో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆసియన్ పసిపిక్ కార్ రేస్ ప్రొమోటర్ వంశీ మెర్ల మాట్లాడుతూ మోటార్ స్పోర్ట్స్ రంగంలో అరిందం ఘోష్‌కు 50ఏళ్ల విశేష అనుభవం ఉందన్నారు. ఎన్నో సార్లు విజేతగా నిలిచారన్నారు. ఆయన ప్రోత్సాహంతో ఏపీలోనూ మోటార్ స్పోర్ట్స్ క్లబ్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తొలుత కలకత్తా నుంచి గన్నవరం విమానాశ్రయం నుంచి చేరుకున్న అరిందం ఘోష్‌కు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి కార్ల ర్యాలీగా గన్నవరం వచ్చారు.

నలుగురి జీవితాల్లో వెలుగులు

బ్రెయిన్‌డెడ్ అయిన శ్రీనివాసరావు అవయవదానం



ఆటోనగర్, అక్టోబరు 13: ఇంటికి పెద్దదిక్కు. కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న ఆ కుటుంబం మంచి మనసున్న మనుషులుగా నిరూపించుకున్నారు. మరణించిన ఆ ఇంటి పెద్ద అవయవాలను దానం చేసి నాలుగు కుటుంబాల్లో నూతన జీవితాలను ప్రసాదించారు. బాపట్ల జిల్లా నిజాంపట్నంకు చెందిన చెన్ను శ్రీనివాసరావు (48)బైక్ పైన ప్రయాణిస్తుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితిని చూసిన వైద్యులు క్రినియోటమీ శస్త్ర చికిత్స నిర్వహించారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో మార్పు లేదు. దీంతో వైద్య బృందం శ్రీనివాసరావు బ్రెయిన్‌డెత్ అయినట్టు ప్రకటించి కుటుంబ సభ్యులకు తెలిపారు. శ్రీనివాసరావు భార్య విజయలక్ష్మి, కుమారులు సురేష్, సుబ్రహ్మణ్యంకు అవయదానంపై వైద్యులు అవగాహన కల్పించగా, వారు అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని ఏపీ జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్ కే రాంబాబు దృష్టికి తీసుకుని వెళ్లగా, ఆయన శ్రీనివాసరావు శరీరంలో పనిచేస్తున్న కాలేయం, కిడ్నీలు సేకరించేందుకు అనుమతించారు. దీంతో వైద్యబృందం శ్రీనివాసరావు అవయాలు సేకరించి జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం సీనియారిటి లిస్టును అనుసరించి అవయాలను కేటాయించారు. శ్రీనివాసరావు కుటంబాన్ని ప్రజలు ఆదర్శంగా తీసుకుని అవయదానం చేయడానికి ముందుకు రావాలని కే రాంబాబు పిలుపునిచ్చారు.





భవానీలతో మాట్లాడుతున్న ఈవో కేఎస్ రామారావు



ఆలయం అరుణవర్ణం

● భవానీలతో దుర్గగుడి రద్దీ ● ఈవో రామారావు పర్యవేక్షణ

వన్‌టౌన్, అక్టోబరు 13: ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలు ముగిసినప్పటికీ 11వ రోజైన ఆదివారం పెద్దసంఖ్యలో భవానీ దీక్షాదారులు, సాధారణ భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా క్యూలైన్లలో ఉన్న భవానీలను ఈవో రామారావు స్వయంగా పలకరించి దర్శనం, తదితర మౌలిక వసతులపై ఆరా తీసి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భవానీలకు దేవస్థానం తరపున అందిస్తున్న సేవలను వివరించారు. అమ్మవారి శీఘ్రంగా దర్శించుకునేందుకు ఆయన అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. భవానీలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. విమర్శలకు తావులేకుండా, తోపులాటలు, గొడవలు లేకుండా దర్శనాలు, ప్రసాదాల విక్రయాలు, భోజన ఏర్పాట్లు, ప్రసాదాల పంపిణీ అన్నింటిపైన ఆదేశాలు జారీచేశారు.



ఉమ్మడికృష్ణా బాలికల బాస్కెట్ బాల్ టీమ్‌కు రన్నరప్ ట్రోఫీ ప్రదానం చేస్తున్న అమలాపురం ఎంపీ గంటి హరీష్

రాష్ట్ర బాస్కెట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి కృష్ణా బాలికల టీమ్‌కు రన్నరప్

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 13: విజయ దశమి రోజున ఉమ్మడి కృష్ణా బాలికల బాస్కెట్‌బాల్ టీమ్ రన్నరప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ నెల 10 నుంచి 12 వరకు రామచంద్రాపురంలో జరిగిన 9వ సబ్ జూనియర్ ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల (రాష్ట్రస్థాయి) బాస్కెట్ బాల్ టోర్నీలో ఆతిథ్య జట్టు తూర్పుగోదావరి జిల్లాతో జరిగిన ఫైనల్స్‌లో 33-59తో ఉమ్మడి కృష్ణా టీమ్ పరాజయం పాలైంది. తొలుత కృష్ణా టీమ్ సెమీస్‌లో చిత్తూరుపై 37-29తోను గెలిచి ఫైనల్స్‌కు చేరింది. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ రన్నరప్ ట్రోఫీ, మెడల్స్‌ను బహూకరించారు. విజయదశమి రోజున ఉమ్మడి కృష్ణా రన్నరప్‌ను సాధించడంపై కేడీబీఏ కార్యదర్శి జి సుభాష్‌చంద్రబోస్, ఏపీబీఏ కార్యవర్గం అభినందనలు తెలిపింది.

దసరా మహోత్సవాల్లో

లడ్డూ ప్రసాదానికి గిరాకీ

● గత ఏడాది 13.40 లక్షల విక్రయాలు ● ఈ ఏడాది 22 లక్షల విక్రయాలు ● చివరిరోజున 6.02 లక్షల విక్రయాలు





దుర్గగుడిలో లడ్డూలను చుడుతున్న సిబ్బంది, ఆరబెట్టిన లడ్డూ ప్రసాదాలు

వన్‌టౌన్, అక్టోబరు 13: దుర్గగుడిలో జరిగిన దసరా మహోత్సవాల్లో లడ్డూ ప్రసాదానికి గిరాకీ బాగా పెరిగింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు లడ్డూ ప్రసాదాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. ఈవో కేఎస్ రామారావు ముందస్తుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులకు లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు చేపట్టారు. కనకదుర్గానగర్‌లో 11 లడ్డూ విక్రయ కేంద్రాలు, మోడల్ గెస్ట్‌హౌస్, ఓం టర్నింగ్, రైల్వే స్టేషన్, బస్టేషన్ ప్రాంతాల్లో ప్రత్యేక లడ్డూ విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ప్రారంభానికి ముందు ఈవో అధికారులతో చర్చించారు. భక్తులకు లడ్డూ ప్రసాదాలు ఎన్ని కావాలన్నా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లడ్డూ తయారీకి సిబ్బందిని కూడా పెద్దఎత్తున నియమించి ప్రస్తుతం లడ్డూ తయారు చేస్తున్న కేంద్రంతో పాటు అదనంగా శృంగేరి మఠం పక్కనే ఉన్న రేకులషెడ్డులో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. 80 గ్రాముల ఒక లడ్డూ ధర రూ.15, 400 గ్రాముల పెద్ద లడ్డూ ధర రూ.100, 6 లడ్డూల బాక్స్ రూ.100 చొప్పున అధికారులు విక్రయించారు. గత ఏడాది ఉత్సవాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి దసరా విజయదశమి రోజు వరకు 13లక్షల 40వేల లడ్డూలు విక్రయించారు. ఒక్క విజయదశమి రోజునే 4.92 లక్షల లడ్డూలు విక్రయించారు. ఈ ఏడాది ఉత్సవాలు ప్రారంభమైన మొదటి రోజు నుంచి విజయదశమి రోజు వరకు 22 లక్షల లడ్డూలు విక్రయించారు. విజయదశమి రోజున 6.02 లక్షల లడ్డూలు విక్రయించారు. భక్తులు ఎన్ని లడ్డూలు అడిగినా విక్రయించమని ఈవో చేసిన సూచనల మేరకు అధికారులు లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉంచారు. భక్తులు పెద్ద ఎత్తున తమకు కావాల్సిన లడ్డూలను కొనుగోలు చేశారు. ప్రత్యేకంగా బాక్స్‌ల్లో ఉన్న లడ్డూలను భక్తులు ఎక్కువగా కొనుగోలు చేశారు.

వైసీపీ అరాచకాలపై చర్యలేవీ?
గుంటూరులో కోపూరి లక్ష్మి ఆమరణ దీక్ష


గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కోపూరి లక్ష్మి, తెలుగు మహిళలు

గుంటూరు, అక్టోబరు 13: గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి స్వీయ గృహ నిర్బంధ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. దసరా సందర్భంగా శనివారం ప్రారంభించిన దీక్ష ఆదివారం రెండో రోజూ కొనసాగింది. ఇదే అంశంపై సార్వత్రిక ఎన్నికల ముందు ఏప్రిల్ 20న ఢిల్లీలో ఆమె బొటనవేలు నరుక్కున్న ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనా వైసీపీ అరాచకాలపై చర్యలు తీసుకోలేదని, దీంతో దుండగులు తనపై యాసిడ్, పెట్రోల్ బాంబుతో దాడికి యత్నించారని ఆమె పేర్కొన్నారు. నెల క్రితం సీఎం చంద్రబాబుకు స్వయంగా ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. ఆమె దీక్షకు పలువురు తెలుగు మహిళలు మద్దతు ప్రకటించి దీక్షలో కూర్చున్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో వృద్ధులకు మరిన్ని లాభాలు

- అల్జీమర్స్, మానసిక సమస్యలను చేర్చే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 13: దేశంలో 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని వర్తింపజేస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఏబీ-పీఎంజేఏవై పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు మరిన్ని ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని నేషనల్ హెల్త్ అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) భావిస్తోంది. ఈ పథకం కింద ఆరోగ్య ప్రయోజనాలను నిర్ణయించే కమిటీ.. ప్రత్యేకంగా వృద్ధుల సంరక్షణకు ప్రాధాన్యమిచ్చే మరిన్ని ప్యాకేజీలను జోడించే అంశాలను పరిశీలిస్తోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఏబీ-పీఎంజేఏవైలో ప్రస్తుతం జనరల్ మెడిసిన్, సర్జరీ, ఆంకాలజీ, కార్డియాలజీ వంటి 27 రకాల స్పెషాలిటీల్లో 1,949 వైద్య సేవలతో సమగ్ర కవరేజీని అందిస్తున్నారు. అయితే 70 ఏళ్లు పైబడిన వారిలో ఎక్కువగా కనిపించే అల్జీమర్స్, చిత్తవైకల్యం వంటి కొన్ని మానసిక సమస్యలకు అవసరమైన చికిత్స కూడా ఈ పథకంలో అందించాలని ఎన్‌హెచ్‌ఏ భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, వృద్ధుల కోసం విస్తరించే ఈ పథకాన్ని ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

కేంద్రమంత్రి కుమారస్వామిపై పోలీసులకు లోకాయుక్త ఏడీజీపీ ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి కుమారస్వామి, ఆయన కుమారుడు జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్‌కుమార్‌పై లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేంద్రమంత్రి కుమారస్వామి గతనెలలో తనపట్ల అనవసర ఆరోపణలు చేశారని, మౌఖికంగా బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిఖిల్ దురుద్దేశపూర్వకంగా పలు వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. కుమారస్వామి ఆప్తుడు సురేశ్‌బాబు సోషల్ మీడియాలో బెదిరింపులకు దిగాడని, వీరిపై చర్యలు తీసుకోవాలని బెంగళూరులోని సంజయ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఏడీజీపీ ఫిర్యాదు చేశారు. తాను లంచం తీసుకున్నానని ఆరోపించారని, ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయిస్తానని బెదిరించారనీ, కుటుంబ సభ్యులపైనా తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ... ఏడీజీపీ చంద్రశేఖర్‌కు చట్టప్రకారమే సమాధానం చెబుతానన్నారు.

బెంగాల్ సర్కారుకు సీనియర్ వైద్యుల హెచ్చరిక

కోల్‌కతా, అక్టోబరు 13: ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటన పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కుదిపేస్తోంది. బాధితురాలికి న్యాయం చేయాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతు పెరుగుతోంది. ఇప్పటికే వారికి సంఘీభావంగా ఆర్‌జీ కర్ ఆస్పత్రితో సహా పలు ఇతర ప్రభుత్వ హాస్పిటల్స్‌కు చెందిన సీనియర్ వైద్యులు రాజీనామా చేయగా.. తాజాగా కల్యాణి జేఎన్‌ఎం ఆస్పత్రికి చెందిన 77 మంది సీనియర్ వైద్యులు కూడా మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు వెస్ట్ బెంగాల్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు ఈమెయిల్ ద్వారా తెలిపారు. ఈనెల 14లోగా ఆందోళనకారుల డిమాండ్లను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోకుంటే విధులు బహిష్కరించి, మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని స్పష్టం చేశారు.

ఉద్యోగులకు కార్లు, బైకులు గిఫ్ట్

- సంస్థ అభివృద్ధికి కృషి చేసిన వారికి చెన్నై కంపెనీ బంపర్ ఆఫర్

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యజమాన్యాలు తమ సంస్థల్లోని ఉద్యోగులకు బోనస్‌లు లేదా ఇతరత్రా రూపాల్లో ప్రోత్సాహకాలు ఇవ్వడాన్ని చూస్తుంటాం. అయితే చెన్నైలోని టీమ్ డీటెయిలింగ్ సొల్యూషన్స్ అనే కంపెనీ.. సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన, నిబద్ధత చూపిన కొంత మంది ఉద్యోగులకు వారి కష్టానికి గుర్తింపుగా కార్లు, బైకులను కానుకలుగా ఇచ్చింది. 28 మందికి కార్లు, మరో 29 మందికి మోటారు బైకులు గిఫ్టులుగా పంచిపెట్టింది. వీటిలో హ్యుండాయ్, టాటా, మారుతి సుజుకీ, మెర్సిడెస్ బెంజ్ వంటి బ్రాండ్ల కార్లున్నాయి. కంపెనీ మరింత అభివృద్ధి బాటలో పయనించేందుకు, ఉద్యోగుల ఉత్పాదకతను పెంచేందుకు ప్రోత్సాహకంగా ఈ విధంగా చేసింది. దీనిపై కంపెనీ ఎండీ శ్రీధర్ కన్నన్ మాట్లాడుతూ తమ సంస్థ విజయాల బాటలో పయనించేందుకు ఉద్యోగులు చేస్తున్న కృషికి గుర్తింపు ఇవ్వాలనుకున్నామన్నారు. ఉద్యోగులే తమ ఆస్తి అని చెప్పారు. పనితీరు, అనుభవాన్ని బట్టి ఉద్యోగుల భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. తమ కంపెనీలో 180 మంది పనిచేస్తున్నారని, వారిలో చాలామందికి కార్లు, బైకులు కొనాలనే ఆశలు ఉంటాయని, వాటిని నెరవేర్చేలా ఇలాంటి కానుకలను అందిస్తున్నామన్నారు. పెళ్లి చేసుకోబోయే ఉద్యోగులకు సంస్థ నుంచి ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఒకవేళ కంపెనీ ఇచ్చిన కార్లు, బైకుల బ్రాండ్లు నచ్చకపోతే ఉద్యోగులు తమకు నచ్చిన వాహనాలను వాటి ధరకు అయ్యే అదనపు మొత్తం చెల్లించి కొనుగోలు చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నామని వివరించారు.

దారితప్పిన 'ఉపాధి' నాణ్యత!

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'క్వాలిటీ కంట్రోల్' విభాగం నిర్వీర్యం

- సిఫారసులతో జేక్యూసీఓల నియామకాలు
- నామమాత్రపు తనిఖీలతో సరి
- ఖాళీగానే పలు ఎస్‌క్యూసీఓ పోస్టులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన క్వాలిటీ కంట్రోల్(నాణ్యతా నియంత్రణ) విభాగాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. నామమాత్రపు తనిఖీలతో, పథకం కింద చేపట్టిన పనుల్లో నాణ్యత లేకుండా గాలికొదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు(జేక్యూసీఓ) నియామకాలు పారదర్శకంగా జరగలేదు. అప్పటి అధికార పార్టీ నేతలు చెప్పిన వారినే జేక్యూసీఓలుగా నియమించడంతో పనుల తనిఖీ సరిగ్గా జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం జేక్యూసీఓలను బదిలీ చేసి నిజాయితీపరులైన కొత్తవారిని నియమించాల్సిన అవసరముందని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించేందుకు విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్, అంబుడ్స్‌మన్, సోషల్ ఆడిట్ విభాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. ఉపాధి పనుల్లో నాణ్యత కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనరేట్‌లో క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలో చురుగ్గా ఉన్న విభాగాన్ని జగన్ సర్కార్ బలహీనం చేసింది.

పలు ఎస్‌క్యూసీఓల పోస్టులు ఖాళీ

ప్రతి జిల్లాలో క్వాలిటీ కంట్రోల్ విభాగానికి ఒక్కో ఎస్‌క్యూసీఓ అధికారి ఉండాల్సి ఉండగా 26 జిల్లాలకు 13 మంది మాత్రమే పనిచేశారు. ఇటీవల ఎస్‌క్యూసీఓలు సొంత శాఖలో పదోన్నతిపై వెళ్లడంతో ఇప్పుడు కేవలం శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే ఎస్‌క్యూసీఓలు మిగిలి ఉన్నారు. మిగిలిన అన్ని జిల్లాల్లో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇంజనీర్ల కొరత ఉండటంతో ఈ పోస్టుల కోసం వచ్చే అధికారులు కూడా లేరని చెప్తున్నారు. వైసీపీ సర్కార్ హయాంలో జిల్లాల్లో ఎస్‌క్యూసీఓలను ప్రాజెక్టు డైరెక్టర్ నియంత్రణలో ఉంచారు. దీంతో అన్ని జిల్లాల్లో ప్రాజెక్టు డైరెక్టర్లు అప్పట్లో ఉపాధి పథకంలో అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఎస్‌క్యూసీఓలను నియంత్రించారు. దీంతో డ్వామా కార్యాలయంలో క్వాలిటీ విభాగానికి పెద్దగా ఆదరణ లేకుండా పోయింది. పనుల్లో నాణ్యత లోపాలను మండలాల్లో వైసీపీ నేతలు మేనేజ్ చేయసాగారు. కొన్ని చోట్ల జేక్యూసీఓలు పనులు చేపట్టిన వారివద్ద నుంచి ముడుపులు తీసుకుని క్వాలిటీ బాగుందని నివేదిక రాయించుకునేవారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం గత ఐదేళ్లలో చేపట్టిన పనులకు సంబంధించి పెద్దగా రికవరీలు చేసిన దాఖలాల్లేవు. గతంలో టీడీపీ సర్కార్ హయాంలో నాణ్యతలో లోపాలను గుర్తించి రూ.17 కోట్లు రికవరీ విధించినా... వాటిని వసూలు చేసిన దాఖలాల్లేవు. క్వాలిటీ రికవరీ చెల్లించకుండా కొంతమంది సిబ్బంది దర్జాగా ఉద్యోగాలు చేసుకుంటున్నారు. సిబ్బందిపై చర్యలు తీసుకోకపోవడంతో నాసిరకంగా పనులు చేపట్టి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్వీర్యమైన క్వాలిటీ కంట్రోల్ విభాగంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ దృష్టి పెట్టాలని, నిజాయితీ కలిగిన అధికారులను నియమించి పథకాన్ని గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

సిఫారసులతో జేక్యూసీఓల నియామకాలు

రాష్ట్రవ్యాప్తంగా 36 మంది జేక్యూసీఓలు పని చేస్తున్నారు. గతంలో జిల్లాల్లో నిజాయితీగా పని చేస్తున్న ఇంజనీరింగ్ కన్సల్టెంట్లను జేక్యూసీఓలు నియమించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని తప్పించి.. ఆ పార్టీ నేతలు సిఫారసులు చేసిన వాళ్లను జేక్యూసీఓలుగా ఎంపిక చేశారు. దీంతో ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా నియంత్రణ తనిఖీలు చేపట్టాల్సిన సిబ్బంది.. అధికార నేతల కనుసన్నల్లో పనిచేశారు. కమిషనరేట్ అధికారులు 10 శాతం పనులు ఎంపిక చేసి నాణ్యతను తనిఖీ చేయాలని జిల్లాలకు పంపిస్తారు. ఆయా జిల్లాల్లో స్టేట్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్(ఎస్‌క్యూసీఓ) నియంత్రణలో జేక్యూసీఓలు పనిచేస్తారు. మండలాల్లో పనులను ఎస్‌క్యూసీఓ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టినా, ఎక్కువగా ఫీల్డ్‌లో జేక్యూసీఓలు పనిచేస్తారు. ఎస్‌క్యూసీఓలుగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులే పనిచేస్తున్నారు.

బాకీ వసూలు కోసం.. భర్త నిర్బంధం.. భార్య ఆత్మహత్య

- మనస్తాపంతో పురుగుల మందు తాగిన మహిళ


చెంచులక్ష్మి(ఫైల్)

రాపూరు, అక్టోబరు 13: బాకీ వసూలు కోసం భర్తను నిర్బంధించడంతో మనస్తాపానికి గురైన ఆయన భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నెల్లూరు జిల్లా రాపూరు మండలం మద్దెలమడుగు గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా డక్కిలి మండలం దండోలు గ్రామానికి చెందిన ఏకోలు రవీంద్ర, చెంచులక్ష్మి(24) అనే గిరిజన దంపతులను అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని ఒక గ్రామం వద్ద సిమెంటు అచ్చులు తయారీ పనుల కోసం యజమాని వెంకట సుబ్బారెడ్డి తీసుకెళ్లాడు. సరైన కూలి రాకపోవడంతో వారు రాపూరు మండలం మద్దెలమడుగు వద్ద వేరే పనిలో చేరారు. బకాయి నిమిత్తం కొంత డబ్బును యజమాని సుబ్బారెడ్డికి పంపించారు. అయినా అంగీకరించని వెంకట సుబ్బారెడ్డి ఇటీవల కొంత మందితో కలిసి మద్దెలమడుగు వద్దకు వచ్చి రవీంద్రను బలవంతంగా తీసుకెళ్లాడు. వారం గడిచినా భర్తను వదిలిపెట్టకపోవడంతో మనస్తాపానికి గురైన చెంచులక్ష్మి శనివారం రాత్రి పురుగుల మందు తాగింది. చెంచులక్ష్మిని మొదట రాపూరు ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి జిల్లా గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చనిపోయినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. బాధిత కుటుంబసభ్యులు రాపూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నకిలీ సర్టిఫికెట్లకు చెక్..!

- క్రీడాకారుల కోసం 'ఏపీ క్రీడా యాప్'
- డిజిటలైజేషన్ దిశగా శాప్ అడుగులు
- ఈ యాప్ ద్వారానే స్పోర్ట్స్ సర్టిఫికెట్ల జారీ
- వాటిని 'డిజి-లాకర్'తో అనుసంధానం
- టోర్నమెంట్లకు రిజిస్ట్రేషన్ కూడా యాప్‌లోనే
- రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే సెలెక్షన్స్ నిర్వహణ
- శాప్‌లో కొత్త ఒరవడికి ప్రభుత్వం శ్రీకారం
- నవంబరు నుంచి క్రీడా యాప్ అందుబాటులోకి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్)ను నకిలీ సర్టిఫికెట్ల బెడద తీవ్రంగా వేధిస్తోంది. ఎవరెవరో జారీచేసిన సర్టిఫికెట్లు తీసుకొచ్చి స్పోర్ట్స్ కోటాలో సీట్లు, ఉద్యోగాలు పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లకు సంబంధించిన సర్టిఫికెట్ల గుర్తింపు విషయంలోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో నకిలీ సర్టిఫికెట్లకు చెక్ పెట్టే దిశగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శాప్ 'ఏపీ క్రీడా యాప్' పరిచయం చేయనుంది. ఈ యాప్ ద్వారా.. ఇప్పటికే క్రీడాకారుల వద్ద ఉన్నవి, ఇకపై కొత్తగా జారీచేసే సర్టిఫికెట్లు... నకిలీవో కాదో ధ్రువీకరించవచ్చు. శాప్‌ను పూర్తిగా డిజిటలైజేషన్ చేయడం ద్వారా నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట పడనుంది. యాప్ ఇప్పటికే సిద్ధం కాగా.. త్వరలోనే సీఎం చంద్రబాబు చేతుల మీదగా ఆవిష్కరించి.. నవంబరు నుంచి అందుబాటులోకి తీసుకురానున్నారు.

సాయ్‌తో అనుసంధానం

డిజిటలైజేషన్‌లో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)తో కూడా శాప్ అనుసంధానమైంది. ఏపీ క్రీడా యాప్‌లో 'డిజి-లాకర్' వ్యవస్థ అందుబాటులోకి రానుంది. దీనిలో క్రీడాకారులు తమ సర్టిఫికెట్లను భద్రపరచుకోవచ్చు. వాటిని ఎప్పుడైనా, ఎక్కడైనా.. చూసుకునే, ఎవరికైనా.. చూపించే వీలుంటుంది. అలాగే క్రీడాకారులకు ప్రభుత్వం ఇచ్చే ఇన్సెంటివ్స్ కూడా ఈ యాప్ ద్వారానే అందిస్తారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు తమకు రావాల్సిన ఇన్సెంటివ్స్ కోసం ఈ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అది క్షణాల్లో శాప్‌కు చేరుతుంది. తమ దరఖాస్తు ఆమోదం పొందిందా లేదా అన్న వివరాలను ఆటగాళ్లు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దీంతో వారికి శాప్, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనుండదు.

టోర్నమెంట్ల సమాచారం యాప్‌లోనే

క్రీడా సంఘాలు లేదా శాప్ నిర్వహించే టోర్నమెంట్లను కూడా ఈ యాప్ ద్వారానే క్రీడాకారులకు సమాచారం అందిస్తారు. వ్యక్తిగతంగా లేదా అసోసియేషన్ ద్వారా టోర్నీలో పాల్గొనదలచిన వారు ముందుగా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే సెలెక్షన్స్ నిర్వహించి.. సెలెక్టయిన వారి జాబితాను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. టోర్నీ పూర్తయిన తర్వాత విజేతలు, రన్నరప్‌లు, పాల్గొన్నవారి సర్టిఫికెట్లు మొత్తం నిర్వాహకులు యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆయా క్రీడా సంఘాల అధ్యక్షుడి డిజిటల్ సంతకంతో కూడిన సర్టిఫికెట్ జారీ అవుతుంది. క్రీడాకారులు 'డిజి-లాకర్' ద్వారా తమ లాగిన్‌లో వాటిని భద్రపరుచుకోవచ్చు. ఉద్యోగాలు, అడ్మిషన్ల సమయంలో యాప్‌లోనే వాటిని చెక్ చేసి ధ్రువీకరిస్తారు.

పాత సర్టిఫికెట్లు యాప్‌లోనే..

ఈ ఏడాది నవంబరు నుంచి శాప్ ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. కానీ.. చాలామంది ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొని సర్టిఫికెట్లు పొందారు. వాటిని కూడా శాప్ అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. అవి యాప్ ద్వారా శాప్, క్రీడా సంఘాలకు చేరుతాయి. ఆయా క్రీడా సంఘాలు వాటిని సరైనవో కాదో నిర్ధారిస్తారు. ఒరిజినల్ సర్టిఫికెట్లపై సంఘం అధ్యక్షుడి డిజిటల్ సంతకం చేస్తారు. ఈ తర్వాత క్రీడాకారులు యాప్‌లోనే ఆయా సర్టిఫికెట్లను భద్రపరచుకోవచ్చు.


నిజరూపాలంకరణలో దర్శనమిస్తున్న భ్రమరాంబ దేవి

నిజరూపాలంకరణలో భ్రమరాంబ

శ్రీశైలం, అక్టోబరు 13: దసరా మహోత్సవాల్లో చివరి రోజు శనివారం విజయదశమిని పురస్కరించుకుని నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో భ్రమరాంబదేవి నిజరూపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు నందివాహన సేవను, ఆలయ పుష్కరిణి వద్ద తెప్పోత్సవం కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి యాగశాలలో చండీయాగ పూర్ణాహుతి, స్వామివారి యాగశాలలో రుద్రయాగ పూర్ణాహుతి జరిపారు. మల్లికార్జున గుండం వద్ద చండీశ్వర స్వామికి అవభృథ స్నానం నిర్వహించారు.

ఓటీటీ కంటెంట్‌తో సమాజంపై దుష్ప్రభావం

- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

నాగ్‌పూర్, అక్టోబరు 13 : ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వస్తోన్న కార్యక్రమాలు సమాజంపై దుష్ప్రభావం చూపుతున్నాయని, వాటిని చట్టబద్ధంగా నియంత్రించాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ శనివారం అన్నారు. విజయ దశమి సందర్భంగా స్థానికంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో చూపించే అంశాలు చాలా గందరగోళంగా ఉంటున్నాయని, వాటి గురించి మాట్లాడడం కూడా సభ్యత కాదన్నారు. సమాజంలో నైతిక విలువల పతనానికి అవి ప్రధాన కారణమని, అందువల్ల వాటిని నియంత్రించడం అవసరమన్నారు. సమాజాన్ని ఐక్యం చేసేందుకు, విలువలను బోధించేందుకే సామాజిక మాధ్యమాలని, విచ్ఛిన్నం చేసేందుకు, అసభ్యతను, అనైతికతను ప్రోత్సహించేందుకు కాదని ఆ మాధ్యమాల వినియోగదారులు గుర్తించాలని భాగవత్ సూచించారు. బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాలు భారత్‌లోని హిందువులకు గుణపాఠమని చెప్పారు. పొరుగు దేశంలో హిందువులపై చోటు చేసుకున్న హింసను ఖండించారు. భారత ప్రభుత్వం అక్కడ మైనారిటీలను రక్షించడానికి మరింత చొరవ చూపాలన్నారు. భారత్‌ను ప్రమాదంగా చిత్రీకరిస్తూ... అణుబాంబులు ఉన్న పాకిస్థాన్‌తో చేతులు కలపాలన్న చర్చలు బంగ్లాదేశ్‌లో సాగుతున్నాయని వార్తలు వస్తున్నాయని చెప్పారు. ఆ దేశం ఆవిర్భావానికి మద్దతుగా నిలిచిన భారత్‌కు వ్యతిరేకంగా ఇటువంటి వాతావరణం నెలకొందని, దీన్ని కొన్ని విదేశీ శక్తులు ప్రోత్సహిస్తున్నాయన్నారు. ఆ శక్తులు ఏవన్నది మనకు తెలుసు, దేశంలోనూ అటువంటి పరిస్థితులను సృష్టించాలన్నది వాటి లక్ష్యం అన్నారు.

బతికుంటే.. చనిపోయాడని చెప్పారు!

- నెల్లూరులో వైద్యులు, పోలీసుల నిర్వాకం
- డాక్టర్లు చెప్పారని కుటుంబసభ్యులకు సమాచారమిచ్చిన పోలీసులు
- ఆస్పత్రికి వెళ్లి చూస్తే బెడ్‌పై రోడ్డు ప్రమాదానికి గురైన బాధితుడు


జీజీహెచ్‌లో బెడ్‌పై క్షతగాత్రుడు షేక్ రఫీ

నెల్లూరు(వైద్యం) అక్టోబరు 13: రోడ్డు ప్రమాదానికి గురై గాయాలతో బతికున్న మనిషిని చనిపోయినట్లుగా చెప్పారు.. 'మృతదేహం మార్చురీలో ఉంది. వచ్చి తీసుకుపోండి' అని బాధిత కుటుంబానికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు అంత్యక్రియలకు ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. తీరా బాధిత కుటుంబసభ్యులు వచ్చి చూస్తే ప్రమాదానికి గురైన వ్యక్తి ఆస్పత్రి బెడ్‌పైనే ఉండడం చూసి ఒకింత ఆశ్చర్యానికి, మరోవైపు ఆందోళనకు గురికావడం వారి వంతయింది. ఈ నిర్వాకానికి నెల్లూరు జీజీహెచ్, కొడవలూరు మండలం పోలీసుస్టేషన్ వేదికైంది. అయితే వైద్యుల చెప్పిన మేరకు తాము బాధిత కుటుంబానికి సమాచారం ఇచ్చామని పోలీసులు చెబుతుండగా.. అసలేం జరిగిందనే దానిపై విచారణ జరుపుతామని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ అన్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మాముడూరుకు చెందిన షేక్ రఫీ(44) కుటుంబంతో కొడవలూరు మండలం రాజుపాలెంలో నివాసం ఉంటున్నాడు. అక్కడే ఒక దాబాలో పనిచేస్తున్నాడు. ఈనెల 10వ తేదీ(గురువారం) సాయంత్రం రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఆయన్ను ఢీకొంది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా.. రఫీని నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముందు కొడవలూరు పోలీసులు ముందు రఫీకి జరిగిన ప్రమాదంపై ఆయన భార్యకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత శుక్రవారం రఫీ చనిపోయాడని వైద్యులు చెప్పినట్లు బాధిత కుటుంబసభ్యులకు మరోసారి సమాచారం ఇచ్చారు. రఫీ ఫొటోను సైతం వాట్సప్ ద్వారా పంపించారు. దీంతో కన్నీరు మున్నీరయిన రఫీ భార్య ఆందోళనతో తన తమ్ముడు ఇమ్రాన్‌ఖాన్‌కు ఫోన్ చేసి విషయం చెప్పింది. దూరప్రాంతంలో ఉన్న ఇమ్రాన్‌ఖాన్ శుక్రవారం మధ్యాహ్నం కొడవలూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. మృతదేహాన్ని శనివారం ఉదయం వెళ్లి తెచ్చుకోమని పోలీసులు చెప్పారు. దీంతో మాముడూరుకు వెళ్లిన ఇమ్రాన్‌ఖాన్ దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేశాడు. శనివారం ఉదయం జీజీహెచ్‌కి వచ్చిన కుటుంబసభ్యులు కంగుతిన్నారు. జీజీహెచ్ వార్డులో రఫీ బతికే ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోయారు. బతికే ఉన్న బాధితుడు చనిపోయాడని సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే నర్సులు మాత్రం బాధితుడు వచ్చినప్పుడు సీరియస్‌గానే ఉందని, ప్రస్తుతం కోలుకుంటున్నారని తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం

రఫీని గురువారం సాయంత్రం జీజీహెచ్‌కి తీసుకొచ్చిన తర్వాత అత్యవసర విభాగంలో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం సర్జికల్ వార్డుకు తరలించారు. శనివారం మాత్రమే రఫీకి ఎక్స్‌రే తీశారు. అప్పటివరకు రెండురోజుల పాటు క్షతగాత్రుడిని పట్టించుకోలేదు. ఎక్స్‌రే చూసి కాలు తొడ భాగంలో విరిగిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటనే ఎముకలు, కీళ్ల వ్యాధుల విభాగానికి బాధితుడిని తరలించాల్సి ఉన్నా.. ఆదివారం సాయంత్రం వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో బాధితుడు కదలలేక నరకయాతన అనుభవిస్తున్నాడు.

సైనికుల త్యాగాలపై వివక్ష ఎందుకు?

- అగ్నివీర్ పథకంపై మరోసారి ప్రశ్నించిన రాహుల్

న్యూఢిల్లీ, అక్టోబరు 13: అగ్నివీర్ పథకంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి ప్రశ్నించారు. సైనికుల త్యాగాలపై ఎందుకు తేడా చూపుతున్నారంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. నాసిక్‌లో శిక్షణ పొందుతున్న ఇద్దరు అగ్నివీర్‌లు-గోహిల్ విశ్వరాజ్ సింగ్, సైఫత్ శీత్‌లు మరణించడంపై స్పందిస్తూ ఆయన ఆదివారం హిందీలో ట్వీట్ చేశారు. "వీరి మరణం మరోసారి అగ్నివీర్ పథకంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. వీరికి కూడా అమరులైన ఇతర జవాన్లకు ఇస్తున్న మాదిరిగానే సకాలంలో పరిహారం, పింఛను, ఇతర సౌకర్యాలను ప్రభుత్వం ఎందుకు కల్పించడం లేదు? అమరుల త్యాగాల్లో వివక్ష చూపడం ఎందుకు? ఇది అమరులకు అవమానకరం. ఈ అన్యాయంపై పోరాడాలి. ఒక సైనికుని ప్రాణం కన్నా మరొక సైనికుని ప్రాణం విలువైనదని ప్రధాన మంత్రి, రక్షణ మంత్రి భావిస్తున్నారా? ఇందుకు వారు సమాధానం చెప్పాలి" అని డిమాండు చేశారు. అగ్నివీర్ పథకాన్ని తొలగించేందుకు తాము చేపట్టిన జైజవాన్ ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జనసందోహం నడుమ జంబూ సవారి

- అట్టహాసంగా మైసూరు దసరా వేడుకలు



బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మైసూరు దసరా వేడుకల్లో ప్రధాన ఘట్టమైన జంబూసవారి శనివారం జనసందోహం నడుమ వైభవోపేతంగా సాగింది. మైసూరులో లక్షలాదిమంది సమక్షంలో గజరాజుల విన్యాసాలతో కార్యక్రమం నిర్వహించారు. దసరా నవరాత్రుల్లో చాముండేశ్వరీదేవిని వివిధ రూపాల్లో అలంకరించి, పూజలు చేశారు. ఒడెయార్ రాజవంశం ప్యాలెస్‌లో రాజసంప్రదాయం ప్రకారం వేడుకలు నిర్వహించారు. అభిమన్యు గజరాజు 750 కేజీల బంగారు అంబారితోపాటు చాముండేశ్వరిదేవి విగ్రహాన్ని మోసుకుంటూ ముందుకు కదిలింది. మరో 11 గజరాజులు వెంట నడిచాయి. వందలాది కళాబృందాల ప్రదర్శనలు, డ్రోన్ల విన్యాసాలు అలరించాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకులతో మైసూరు వీధులు కిక్కిరిశాయి. సీఎం సిద్దరామయ్య.. అంబారిపై వచ్చిన చాముండేశ్వరీదేవికి పుష్పార్చన చేశారు.

గుజరాత్‌లో రూ.5వేల కోట్ల కొకైన్ సీజ్

- ఢిల్లీ, ముంబై పోలీసుల సంయుక్త ఆపరేషన్

ఢిల్లీ, అక్టోబరు 13: గుజరాత్‌లో భారీ స్థాయిలో డ్రగ్స్ డెన్ బట్టబయలైంది. రూ5,620 కోట్ల విలువైన 518 కిలోల కొకైన్ పట్టుబడింది. ఢిల్లీ, గుజరాత్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి గుజరాత్ అంకలేశ్వర్‌లోని అవకర్ డ్రగ్స్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ నుంచి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఢిల్లీకి చెందిన తుషార్ గోయల్ (40), హిమాన్షు కుమార్ (27), ఔరంగాజేబ్ సిద్దిఖీ (23), ముంబైకి చెందిన భరత్ కుమార్ జైన్ (48), యూపీలోని హాపూర్‌కు చెందిన అఖ్లక్‌ను అరెస్టు చేశారు. గత 11 రోజుల్లో ఈ స్థాయిలో డ్రగ్స్ సీజ్ చేయడం మూడోసారి కావడం గమనార్హం. ఈ నెల 10న ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ బృందం రూ.2వేల కోట్ల విలువైన 200 కిలోల కొకైన్‌ను పశ్చిమ ఢిల్లీలోని రమేశ్ నగర్‌లో స్వాధీనం చేసుకున్నారు.

భూమిని తిరిగి ఇచ్చేస్తాం

- ఖర్గే కుటుంబం ప్రకటన
- కేఐఏడీబీకి రాహుల్ ఖర్గే లేఖ



బెంగళూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు రాహుల్ ఖర్గే నేతృత్వంలోని సిద్దార్థ విహార ట్రస్టుకు ఐదెకరాల భూమి కేటాయింపుపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో....ఆ భూమిని ప్రభుత్వానికి తిరిగి ఇస్తూ లేఖ రాశారు. బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు అనుబంధంగా ఉండే బెంగళూరు ఏరోస్పేస్ పార్కులో ఐదెకరాల భూమిని ప్రజా సౌకర్యాలకు కేటాయించడం వివాదాస్పమైంది. సిద్దార్థ విహార ట్రస్టుకు కేటాయించిన ఆ భూమిని ఇటీవల ప్రభుత్వానికి వాపసు చేస్తూ రాహుల్ ఖర్గే.. కర్ణాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి బోర్డు (కేఐఏడీబీ)కి లేఖ పంపారు. బెంగళూరులోని ఏరోస్పేస్‌పార్కులో గతంలో స్థలాలు పంపిణీ చేశారు. అప్పట్లో 193 సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిలో 43 సంస్థలను ఎంపిక చేశారు. అందులో సిద్దార్థ విహార ట్రస్టుకు ఐదెకరాల భూమిని కేటాయించడం వివాదానికి దారితీసింది. బీజేపీ రాజ్యసభ సభ్యుడు లెహర్‌సింగ్ సిరోయా రెండు నెలల క్రితం...'ఖర్గే కుటుంబం ఏరోస్పేస్ వ్యవస్థాపకులుగా ఎప్పుడు మారిందో' అంటూ 'ఎక్స్'లో సంచలన పోస్టు చేశారు. బీజేపీ ఐటీ విభాగ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ కూడా స్పందిస్తూ అధికార దుర్వినియోగం, బంధుప్రీతి, ప్రయోజనాల సంఘర్షణ అని స్థలాల కేటాయింపుపై వ్యాఖ్యలు చేశారు. ట్రస్టుకు భూమి కేటాయించే విషయంలో ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించిందని, హడావుడిగా స్థలం మంజూరు చేశారని విధాన పరిషత్‌లో ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి ఆరోపణలు గుప్పించారు. సిద్దార్థ విహార ట్రస్టుకు కేటాయించిన భూమిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ స్పందించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్‌కు కేఐఏడీబీలో ఐదు ఎకరాల భూమి కేటాయింపునకు సంబంధించి సమగ్ర వివరాలు పంపాలని ఆదేశించారు. అన్నివైపులా ఒత్తిడి రావడంతో ట్రస్టు ముఖ్యులు రాహుల్ ఖర్గే సదరు భూమిని వాపసు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. భూమి పొందడంలో నిబంధనలు పాటించామన్నారు. అది పబ్లిక్ ట్రస్టు అనీ, ఎలాంటి రాయితీలు ఉండవనీ, నైపుణ్య శిక్షణా కేంద్రం కోసం తీసుకున్నామన్నారు. ఇందులో అక్రమాలకు పాల్పడి ఉందుంటే ప్రధాని మోదీ, అమిత్‌షా వదిలిపెట్టేవారా..? అంటూ ప్రశ్నించారు.